

మిస్ యూనివర్స్-2025 2లో

## మెక్సికో సుందరి ఫాతిమా బోష్

WWW.VAARTHA.COM epaper.vaartha.com

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

22-11-2025 శనివారం
సంపుటి: 31 సంచిక: 291
పేజీలు: 12 వెల: 6.50
ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP కపిల్ చిట్స్ 45
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

# మూడేళ్లలో 17లక్షల ఇళ్లు

### మూడు నెలలకోసారి సామూహిక గృహప్రవేశాలు

### వచ్చే ఉగాదికి 5లక్షల మందికి ఇళ్లు అందజేత

### లబ్ధిదారుల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

### టిడ్కో, గృహనిర్మాణ సమీక్షలో సిఎం చంద్రబాబు



శుక్రవారం టిడ్కో, గృహనిర్మాణశాఖపై అధికారులు, మంత్రి పార్థసారథితో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, నవంబరు 21, ప్రభాతవార్తప్రతినిధి:** అందరికి ఇళ్లు (హౌసింగ్ ఫర్ ఆల్) అంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ హామీని నెరవేర్చే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 3 లక్షలకుపైగా ఇళ్లల్లో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వ హించామన్నారు. ఇది ఇక్కడితో ఆగకూడదు, మరింత వేగంగా వెళ్లాలి. ఇప్పటినుంచే లక్ష్యాలు పెట్టుకుని హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని 2029 జనవరి నాటికి పూర్తి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారుగా 20 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాఅన్నారు. అందులో ఇప్పటికే 3 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తై గృహప్రవేశాలు చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో మూడేళ్లల్లో 17లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుక ఇప్పటికే 3 లక్షలకుపైగా ఇళ్లను పూర్తి చేసి. సామూహిక గృహప్రవేశాలు చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. రానున్న మూడేళ్లలోనూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. రానున్న మూడేళ్ల కాలంలో 17 లక్షలకుపైగా ఇళ్లను నిర్మించేలా కార్యాచరణ చేపట్టాలని టిడ్కో, గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ప్రతి మూడు నెలలకోసారి లక్ష్యానికి అనుగుణంగా సామూహిక గృహప్రవేశాలు >>2

## సిఐ శంకరయ్య డిస్మిస్

### పోలీసు సర్వీసు నుంచి తొలగింపు

### వివేకా హత్యకేసులో శంకరయ్యపై ఆరోపణలు

**కర్నూలు, నవంబరు 21, ప్రభాతవార్త :** కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు వి.ఆర్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ జె.శంకరయ్యను పోలీస్‌శాఖ సేవల నుంచి డిస్మిస్ చేస్తూ కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా ఎస్పీ ఈ చర్యను అధికారికంగా ప్రకటించారు. పులివెందుల పట్టణంలో వైయస్ వివేకానంద రెడ్డి హత్య సమయంలో >>2



శుక్రవారం పోలవరం పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

## 'పోలవరం'ను పరిశీలించిన కేంద్ర బృందం

**పోలవరం, నవంబరు 21, ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్ట్ ను శుక్రవారం కేంద్ర జల సంఘం ప్రతినిధులు పరిశీలించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర జల సంఘం డిజైన్లు, పరిశోధన విభాగం ఎక్స్ ఫిషియో సభ్యుడు ఆదిత్య శర్మ, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ ఎస్ఎస్ భక్షిలతో పాటు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం. రఘురాం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్ట్‌లో జరుగుతున్న పనులను వారు ఆసాంతం పరిశీలించారు. వారికి జలవనరుల శాఖ ఈ ఎన్ సి కె నరసింహమూర్తి, పోలవరం ఎస్ఈ కె రామచంద్రరావు, క్వాలిటీ కంట్రోల్ విభాగం సిఈ కె శేషుబాబు, డీఈలు కె బాలకృష్ణ, డి.శ్రీనివాస్, ప్రేంచంద్, ఎం ఈ ఐఎల్ జిఎం ఏ గంగాధర్, డిజీఎం మురళి తదితరులు పనులు జరుగుతున్న తీరును చూపించటంతోపాటు వివరాలు >>2

## వచ్చే విద్యాసంవత్సరం నుంచి 'కలలకు రెక్కలు'



### కళాశాలల్లో ఆత్మహత్యల నివారణకు ఐదుగురు సభ్యులతో కమిటీ

### అనుమతిలేని ప్రైవేటు జూ.కాలేజీలపై చర్యలు

### స్కిల్ డెవలప్‌మెంట్‌పై సమీక్షలో మంత్రి లోకేష్

**అమరావతి, నవంబరు 21 ప్రభాతవార్త:** వచ్చే విద్యాసంవత్స రం నుంచి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినులకు కలలకు రెక్కలు పథకాన్ని అమలుచేసేందుకు విధివిధానాలను సిద్ధం చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో కళాశాల విద్య, ఇంటర్మీడియట్, పాఠశాల విద్యాశాఖ, స్కిల్ డెవలప్ మెంట్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ శుక్రవారం 3గంటలకు పైగాసుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ స్వదేశంతోపాటు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలన్న ఆసక్తిగల విద్యార్థినులకు >>2



## నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి



### రెండురోజులు అక్కడే సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

**పుట్టపర్తి, నవంబరు 21, ప్రభాతవార్త:** భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి వేడుకలలో భాగంగా శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్ర పతి రాధాకృష్ణ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యశాఖ, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి నారాలోకేష్‌లు పుట్టపర్తి రానున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. అధికారులు అందించిన మేరకు వారి పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం 09:45 గంటలకు పుట్టపర్తి శ్రీసత్యసాయి విమానాశ్రయంకు చేరుకోనున్నారు. ఆయన ఉదయం 10:30 నుండి 10:40 గంటలకు విమానాశ్రయంలోనే వేచిఉండి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతంపలకి అటు పిమ్మట ఉదయం 11:00 గంటలకు శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం చేరుకొని భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని ప్రత్యేకంగా దర్శించుకోని శతజయంతి ఉత్స వాల్లో పాల్గొంటారు. అనంతరం 12:10 గంటలకు రాష్ట్రపతితో కలసి సత్యసాయి విమానాశ్రయం చేరుకొని రాష్ట్రపతికి వీడ్కోలు పలకడం జరుగుతుందన్నారు. అనంతరం 12:30గంటల నుండి మధ్యాహ్నం 03:30గంటల వరకు విశ్రాంతి తీసుకొని 03:40 గంటలకు భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణకు స్వాగతంపలికి ప్రశాంతి నిలయంలో జరగనున్న >>2



22-11pg2exHMNWJQER 2_22-11pg2exHMNWJQER.qxd 22/Nov/25 12:37 AM Page 1






బెట్టింగ్ నిర్వాహకుల నుంచి ప్రొద్దుటూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్ ఫోన్లు

# పరారీలో వున్న ఇద్దరు ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్

## రూ. 10.56 కోట్ల నగదు, 3సెల్ ఫోన్‌లు, బ్యాగ్ స్వాధీనం

## బెంగళూరులో శిబి హాస్టల్ నడుపుతూ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వైనం

**కడప, నంబరు 21 ప్రభాతవార్త:** పొద్దుటూరు పట్టణం యందు క్రికెట్ బెట్టింగ్ ముఠా కార్యకలాపాల గురించి డిఎస్‌పి భావన ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడమైనది. ఈ క్రమములో భాగంగా బెంగుళూరు కేంద్రముగా ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తు, ఆన్లైన్ ట్రేడింగ్ కొరకు తమకు కరెంట్ అకౌంట్లు కావాలని తెలిసిన వారిని నమ్మించి, వారి ద్వారా వివిధ బ్యాంక్ లలో కరెంట్ అకౌంట్లు ఓపెన్ చేయించి, వారి బ్యాంకు ఎకౌంటు బుక్స్ తీసుకొని తద్వారా బెట్టింగ్ నిర్వహిస్తూ వుండి 5112025 వ తేదీన అరెస్ట్ కాబడిన ముఠాలోని 6 మంది సభ్యులు ఇచ్చిన నేర ఒప్పుదల మేరకు ముఠాలో కీలక సభ్యులైన ప్రొద్దుటూర్ మండలం లింగాపురం గ్రామానికి చెందిన ధనికల వీర శంకరయ్య వీర శంకర్ మరియు కాసినాయన మండలానికి చెందిన ప్రస్తుతం బెంగలూరు నందు ఉన్న అర్ల చంద్ర యాదవ్ అను వారిపై నిఘా ఉంచడమైనది. సదరు నిఘాలో భాగంగా ఈ రోజు అనగా 21.05.2025 వ తేదీ ముఠాలో కీలక సభ్యులైన ధనికల వీర శంకరయ్య వీర శంకర్ మరియు అర్ల చంద్ర యాదవ్ లను గీ. సదాశివయ్య, ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, ప్రొద్దుటూర్ II town U/G PS ప్రొద్దుటూరు టౌన్ నందు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ద్వారా ఆర్జించిన రూ. 10,56,00000 నగదు, 3 సెల్ ఫోన్ లు, 1 Bag స్వాధీనం చేసుకోవడమైనది. విచారణలో బెంగుళూరునందు శిబి నడుపుతున్నధనికల వీర శంకరయ్య వీర శంకర్ మరియు అర్ల చంద్ర యాదవ్ లు అను వెబ్ సీట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ, సదరు వెబ్ సైట్ ద్వారా బెట్టింగ్ లావా దేవీలకొరకు బ్యాంక్ అకౌంట్లు అవసరం అయినందున తాము నిర్వహిస్తున్న అక్రమ బెట్టింగ్ వ్యవహారాన్ని ఈ కేసు నందు ఇంతకు ముందు అరెస్ట్ కాబడిన తమ అనుచరుల ద్వారా బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయించుకొని వారికి కమిషన్లు ఇస్తూ వారి ద్వారా విస్తృతముగా ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తేలినది.ప్రస్తుతానికి బ్యాంకుల ద్వారా తెలిసిన సమాచారం మేరకు పై బెట్టింగ్ కు సంబంధించిన అనుమానాస్పద లావా దేవిలు జరిపిన అన్నీ అకౌంట్లను ఫ్రీజ్ చేయమని ఆయా బ్యాంకులను కోరడమైనది.పై క్రికెట్ బెట్టింగ్ ముఠాల కార్యకలాపాలను గుర్తించి వారిని పట్టుకొని చట్టం ముందు నిలబెట్టుటలో ప్రతిభ కనపర్చిన గీ. సదాశివయ్య, ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, ప్రొద్దుటూర్ II టౌన్ గీ/బి శిలీ మరియు వారి సిబ్బందిని ప్రత్యేకముగా అభినందించి వారికి తగు రివార్డుల కొరకు సిఫార్సు చేయడం జరుగుతుంది.

**అరెస్టయిన వారి వివరాలు**

1. ధనికల వీర శంకరయ్య వీర శంకర్, లింగాపురం గ్రామం, ప్రొద్దుటూరు మండలం
2. అర్ల చంద్ర యాదవ్, నాయునిపల్లి గ్రామం, కాశీనాయన మండలం, శ్రీశ్రీ కడప జిల్లా, ప్రస్తుతం మున్నేకొలాల్, మార్తహళ్ళి, బెంగళూరు సిటీ, కర్ణాటక రాష్ట్రం.

## బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీల నికర నీటిలో

# ఒక్క టీఎంసీ కోల్పోయే పరిస్థితి తలెత్తకూడదు: మాజీ సీఎం జగన్

## అలా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి: సీఎం చంద్రబాబుకు జగన్ లేఖ

**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** బచావత్ ట్రిబ్యునల్ ఏపీకి కేటాయించిన 512 టీఎంసీల నికర నీటిలో ఒక్క టీఎంసీ కోల్పోయే పరిస్థితి తలెత్తకూడదని మాజీ సీఎం.వైసీపీ నేత జగన్ వ్యాఖ్యానించారు. అలా జరిగితే టీడీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వైఎస్ జగన్ లేఖ రాశారు. కృష్ణా నదీజలాల పంపిణీపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. కృష్ణా నదీజలాల వివాదంపై ఏర్పాటైన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు ఏపీ ప్రజల హక్కులను కాపాడేలా ప్రభుత్వం వాదనలు వినిపించాలని కోరారు. కృష్ణా నదీజలాలకు సంబంధించి ఏపీ హక్కులను కాపాడటంలో టీడీపీ ఎప్పుడూ నిజాయతీగా వ్యవహరించలేదని వైఎస్ జగన్ విమర్శించారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు వచ్చే విచారణలలో రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేలా వాదనలు వినిపించాలని ఏపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. కృష్ణా నదిలో 763 టీఎంసీల నీటిని తెలంగాణ రాష్ట్రం తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల తరుఫున బలమైన వాదనలు వినిపించాల్సిన అవసరం ఉందని వైఎస్ జగన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థనను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అంగీకరిస్తే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తన తుది వాదనలను సమర్పించి, ఈ అన్యాయాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. మరోవైపు రాయలసీమ ప్రాజెక్టుల పట్ల టీడీపీ నిరక్ష్య వైఖరి అనుసరిస్తోందని వైఎస్ జగన్ ఆరోపించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచే పనులు 1996లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మొదలయ్యాయని వైఎస్ జగన్ ఆరోపించారు. ఆ సమయంలో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి మాత్రమే కాకుండా యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నారని వైఎస్ జగన్ గుర్తు చేశారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిపక్షపార్టీలు ఆందోళనలు చేసినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల నిజాయితీ లేకుండా వ్యవహరించడంతో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచడానికి కర్ణాటకకు అనుమతి ఇచ్చిందని వైఎస్ జగన్ ఆరోపించారు. అలాగే 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కృష్ణా నదీ మరోవైపు బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ప్రస్తుతం ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీరు కేటాయిస్తున్నారు. అయితే కృష్ణా నదీ పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉంటే, ఏపీలో 30 శాతం మాత్రమే ఉందని.. దాని ఆధారంగా నదీజలాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. అయితే ఇప్పుడు ఉన్న నిష్పత్తినే కొనసాగించాలని ఏపీ ప్రభుత్వం కోరుతోంది.

# నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి

>> భగవాన్ సత్యసాయి బాబా యూనివర్శిటీ 44వ స్నాతకోత్సవంలో పాల్గొంటున్నట్లు తెలియజేశారు. అనంతరం రాత్రికి ప్రశాంతి నిలయంలో విశ్రాంతి తీసుకొని ఆదివారం ఉదయం 09:00గంటలకు శ్రీసత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించే భగవాన్ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవ వేడుకలలో పాల్గొంటారని, ఉత్సవాల అనంతరం ఉదయం 11:20 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకొని 11:30 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నట్లు తెలియజేశారు. అంతకు మునుపు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల శాఖ మంత్రి నారాలోకేష్ శనివారం ఉదయం 08:15 గంటలకు ప్రత్యేక విమానంలో శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకోనున్నారు. ఆయన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రులతో కలసి పై కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. నారా లోకేష్ 22వ తేదీ సాయంత్రం 06:20 గంటలకు కప్పల బండ వద్ద ఉన్న ఎపిఐఐసి లేఔట్ నందు బస చేయనున్నట్లు తెలియజేశారు.అనంరతం 23వ తేదిన ఉదయం 9:00 గంటలకు హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో పాల్గొంటారన్నారు.అనంతరం 11:40 గంటలకు పాలసముద్రం వద్దగల నాసిన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరిగే కార్యక్రమంలో 12:30 గంటల వరకు పాల్గొంటారని, అటు పిమ్మట అక్కడి నుండి బయలుదేరి 1:10 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకొని 1:50 గంటలకు ప్రత్యేకవిమానంలో తిరుగు ప్రయాణం కానున్నట్లు అధికారులు తెలియజేశారు.

# 'పోలవరం'ను పరిశీలించిన కేంద్ర బృందం

>> అందించారు.పోలవరం ప్రాజెక్ట్‌వ్యూ పాయింట్ నుంచి మొత్తం పనుల వివరాలను కేంద్ర బృందానికి జలవనరుల శాఖ, కాంట్రాక్టు సంస్థ ఎంఈఐ ఎల్ ప్రతినిధులు వివరించారు. ఆ తరువాత వారు మోడల్ డ్యామ్ పరిశీలించారు. అక్కడ ప్రతి విభాగం గురించి అధికారులుతెలిపారు.స్పిల్‌వే చేరుకున్న కేంద్ర బృందం మొత్తం పరిశీలించింది. స్పిల్ వే, గేట్లు, గేట్లను ఆపరేట్ చేసే సిలిండర్లు, పవర్ పాక్స్ మొదలైన వాటి పనితీరు గురించి వారు తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అప్ స్ట్రీమ్ కాఫర్ డాం, గ్యాప్1, డయాఫ్రమ్‌వాల్, జల విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించారు.ప్రతి ఒక్క దగ్గర అధికారులను అడిగి పనులవివరాలు తెలుసుకున్నారు.

# మిస్ యూనివర్స్-2025 మెక్సికో సుందరి ఫాతిమా బోష్

**న్యూమెక్సికోసిటీ, నవంబరు 21:** మిస్ యూనివర్స్ 2025 పోటీల్లో మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ విశ్వసుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. థాయ్‌లాండ్‌లో అట్టహాసంగా జరిగిన 74వ మిస్ యూనివర్స్ ఫైనల్స్‌లో ఆమె విజేతగా నిలిచారు. గతేడాది విశ్వసుందరి, డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా క్జార్ థెల్విగ్.. ఫాతిమాకు కిరీటాన్ని అలంకరించారు. పోటీల ఆరంభం నుంచే ఫేవరెట్‌గా ఉన్న ఫాతిమా తన అందం, ప్రతిభతో న్యాయనిర్ణేతలను మెప్పించారు. 25 ఏళ్ల ఫాతిమా బోష్‌కు స్వదేశంలో, అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. ఈ ఏడాది సెప్టెంబరులో ఆమె మిస్ యూనివర్స్ మెక్సికో 2025గా ఎంపికై, విశ్వవేదికపై తన దేశానికి ప్రాతినిధ్యం వహించారు. అయితే, ఈ పోటీలకు ముందు జరిగిన ఒక సంఘటన ఆమెను వార్తల్లో నిలిపింది.

# వచ్చే విద్యాసంవత్సరం నుంచి 'కలలకు రెక్కలు'

>> కలలకు రెక్కలు పథకం కింద సాయం అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం మన రాష్ట్రానికి చెందిన 27,112 మంది విద్యార్థినులు విదేశాల్లో విద్యనభసిస్తున్నారని, స్వదేశంలో 88,196మంది ఉన్నత చదువులు చదువుతున్నట్లు అధికారులు చెప్పారు. విదేశీ విద్య పథకం ఏవిధంగా అమలు చేయాలన్న విషయంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై మంత్రి లోకేష్ ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణ మార్గాలను సూచించేందుకు శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమ నేతృత్వంలో అయిదుగురు సభ్యులతో కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు రెసిడెన్షియల్ కళాశాలల్లో సౌకర్యాల మెరుగు, విద్యార్థులపై వత్తిడి తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. అనుమతులు లేకుండా నడిచే ప్రైవేటు కళాశాలలపై చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిచ్చి ఐఐటి, ఎన్ ఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల సీట్లు సాధించేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతించే విషయమై మంత్రి అధికారులతో చర్చించారు. ఇటీవల మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా వివిధ యూనివర్సిటీల ప్రతినిధులతో జరిపిన చర్చల పురోగతిపై సమీక్షించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలతో కొలాబరేషన్‌కు ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, న్యూ క్యాజిల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్నేషనల్ డిగ్రీలపై దృష్టి సారించాలని మంత్రి లోకేష్ సూచించారు. విశాఖలో ఎడ్యుసిటీ ఏర్పాటు, వరల్డ్ క్లాస్ ఏవియేషన్ యూనివర్సిటీ, అమెరికన్ రైడర్‌తరహాలో అంతర్జాతీయస్థాయి ఫ్లయింగ్ స్కూలు, ఎంఆర్‌ఓ, పైలట్ గ్రౌండ్ హ్యాండిల్, కస్టమర్ సర్వీసులను ఏర్పాటుపై దృష్టిసారించాలని, 50శాతం గ్లోబల్ వర్క్ ఫోర్స్ విశాఖనుంచే సిద్ధం కావాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు మనోభీష్టమని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 26 డిప్లొమో కోర్సుల కరిక్యులమ్ లో మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. గుజరాత్‌కు చెందిన నామ్ టెక్ సంస్థ రాష్ట్రంలో 3 హబ్స్ (విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు) పరిధిలో 13 స్పోక్స్‌లను అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలోని 83 ప్రభుత్వ ఐటిఐలను భారీ పరిశ్రమలతో అనుసంధానిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సమీప ఐటిఐలతో బ్లూస్టార్, అమర్ రాజా, లారస్ ల్యాబ్, డిక్సన్, హెచ్ పిసిఎల్ లతో టై అప్ చేశామని అన్నారు. పిఎం కౌశల్ వికాస్ యోజన కింద 21, 540మందికి షార్ట్ టెర్మ్ ట్రైనింగ్ అందించడానికి కేంద్రం నుంచి అనుమతి లభించిందని తెలిపారు. రాష్ట్రంలోని డిగ్రీ, పిజి, యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో 485 ఎంప్లాయబిలిటీ స్కిల్ సెంటర్స్ ఏర్పాటు చేశామని అన్నారు. పాఠశాల విద్యపై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ... విలువలతో కూడిన విద్యపై ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావుగారి సమక్షంలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈనెల 26వతేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్టూడెంట్ అసెంబ్లీ (మాక్ అసెంబ్లీ)ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అన్నారు. ఆ సందర్భంగానే బాలల భారత రాజ్యాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరిస్తారని తెలిపారు. ఇందులో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ స్కూల్ అసిస్టెంట్ టీచర్లను మార్చిలో సింగపూర్ పంపించి, అక్కడి బోధనా పద్ధతులపై అధ్యయనం చేయాలని కోరారు. ఆ తర్వాత వేసవిలో పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్ ల్యాండ్ పంపించాలని అన్నారు. దేశంలోనే తొలిసారిగా యు డైస్ తో ఎస్ఎస్ సి నామినల్ రోల్స్ ను విజయవంతంగా అనుసంధానించినట్లు చెప్పారు. నామినల్ రోల్స్ వివరాలు సరిగా ఉన్నాయో, లేదో మరోసారి పరిశీలించాలని సూచించారు. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ ఎన్ బేస్ లైన్ సర్వే ఈనెల 24నుంచి డిసెంబర్ 7వరకు ఉంటుందని చెప్పారు. డిసెంబర్ 5న మెగా పిటిఎంను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి లోకేష్ సూచించారు. టెట్ కు సంబంధించి ఈనెల 23తో గడువు ముగుస్తుందని, ఇప్పటివరకు 1,94,014 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్షకు సంబంధించి కేసు పురోగతిపై ఆరాతీశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రమాణాల మెరుగుదల, ఫలితాల సాధనే తమ ఏకైక లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్త, ఇంటర్మీడిట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, స్కిల్ డెవలప్‌మెంట్ సిఇఓ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం రాష్ట్రపతి ముర్ముకు తిరుమల ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు

# ప్రోటోకాల్ పక్కనపెట్టి..కారుదిగి భక్తులకు చాక్లెట్లు పంపిణీ

## తిరుమలలో రాష్ట్రపతి ముర్ముకు ప్రశంసలు

**తిరుమల,నవంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** ఆమె భారతదేశ ప్రథమపౌరురాలు. పూర్తిస్థాయి భద్రత నడుమ తిరుమల పర్యటన సాగినా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం కారులో ప్రోటోకాల్‌నడుమ ప్రయాణించింది. ఆలయం వెలుపల కొంత ముందుకు వచ్చిన రాష్ట్రపతి కాన్వాయ్‌లోని కారు రాంభగీచా బస్టాండ్ వైపు కదులుతున్న సమయంలో కారు ఆపించి వెంటనే ఆమె క్రిందకు దిగారు. వెనుక ఉన్న భద్రత సిబ్బంది పరుగులు తీసుకుంటూ ఏం జరిగిందో అర్థంకాక నడవడంతో భక్తులు నిలిచి ఉండటాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గమనించారు. వెంటనే కారు దిగి భక్తుల వద్దకు నడచుకుంటూ వెళ్ళారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం చేశారు. ఆ తరువాత చాక్లెట్లు పంచారు. రాష్ట్రపతి స్వయంగా కారుదిగి భక్తులతో మాట్లాడటంపై ప్రశంసలు అందుకున్నారు.

# 1నుంచి శీతాకాల పార్లమెంటు

## 19 దాకా సమావేశాలు



**న్యూఢిల్లీ, నవంబరు 21:** డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలు సజావుగా జరిగేలా ఏకాభిప్రాయం సాధించడానికి, సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం నవంబరు 30న అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది. పార్లమెంట్ సెంట్రల్ హాలులో నవంబరు 30న ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల పార్లమెంటరీ పార్టీ నేతలను ఆహ్వానిస్తూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు లేఖలు రాశారు. శీతాకాల సమావేశాలకు ముందు అన్ని వైపుల నుండి ఆందోళనలను పరిష్కరించడానికి, సహకారం కోరడానికి ఈ సమావేశాన్ని అవకాశంగా ఉపయోగించుకోవాలని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుండి 19 వరకు జరగనున్నాయి. అంటే 15 రోజులపాటు సమావేశాలు కొనసాగనున్నాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు గతంలో కంటే ఈసారి చాలా తక్కువ రోజులుంటాయి. 'నిర్మాణాత్మక, అర్థవంతమైన సమావేశాల కోసం ప్రభుత్వం ఎదురుచూస్తోందని, అటువంటి సమావేశం మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబిస్తుంది' అని కేంద్ర మంత్రి రిజిజు అభిప్రాయపడ్డారు. అయితే, ప్రభుత్వ తీరును ముఖ్యంగా శీతాకాల సమావేశాల షెడ్యూల్, వ్యవధిని కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ తప్పుపట్టారు. 15రోజులు మాత్రమే సభ నిర్వహించడమేంటి? ప్రజా సమస్యలపై చర్చలకు అవకాశం ఉంటుందా? బిల్లులు ఆమోదించాల్సిన అవసరం లేదా? అంటూ జైరాం రమేష్ ట్వీట్ చేశారు.

# సిఎస్ విజయానంద్ సర్వీసు పొడిగింపు

**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సీఎస్ విజయానంద్ సర్వీసు 3 నెలల పాటు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలాఖరుతో ముగియనున్న సీఎస్ విజయానంద్ సర్వీసు. 2026 ఫిబ్రవరివరకు సీఎస్‌గా కొనసాగనున్న విజయానంద్. అనంతరం స్పెషల్ సీఎస్ సాయి ప్రసాద్‌కు సీఎస్‌గా అవకాశం కల్పించనున్న సీఎం చంద్రబాబు. 2026మే నెలతో ముగియనున్న సాయిప్రసాద్ పదవీకాలం.ఆ తర్వాత కూడా సీఎస్‌గా సాయిప్రసాద్‌ను కొనసాగించనున్న ప్రభుత్వం. ఇరువురు అధికారులకు ప్రభుత్వ పెద్దల నుంచి అందిన సమాచారం.

# కుప్పకూలిన తేజస్: దుబాయ్ ఎయిర్‌షోలో ప్రమాదం, పైలట్ మృతి

**దుబాయి, నవంబరు 21:** దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్ షోలో ప్రమాదం చోటు చేసుకుంది. భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయింది. ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన జరుగుతుండగా విమానం ఒక్కసారిగా కూలి పోయింది. ఆ వెంటనే పెద్ద ఎత్తునమంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళన వాతావరణం నెలకొంది. ఈ ప్రమాదంలో పైలట్ మృతిచెందినట్లు అధికారులు ధృవీకరిం చారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈయుద్ధ విమానాన్ని బెంగళూరులోని హిందూస్తాన్ ఎరోనాటికల్‌లిమిటెడ్ తయారు చేసింది. ఎయిర్ షోలో విన్యాసాలు చేస్తున్న సమయంలో తేజస్ ఫ్లైట్ ఒక్కసారిగా కుప్పకూలడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో విమానాశ్రయం అంతటా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందినట్టు భారత వాయుసేన ధృవీకరించింది.

# మూడేళ్లలో 17లక్షల ఇళ్లు

>> చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో టిడ్కో, గృహ నిర్మాణ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇక మిగిలిన 17 లక్షల ఇళ్లు వచ్చే మూడేళ్లల్లో పూర్తవ్వాలి. ప్రతి మూడు నెలలకోసారి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం చేపట్టాలి. వచ్చే ఉగాది నాటికి 5లక్షల ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలు జరగాలి. హౌసింగ్ ఫర్ ఆల్ అనే కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి ఉద్యోగులు అందరూ బాధ్యతగా తీసుకోవాలి. త్వరలో టిడ్కో, హౌసింగ్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులందరితోనూ సమీక్ష చేస్తాను అని ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్రజల తృప్తి చెందితేనే నాకు సంతృప్తి:** ప్రభుత్వం నెరవేర్చాల్సిన హామీ హౌసింగ్ ఫర్ ఆల్. ఈ కార్యక్రమం అమలులో ఎలాంటి పొరపాట్లు జరగకూడదు. జాప్యం చేయకూడదు. ప్రస్తుతం గుర్తించిన లబ్దిదారులే కాకుండా ఇంకా అర్హులైన వారిని గుర్తించి లబ్దిదారుల జాబితాలో చేర్చేందుకు సర్వే చేస్తున్నాం. ఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలి. అర్హులైన లబ్దిదారుల జాబితా సిద్దం చేయాలి. ఇలా రూపొందించిన జాబితాను గ్రామాల వారీగా ప్రదర్శించాలి. ప్రజలు తృప్తి చెందితేనే నాకు సంతృప్తి. గృహ నిర్మాణాల్లో భాగంగా ఎవరైనా స్థలం కావాలని అడిగితే స్థలంఇవ్వండి. అలాగే తమకు స్థలాలు ఉన్నాయని లబ్దిదారులు చెబితే వాళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతి అప్డేట్ ఆన్ లైన్లో ఉండేలా చూడాలి. ఇకఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించే విధంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టేలా చూడాలి.పీఎంఏవై 1.0హౌసింగ్ స్కీములోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీ వంటి సామాజిక వర్గాలకు అదనంగా చెల్లిపులు జరుపుతున్నాం. ఇప్పుడు ముస్లిం మైనార్టీలకూ అదనంగా రూ.50 వేలు చెల్లిస్తాం. దీని కోసం 18 వేల ముస్లిం మైనార్టీల లబ్దిదారులకు రూ.90 కోట్లు అవసరమవుతాయి. మనం ఆయా వర్గాలకు చేకూరుస్తోన్న అదనపు సాయాన్ని వారికి వివరించాలి" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**నరేగా తరహాలో..** గత ప్రభుత్వ కక్ష సాధింపులో భాగంగా 2014- 2019 మధ్య చేపట్టిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీంకు సంబంధించిన కొందరు లబ్దిదారులకు బిల్లులు రాకుండా చేసింది. దీనివల్ల రూ.920కోట్ల మేర బిల్లులు పెండింగులో పడ్డాయి.ఈ బిల్లులను మళ్లీ రప్పించేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపండి. ఆ బిల్లుల్ని గత ప్రభుత్వం ఏ విధంగా అడ్డుకుందో వివరించండి. 2014-19 మధ్య కాలంలో జరిగిన నరేగా పనులకు సంబంధించిన బిల్లులను గత ప్రభుత్వం ఇదే తరహాలో ఆపేసింది.అయితే ఆ బిల్లులను మళ్లీ స్ట్రీమ్ లైనులో పెట్టి బిల్లుల వచ్చేలా చేశాం.అదే తరహాలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీంకు సంబంధించి పెండింగుబిల్లులను రప్పించేలాకృషిచేయండి అని ముఖ్యమంత్రి అధికా రులను ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో 2014-19 మధ్య 8 లక్షల గృహాలు, 2019-24 మధ్య 5.80లక్షల ఇళ్లను నాటి ప్రభుత్వం నిర్మించినట్టు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి, టిడ్కో, హౌసింగ్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హీరాగోల్డ్ నౌహీరా షేక్‌కు ఇడి షాక్

## ఆస్తుల వేలం ద్వారా వచ్చిన రూ.19 కోట్ల నగదు బాధితులకు అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్21:** హీరా గోల్డ్ నౌహీరా షేక్‌కు ఈడీ అధికారులు షాక్ ఇచ్చారు. ఆమెకు సంబంధించిన ఆస్తులను వేలం వేశారు అధికారులు. ఆస్తుల వేలం ద్వారా వచ్చిన రూ.19 కోట్ల పై చిలుకు నగదుని బాధితులకు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలోనే హీరా గోల్డ్ ఆస్తుల వేలం ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రకటించారు. అటాచ్ చేసిన ఆస్తులను అమ్మకానికి పెడుతున్నట్లు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రూ.5,900 కోట్లు వసూలు చేసి నౌహీరా షేక్ బిచాన ఎత్తివేశారు. ఆమెపై దేశవ్యాప్తంగా 52కు పైగా కేసులు నమోదు చేశారు. ఈడీ వేలంలో నౌహీరా షేక్ ఆస్తి రూ.19.64 కోట్లను వేలంపాట ద్వారా వచ్చే మొత్తాన్ని మోసపోయిన బాధితులకు తిరిగి వినియోగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా, నౌహీరా షేక్ కేసులో కీలక పురోగతి నమోదైంది. ఆమెకు సంబంధించిన ఒక స్థిరాస్తిని రూ.19.64 కోట్లకు విజయవంతంగా వేలం వేశారు ఈడీ అధికారులు. నవంబరు 21, 2025న ఆ ఆస్తి రిజిస్ట్రేషన్‌ను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి చేశారు. ఈ ఆస్తిని ఇడి 16-08-2019న తాత్కాలిక అటాచ్‌మెంట్ ఆర్డర్ ద్వారా స్వాధీనం చేసు కుంది. నౌహీరా షేక్ రూ.5,978 కోట్ల మోసం చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. నౌహీరా షేక్, ఇతరులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళతో సహ పలు రాష్ట్రాల్లోని పోలీసు అధికారులు కేసులు నమోదు చేసి.. అనేక ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (శిలీలితి - 2002) కింద దర్యాప్తు చేపట్టింది.

పోలీసుల దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం.. నౌహీరా షేక్, ఇతరులు ప్రజలను ఓ పథకం ప్రకారం నమ్మించి రూ.5,978 కోట్లకు పైగా పెట్టుబడులు సేకరించారు. సంవత్సరానికి 36శాతం కంటే ఎక్కువ లాభం ఇస్తామని బాధితులకు హామీఇచ్చారు. కానీ బాధితులకు మూలధనంకూడా తిరిగి ఇవ్వకుండా భారీ మోసంచేశారు. రూ.428 కోట్ల విలువైన ఆస్తులు ఇప్పటికే అటాచ్ చేసింది. నిందితురాలు నౌహీరా షేక్‌ను పోలీసులు విచారిస్తున్నారు.

## వారం - వర్జ్యం

22-11-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
విదియ సా.5.10
జ్యేష్ఠ సా.4.45, అనూరాధ కార్తె
వర్జ్యం : ఉ.6.22-8.08
దు.ఉ.6.16-7.49
శుభసమయం: ఉ.5.30-6.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలు ఆలస్యంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం. వాహన సౌఖ్యం కలదు.

**వృషభం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. సన్నిహితుల ప్రోత్సాహం ఆశించిన స్థాయిలో లభించదు.

**మిథునం:** ప్రత్యర్థుల విషయంలో జాగ్రత్తతో మెలగడం చెప్పదగిన విషయం. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కర్కాటకం:** ఎడ్డమంటే తెడ్డమనే వారి వలన ఇబ్బందులేర్పడతాయి. పరిస్థితులుల అనుకూలంగా ఉన్నట్లుగా మీరు భావిస్తారు.

**సింహం:** శత్రువర్గాన్ని ఓ కంట కనిపెట్టి ఉంటారు. వ్యక్తిగత పురోభివృద్ధికి ఉపకరించే ఏ చిన్నపాటి అంశాన్ని కూడా నిర్లక్ష్యం చేయరు.

**కన్య :** చర్చలు, మంతనాలు, కుటుంబ వ్యవహారాలతో క్షణం తీరక లేకుండా కాలం సమానంగా పరుగులు పెడతారు.

**తుల :** మనస్సు విశ్రాంతి కోరుకున్నా ... పరిస్థితుల సహకరించవు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. వాహన సౌలభ్యం ఉంది.

**వృశ్చికం:** శ్రమకు తగిన ప్రతిఫలం అందుకుంటారు. మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. ధనలాభం వుంటుంది.

**ధనుస్సు:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**మకరం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు. గృహ నిర్మాణాలు చేపడతారు. వృత్తి వ్యాపారాలలో అనుకూలంగా వుంటుంది.

**కుంభం:** నూతన విద్యావకాశాలు లాభిస్తాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి. పెట్టుబడుల్లో నిదానం అవసరం. వస్త్రలాభం కలుగుతుంది.

**మీనం:** సన్నిహితుల నుండి సహాయ సహకారాలను అందుకుంటారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సిఐ శంకరయ్య డిస్మిస్

>> శంకరయ్య అక్కడ ఇన్‌స్పెక్టర్ గా పని చేశారు. అప్పటి వివాదాల్లో ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. అదే క్రమంగా ఇటీవల చంద్రబాబు నాయుడుకు సైతం శంకరయ్య లీగల్ నోటీసులు పంపించి సంచలనం సృష్టించారు. ఈ విషయాల నేపథ్యంలో ఆయనను కర్నూలు జిల్లా వేకెన్సీ రిజర్వులో ఉంచారు. తాజాగా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ విచారించి తీసుకున్న నిర్ణయాల మేరకు ఆయనపై చర్యలు తీసుకున్నారు. క్రమశిక్షణ పరమైన కారణాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు.

22-11Pg3exHMNWJQECT 3 ONG_22-11Pg3exHMNWJQECT.qxd 22/Nov/25 12:22 AM Page 1



## బాల్యవివాహాల నివారణకు ప్రత్యేక చర్యలు

### పాఠశాల డైరెక్టరేట్ ఆదేశాలు

**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** బాల్య వివాహాల నివారణకు క్షేత్రస్థాయి అధికారులకు పాఠశాల డైరెక్టరేట్ పలు సూచనలు జారీ చేసింది. బాల్య వివాహాలు నివారించడాన్ని చట్టబద్ధమైన,కీలక భాధ్యతగా భావించాలని ఆదేశించింది. జిల్లా విద్యాధికారులు వెంటనే బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహించాలని పేర్కొంది. జిల్లా, మండల విద్యాధికారులు నిర్ధేశిత సమయంలో కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. డీఈఓలు ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఎంఈఓలు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సూచించింది.

## రాష్ట్ర వైద్య సేవల నియామకం బోర్డుకు స్వయం ప్రతిపత్తి

**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎంఎస్ఆర్బి)కు ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి హోదా కల్పించింది.

రాష్ట్ర ప్రభుత్వ బిజినెస్ రూల్స్ 2028 రెండో షెడ్యూలును సవరిస్తూ అటానమస్ ఆర్గనేజేషన్ జాబితాలో ఏపీ వైద్యసేవల నియామక బోర్డును చేర్చింది.

దీంతో వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఏపీపీఎస్సీ పరిధిలో లేని రాష్ట్ర, జోనల్,జిల్లా స్థాయి పోస్టుల భర్తీని వేగవంతం చేసే వీలుంటుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.



సత్యసాయి ప్రపంచ సదస్సులో మాట్లాడుతున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



మహాసమాధి వద్దపుష్పాంజలి ఘటిస్తున్న ఒడిశా గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు

## సత్యసాయి సందేశాన్ని నాతో తీసుకు వెళ్తున్నా : మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్

### నిస్వార్ధసేవకు ప్రతి రూపం సత్యసాయి - ఒడిశా గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు

### ముగిసిన సత్యసాయి ప్రపంచ సదస్సు - హాజరైన 45 దేశాల ప్రతినిధులు

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 21, ప్రభాతవార్త ప్రతినిధి:** భగవాన్ సత్యసాయి బాబా ప్రపంచానికి అందించిన శాశ్విత సందేశం "అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు (లవ్ ఆల్- సర్వ్‌ఆల్)" ను తనతో తీసుకెళుతున్నానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వ్యాఖ్యానించారు. "వ్యక్తిని లయపరచడం - ప్రపంచ శాంతి కోసం మార్గాలు" అనే అంశంపై సత్య సాయి బాబా శతజయంతి మహోత్సవాల సందర్భంగా ప్రశాంతినిలయంలో 11వ శ్రీసత్యసాయి ప్రపంచ సదస్సు రెండవ రోజైన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆధ్యాత్మిక స్పూర్తితో వైదిక మంత్రాలతో ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రెండు రోజుల ప్రపంచ సదస్సులో 45 దేశాల నుండి 2500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ, తన కుటుంబం అనేక దశాబ్దాలుగా స్వామివారి భక్తులు అని, పుట్టపర్తిలో ప్రతి చోటా స్వామి ప్రేమ, దివ్యసాన్నిధ్యం వెలిసిపోతుందన్నారు. ఒడిశా గవర్నర్ డా. కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ, భగవాన్‌ను మానవతా దీప్తి, నిస్వార్ధ సేవకు ప్రతిరూపం అని వర్ణించారు. బాబా త్రివిధ సేవా యజ్ఞాలు, శుద్ధజల ప్రాజెక్టులు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, విలువల ఆధారిత విద్యా వ్యవస్థ, ఇవన్నీ ప్రపంచానికి ఆదర్శ నమూనాన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర వేడుకలుగా ప్రకటించడాన్ని ఆయన అభినందించారు. స్వామి బోధించిన ఏకత్వం, ప్రేమ, సేవనే మనం ఆచరించడం ఆయనకు అత్యుత్తమ నైవేద్యమన్నారు. మిస్ సరీతా అయ్యర్ మాట్లాడుతూ, దైవ మహిమను, దైవ కరుణను నిజంగా గుర్తించిన క్షణమే భక్తి పుడుతుందని ఆమె పేర్కొన్నారు. గజేంద్ర మోక్షం ప్రసంగంలోని అంతర్లీనార్థాన్ని వివరిస్తూ పూర్ణ సమర్పణ, నిర్మలమైన శరణాగతి ఉన్నచోట భగవంతుడు ఎలా వెంటనే ప్రత్యక్షమై రక్షిస్తాడో అద్భుతంగా వివరించారు. శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ వీ. మోహన్ సందేశాలలో పుట్టపర్తి మాత్రమే భగవాన్ వారి యొక్క జన్మభూమి అని, వారు ఇక్కడి నుంచే అనేక కార్యక్రమాలు చేపట్టడం వల్ల పుట్టపర్తి కర్మభూమి గా కుడా ఎప్పటికీ విలిసిల్లుతుందని చెప్పారు. భగవాన్ వారు సూచించిన సేవా మార్గం లో ప్రతిఒక్కరూ ఈ సందర్భంగా పునరంకితం కావాలని, అదే ప్రతి ఒక్కరూ స్వామి వారికి ఇవ్వగలిగిన పుట్టినరోజు గిఫ్ట్ గా అభివర్ణించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల అఖిలభారత అధ్యక్షులు నిమిష్ పాండ్యా మాట్లాడుతూ, ప్రశాంతినిలయం కు రావడం వల్ల, శ్రీ సత్య సాయి సేవా సంస్థలు ద్వారా సేవలో పాల్గొనడం వల్ల ప్రతిఒక్కరూ మార్పు చెంది తమ జీవితాల్ని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవడానికి దోహద పడుతుందని తెలియచేశారు. మహారాష్ట్ర మాజీముఖ్యమంత్రి, రాజ్యసభసభ్యుడు అశోక్ చవాన్ మాట్లాడుతూ, తానూ ఎన్నో ఏళ్ళుగా తన పదవికి సంబంధం లేకుండా, కేవలం భక్తుడిగా మాత్రమే పుట్టపర్తిని సందర్శిస్తూ వచ్చానని తెలిపారు. ఒకసారి అకస్మాత్తుగా వచ్చిన సందర్శన తనలో మరింత వినమ్రతను, భక్తిని పెంచిందని భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆశీస్సులందుకున్న రాష్ట్రపతి ముర్ము

### - ఆలయం వెలుపల ఆత్మీయంగా భక్తుల్ని పలకరింపు



**తిరుమల,నవంబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారంఉదయం దర్శించుకున్నారు. దేవదేవుని దివ్యాశీస్సులతో మనసు ఆనందదాయకమని అనుభూతి చెందారు. శుక్రవారం ఉదయం పద్మావతి విశ్రాంతి గృహం నుండి ఆలయం వద్దకు చేరుకున్న రాష్ట్రపతి ముర్ము, కుటుంబ సభ్యులకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అర్చకులు మహద్వారం వద్ద ఆలయ మర్యాదలతో ఇస్తికఫాలత్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన ఆమె ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్‌నాయుడు, ఇఒ సింఘాల్ శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. 2026 నూతన ఆంగ్ల సంవత్సరం క్యాలండర్‌లు, డైరీలను బహుకరించారు. ఆలయంలోపల తదేకం ఆధ్యాత్మికతభావంతోనే గడిపారు. ఉదయం ఆలయంలోపలకు చేరుకునే ముందు గంటనుండి భక్తులను, ఆలయ పరిసరాల్లో ఎవరినీ అనుమతించలేదు, పూర్తిస్థాయి భద్రత నడుమ రాష్ట్రపతి పర్యటనసాగింది. అంతకుముందు తొలుత ఆలయసాంప్రధాయాన్ని పాటిస్తూ వరాహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెవెంట టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, జానకిదేవి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెలసుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ ఉన్నారు.

## దేవేరి పద్మావతి లక్ష్మీకాసుల హారం ఊరేగింపు



**తిరుమల,నవంబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలవేంకటేశ్వరస్వామి దేవేరి పద్మావతి అమ్మవారు వెలసిన తిరుచానూరులో జరుగుతున్న కార్తీక బ్రహ్మోత్సవాల్లో గజవాహనం, గరుడసేవరోజు అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారాన్ని ఊరేగింపుగా తిరుమల నుండి పంపారు. శుక్రవారం ఉదయం ఈ లక్ష్మీకాసుల హారం శోభాయాత్ర తిరుమల ఆలయం నుండి సాగింది. శ్రీవారి ఆభరణాలలో లక్ష్మీకాసుల హారం అత్యంత ప్రధానమైంది. ప్రతినెలా పౌర్ణమి గరుడసేవ సందర్భంగా ఈ హారాన్ని మయలప్పస్వామికి అలంకరిస్తారు. సాక్షాత్తు మూలవిరాట్టు శ్రీవేంకటేశ్వరస్వామి ధరించే ఈ హారాన్ని గజ,గరుడవాహనసేవల్లో పద్మావతిఅమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. అంతకుముందు ఉదయం ఆలయంలో స్వామివారి చెంత ఉంచి పూజలు నిర్వహించారు. స్వామివారి కాసులహారాన్ని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తలపై పెట్టుకుని ఊరేగింపుగా తిరుచానూరుకు చేర్చారు. ఈకార్యక్రమంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, జెఇఒ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంధ్రనాథ్ అర్చకులు పాల్గొన్నారు.


## రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు : సిఎం చంద్రబాబు

### ఫార్మర్‌యాప్‌తో రైతుకు చేరువగా సాంకేతికత

**విజయవాడ, నవంబర్ 21, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ఎంస్ఎంఈ పార్కుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా రైతులకు అత్యధిక ప్రయోజనం కల్పించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఆ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆన్ లైన్ లో పాల్గొన్నారు, వ్యవసాయం, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ నెల 24 నుంచి 29 తేదీ వరకూ అలాగే డిసెంబరు 3 తేదీన నిర్వహించనున్న రైతన్నా మీ కోసం కార్యక్రమంలో తానూ పాల్గొంటానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్ ఎస్ కే పరిధిలోని ప్రతీ రైతు ఇంటికీ ముఖ్యమంత్రి లేఖను అందించటంతో పాటు నిర్దేశించిన పంచ సూత్రాలను కూడా వివరించి చెప్పాలని సీఎం పేర్కొన్నారు.

వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్ లో అత్యుత్తమ సాగు విధానాలు పాటించేలా చైతన్యం కలిగించాలని నిర్దేశించారు. నీటి భద్రత లో భాగంగా భూగర్భజలాలు, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వల వివరాలతో పాటు సమర్థ నీటి నిర్వహణ వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్ లో భాగంగా వాణిజ్య, అంతర ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి సేద్యం గురించి చెప్పాలన్నారు.

అగ్రిటెక్ లో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, శాటిలైట్ టెక్నాలజీ లాంటి అంశాలు ఉండాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ లో భాగంగా వాల్యూ అడిషన్, ఎఫ్ పీఓలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రాడెక్టు పర్ఫెక్షన్, ప్యాకింగ్ లాంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మద్ధతు ధరలు, పీఎం కిసాన్, ఇన్ పుట్ సబ్సీడీ, రైతు బజార్లు మార్కెటింగ్ వివరాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ తయారు చేసిన ఫార్మర్ యాప్ ను ప్రతీ రైతుకూ చేరువ చేయాలని సీఎం సూచించారు. యాప్ ద్వారా వ్యవసాయ భూమి, పంట సాగు వివరాలు, వాతావరణ సలహాలు, తెగుళ్లకు సంబంధించిన హెచ్చరికలు, మార్కెట్ ధరలు, భూసార పరీక్షలు,



మార్కెట్ ఇంటెలిజెన్స్ లాంటి వివరాలను అందించాలన్నారు. రియల్ టైమ్ లో సమాచారం అందితేనే రైతులకు ప్రయోజనం ఉంటుందని సీఎం అన్నారు. క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, అక్వా కల్చర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో మంచి సేవలు అందిస్తున్నారని సీఎం కొనియాడారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లటంలో వారంతా ముఖ్యపాత్ర పోషించాలని అన్నారు.

అరటి ధర పడిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అనంతపురం, కడప, నంద్యాల జిల్లాల్లో 40 వేల హెక్టార్లలో అరటి సాగు అయ్యిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా లాంటి రాష్ట్రాల్లో ఉత్పత్తి గణనీయంగా పెరగటం, వర్షాల కారణంగా ఎగుమతి వెరైటీ దెబ్బతినటంతో ధరలు పడిపోయాయని తెలిపారు.

## ఆయేషా మీరా హత్య కేసుపై సిబిఐ కోర్టులో విచారణ

**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** అయేషా మీరా కేసుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు సీబీఐ కోర్టులో దాఖలు పిటిషన్ చేసిన పై విచారణ జరిగింది. ఆయేషా మీరా తల్లిదండ్రులకు సీబిఐ ఆమె హత్యకు సంబంధించి సమర్పించిన నివేదికపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అయితే సీబీఐ విచారణ నివేదిక తమకు ఇవ్వకుండా ఎలా అభ్యంతరాలు తెలిపుతామని అయేషా మీరా తల్లిదండ్రులు ప్రశ్నిస్తూ కోర్టులో పిటిషన్ వేసారు. అయితే ఇప్పటికే కేసుకు సంబంధించి అందించాల్సిన వివరాలు అందించామని సీబీఐ తరఫు న్యాయవాదులు. కోర్టుకు తెలిపారు. అయితే తమ విచారణ సమగ్ర వివరణ కావాలని అయేషా మీరా తల్లిదండ్రులు కోర్టును అభ్యర్ధించారు. తదుపరి విచారణ డిసెంబర్ 19కి వాయిదా వేసినట్లు సీబీఐ కోర్టు వెల్లడించింది.

దాదాపు 19 ఏళ్ళ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్టణం దుర్గా హాస్టల్ అయేషా మీరా హత్య, అత్యాచారం జరిగాయి. ఈ కేసులో నందిగామ అనాసాగరానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు, ప్రస్తుతం డ్రైవరుగాను, పాస్టరుగాను చేస్తున్న పిడదల సత్యంబాబును పోలీసులు నిందితునిగా గుర్తించారు. కోర్టు అతన్ని దోషిగా నిర్ధారించి యావజ్జీవ ఖైదును శిక్షగా విధించింది.

## మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా ప్రభుత్వ లక్ష్యం

### -అమలుకు సిద్ధంగా 100 రోజుల ప్రణాళిక - కోస్టల్ రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీర ప్రాంతంలో ప్రత్యేక రక్షణ చర్యలు : డిసిఎం పవన్



**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. డిసెంబర్ లో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మన మత్స్యకారుల సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తీరాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. కాకినాడ జిల్లా మత్స్యకార సోదరులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల ప్రణాళికను అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ తుది దశకు చేరింది. తీర ప్రాంతంలో అంతరించిపోతున్న మత్స్య సంపదను పెంపొందించే చర్యలతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కల్పనపైనా దృష్టి సారించాం. విశాఖ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, మత్స్య శాఖ సూచనల మేరకు రూపొందించిన ప్రత్యేక ప్రణాళికలను అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ కోస్టల్ రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు రూ.2 కోట్లతో ప్రత్యేక చర్యలు చేపట్టబోతున్నాం. 100 రోజుల ప్రణాళక అమలులో భాగంగా మత్స్య సంపద పెంపొందించడం, వేట నైపుణ్యాన్ని పెంచడం, ప్రత్యేక రీఫ్ ల ఏర్పాటు, ప్రత్యామ్నయ ఆదాయ వనరుల సృష్టి తదితర అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించనున్నాం. మన మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తీసుకువెళ్లి అక్కడ విజయవంతమైన కృత్రిమ రీఫ్ కల్చర్, కోస్టల్ టూరిజం యూనిట్ల సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం.



వైద్య ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

## ప్రజారోగ్యంలో సంజీవని ప్రాజెక్టు దేశానికే ఓ దిక్సూచి

### -2026 ఏప్రిల్ 1 నుంచి యూనివర్సల్ హెల్త్ పాలసీ అమల్లోకి వచ్చేలా కార్యాచరణ: సిఎం చంద్రబాబు

**విజయవాడ, నవంబర్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిన చేపడుతున్నా... పర్యవేక్షణ, అజమాయిషీ మాత్రం ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పేదలకు ఉచితంగా మెరుగైన సేవలు అందించేందుకు మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపడుతున్నట్టు వెల్లడించారు. వైద్యారోగ్య శాఖపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఈ సమీక్షలో భాగంగా మెడికల్ కాలేజీల నిర్మాణం, కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్శల్ హెల్త్ స్కీంపై అధికారులతో సమీక్షించారు. పీపీపీ కింద తొలి విడతలో చేపట్టనున్న ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల మెడికల్ కాలేజీల నిర్మాణ ప్రక్రియ ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో భాగంగా నాలుగు దశలు దాటామని..వచ్చే నెలాఖరు నాటికి టెండర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పీపీపీ విధానంలో చేపడుతున్న వైద్య కళాశాలల ద్వారా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే అందే ఆధునిక వైద్య సదుపాయాలు గ్రామీణ ప్రాంతాలకూ అందుతాయని సీఎం అన్నారు. ప్రజలకు, విద్యార్థులకు అంతిమంగా మొత్తం సమాజానికి ఈ మెడికల్ కాలేజీలతో ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న ఒక్కో మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం 50 ఎకరాలు కేటాయించాం. ఈ 50 ఎకరాల్లో 25 ఎకరాలు మెడికల్ కాలేజీ, ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలి. మిగిలిన 25 ఎకరాల్లో నర్సింగ్, పారామెడికల్, డెంటల్ లాంటి ఆయుర్వేద, వెల్ నెస్ సెంటర్, యోగా కేంద్రాలు కూడా ఏర్పాటు చేసి ఇంటిగ్రేట్ చేయాలి. ఆస్పత్రుల్లో 70 శాతం మేర పడకలు పేదలకు ఉచితంగా కేటాయిస్తున్నాం. అలాగే వైద్య సేవలు కూడా ఉచితంగానే ఉన్నాయి. దేశవ్యాప్తంగా వివిధ మోడళ్లల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులు ఉన్నాయి.

## రాష్ట్రంలో టెన్త్ పరీక్షల టైం టేబుల్ విడుదల

**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో టెన్త్ పరీక్షలను మార్చి 16నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 10వ తరగతి పరీక్షల టైమ్ టేబుల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. 16న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న గణితం, 25న భౌతికశాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘికశాస్త్రం, 31న ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్2), ఏప్రిల్ 1న ఓఎస్ఎస్‌సీ సెకెండ్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్షలు నిర్వహించనున్నారు. టైంటేబుల్ విడుదలైన నేపథ్యంలో ఒక ప్రణాళికలో ఆయా పాఠ్యంశాలను అధ్యయనం చేస్తూ పరీక్షలుకు సిద్ధం కావాల్సి ఉంటుంది.

## కొత్త టీచర్లకు సెలవులు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,నవంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మెగా డీఎస్సీ ద్వారా రిక్రూట్ అయిన కొత్త టీచర్లకు సెలవులను మంజూరు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 3న వీరు విధుల్లో చేరగా డిసెంబర్ వరకు వర్తించే ప్రపోర్షనేట్ సెలవులను వెల్లడించింది. నాలుగు సీఎల్స్( (క్యాజువల్ లీవ్), 1 ఓహెచ్ (ఆప్షనల్ హాలిడే), 2 ఎస్‌పీసీఎల్((స్పెషల్ క్యాజువల్ లీవ్), మహిళలు అదనంగా ఒక స్పెషల్ సీఎల్ వినియోగించుకోవచ్చని తెలిపింది. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది ఎంపికయ్యారు. వారంతా గత నెల నుంచి విధులకు హాజరవుతున్నారు.



**100% నీటిలో కరిగిపోయే ఎరువుల మిశ్రమాలను నిల్వచేయడానికి మరియు విక్రయించడానికి నోటీసు**

వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తేదీ 24 అక్టోబరు 2015న జారీచేసిన ఉత్తర్వు నం. 2900 (ఇ) మరియు ఆ తరువాత చేసిన సవరణ ప్రకారం, పారాదీప్ ఫాస్ఫేట్స్ లిమిటెడ్ (పిపిఎల్) ఈ క్రింద పేర్కొనబడిన 100% నీటిలో కరిగిపోయే ఎరువుల మిశ్రమాల నిల్వ మరియు విక్రయంని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించబోతోందనే విషయం ప్రజానీకానికి తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాము.

| | గ్రేడ్‌లు | 1 | 2 |
|---|---|---|---|
| | స్పెసిఫికేషన్/కంపోజిషన్ | ఎన్‌పికె 19:19:19 | ఎన్‌పికె 13:40:13 |
| 1 | బరువు పరంగా తేమ శాతం, గరిష్ఠంగా | 0.5 | 0.5 |
| 2 | బరువు పరంగా మొత్తం నత్రజని, కనీసం | 19.0 | 13.0 |
| 3 | బరువు పరంగా నీటిలో కరిగిపోయే భాస్వరం ($P_2O_5$గా), కనీసం | 19.0 | 40.0 |
| 4 | బరువు పరంగా నీటిలో కరిగిపోయే పొటాషియం ($K_2O$గా), కనీసం | 19.0 | 13.0 |
| 5 | పొడిదనం ఆధారంగా బరువు పరంగా సోడియం (Naclగా) శాతం, కనీసం | 0.5 | 0.5 |
| 6 | బరువు పరంగా నీటిలో కరిగిపోని పదార్థం, గరిష్ఠంగా | 0.5 | 0.5 |
| 7 | పొడిదనం ఆధారంగా బరువు పరంగా మొత్తం క్లోరైడ్ (Clగా), గరిష్ఠంగా | 1,5 | 1,5 |
| 8 | బరువు పరంగా లీడ్ (Pbగా) శాతం, గరిష్ఠంగా | 0.003 | 0.003 |
| 9 | బరువు పరంగా క్యాడ్మియం (Cdగా), గరిష్ఠంగా | 0.0025 | 0.0025 |
| 10 | బరువు పరంగా ఆర్సెనిక్ (Asగా) శాతం, గరిష్ఠంగా | 0.01 | 0.01 |

Paradeep Phosphates

పారాదీప్ ఫాస్ఫేట్స్ లిమిటెడ్ (పిపిఎల్)

రిజిస్టర్డు కార్యాలయం: 5వ అంతస్తు, బయన్ భవన్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మార్గ్, భువనేశ్వర్- 751 001. ఇండియా


## దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక మత్స్యకారులే : సిఎం చంద్రబాబు

### - ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదరులకు, ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

**విజయవాడ,నవంబరు21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదరులకు, ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ సముద్ర తీరం, డెల్టా ప్రాంతం, సరస్సులు, రిజర్వాయర్లు అన్ని కలిపి బ్లూ ఎకానమీలో దేశంలోనే ఏపీని ముందు నిలిపాయని గుర్తు చేశారు. రాష్ట్ర జీఎస్‌డీపీలోనూ మత్స్య రంగానిదే అగ్ర వాటా అని, దీనికి మరింత మద్దతిచ్చేలా మత్స్యకారులకు, ఆక్వారైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వెల్లడించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల సేవల్లో పథకం కింద 1 లక్ష 29 వేల 178 మందికి 20 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయంగా రూ.259 కోట్లు అందించామన్నారు. గంగపుత్రులు కోరుకున్నట్టుగా 217 జీవో రద్దు చేసి సొసైటీలకే హక్కు కల్పించామని తెలిపారు. గంగపుత్రుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారులు-ఆక్వా ఫార్మర్లు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అన్నారు. మత్స్య ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతికత ప్రోత్సాహం కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థిరత్వం, సమతుల్యత, నాణ్యత, నీలి విప్లవం సాధించే మార్గం అంతర్జాతీయ పోటీకి ఆక్వా రంగాన్ని సిద్ధం చేసే ప్రణాళికలు వేస్తున్నామని తెలిపారు. మత్స్యకారులకు, ఆక్వా ఫార్మర్లకు ప్రపంచ మత్స్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆక్వారంగం బలోపేతానికి 1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఆక్వారంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తామని మాట ఇస్తున్నానని అన్నారు. మత్స్యకారులకు ప్రపంచ మత్స్య కార దినోత్సవం సందర్భంగా మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోం దన్నారు. వేట నిషేధ సమయంలో భృతిని రూ.20 వేలకు పెంచామన్నారు. మత్స్య సంపద అగ్రపథాన నిలుపుతామన్నారు.

వార్త

బుర్రలో ఎన్నో విషయాల్ని నింపి గందరగోళం చేసేది విద్య కాదు. వ్యక్తిలో శీలాన్ని పెంపొందించి,జీవితాన్ని తీర్చిదిద్దుకునే అవగాహన కలిగించేదే నిజమైన విద్య.

-ఆస్కార్‌వైల్డ్

# ఉభయ తారక తీర్పు

ఎందరో మేధావుల మధనంతో రూపకల్పన జరిగిన రాజ్యాంగ నిర్మాణంలో ఎన్నో ప్రాధాన్యతాంశాలు, ప్రాథమిక హక్కులు, ఉచితానుచిత నిర్ణయాలు, వాటి పరిష్కారం, సాధ్యాసాధ్యాల పరిశీలన, హేతుబద్ధత క్రోడీకరించిన అంశాలపై దేశ కాలమాన పరిస్థితుల రీత్యా మీమాంసలు తలెత్తడంసహజం. ప్రజాస్వామ్యానికి మూల స్థంబాలుగా చెప్పబడే నాలుగు వ్యవస్థకు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నా జీవన గమనంలో, విధి నిర్వహణలో కార్యాచరణలో తప్పటడుగులు పడకుండా తన వివేచనతో ధర్మాధర్మాల విచక్షణ మేరకు న్యాయ సూత్రాలకు లోబడి సుప్రీంకోర్టే సమవర్తిగా వ్యవహరిస్తోంది. సమయోచితం, సందర్భోచితంతో నిమిత్తం లేకుండా పాలకులు కానీ, ఆపై వ్యవస్థలు కానీ రాజకీయ ప్రేరేపణలతో సరైన నిర్ణయం తీసుకోలేదన్న అపప్రథలు మీద పడిన సంక్లిష్ట సమయాల్లో సుప్రీం ధర్మాసనాన్ని తగు మార్గదర్శకత్వాన్ని తీసుకోవడం ప్రతి వ్యవస్థకూ అనివార్యమైన విషయం. తాజాగా సుప్రీంకోర్టు పలు విచారణ అంశాలపై చేపట్టి జటిలమైన విషయాలను తేలిక చేయగలిగింది. విషయం సంక్లిష్టమైనదే. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో పాలకులు శాసనసభలో తీర్మానం చేసి ప్రజోపకర విధానాలను చేపట్టాలని గవర్నర్ ఆమోదముద్ర కోసం పంపితే అక్కడ గవర్నర్‌లు ఏ విషయమూ తేల్చకుండా తనకున్న అధికారాలను దుర్వినియోగం చేస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పాలనాధికారాన్ని నిర్వీర్యం చేస్తున్నారనే ఆరోపణలు ఈనాటివి కాదు. గతంలోనూ గవర్నర్ల వ్యవస్థపై తెలుగు దేశాధినేత ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఒంటికాలిపై ధ్వజమెత్తారు. రాష్ట్రాల పాలన సజావుగా జరిగే విధంగా సందర్భోచితంగా సలహాలు సూచనలు ఇవ్వొచ్చు. కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వ బిల్లులకు 'క్లీన్ చిట్‌'లు ఇవ్వకుండా తొక్కిపట్టి ఉంచడంతోనే అసలు తంటా వచ్చిపడింది. దాంతో 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్'కు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏకాభిప్రాయ తీర్పునిచ్చింది. రాష్ట్రపతి ఉదహరించిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చింది. స్థూలంగా తీర్పు ఎలా ఉన్నా ధర్మాసనం చాకచక్యంగా ఇచ్చిన తీర్పుతో ప్రస్తుత అంశాలపై ముడిపడి ఉన్న డిఎంకె ప్రభుత్వం కూడా సంతృప్తి వ్యక్తం చేసింది. శాసననిర్మాణంలో రాష్ట్రపతి, గవర్నర్లు నిర్వర్తించాల్సిన బాధ్యతల్ని మరే వ్యవస్థ భర్తీ చేయలేదని స్పష్టం చేస్తూనే మరికొన్ని నిర్దిష్ట సూచనలు చేసింది. రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని స్పష్టం చేసింది. దేశసమాఖ్య వ్యవస్థలో గవర్నర్ల పాత్రపై చెలరేగిన చర్చపై నిశితంగా ధర్మాసనం పరిశీలించింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కోర్టులపరిధిలోకి న్యాయసమీక్ష అవకాశం ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. గవర్నర్లు, రాష్ట్రపతి తమ విధుల నిర్వహణలో కోర్టులకు జవాబుదారీ కాదన్న ఆర్టికల్ 361 కోర్టులకు శిరోధార్యమే అయినా, గవర్నర్లు ఆర్టికల్ 200 కింద తన నిర్ణయాన్ని జాప్యం చేస్తూ సుదీర్ఘకాలం సాచివేత ధోరణిలో ఉంచేస్తే ఆ సమయంలో కోర్టులు తన పరిమిత న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించుకోకుండా ఆ ఆర్టికల్ అడ్డుకోలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్ జస్టిస్ పి.ఎస్. నరసింహ,జస్టిస్ ఎఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రపతి, గవర్నర్లకున్యాయస్థానం గడువు విధించిన సందర్భంలో రాష్ట్రపతి జస్టిస్ ముర్ము రాజ్యాంగంలోని 143వ నిబంధన కింది 14 ప్రశ్నలతో ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ కోరిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తగు వివరణలతో తీర్పునిచ్చింది. తమిళనాడుకు చెందిన పది బిల్లులను గవర్నర్ తొక్కిపెట్టగా వాటిని ఆమోదిస్తున్నట్లు ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ద్విసభ బెంచ్ తీర్పునిచ్చింది. కాగా ఈ తీర్పును కేంద్ర ప్రభుత్వం పై కోర్టులో సవాల్ చేయలేదు. కానీ గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాధికారానికి గడువు విధించే విషయంలో న్యాయస్థానాలకు అధికారులు ఏ మేరకు ఉన్నదీ విశ్లేషించమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారాధర్మాసనాన్ని కోరింది.రాజ్యాంగాధినేతలకు బిల్లుల విషయమై గడువులు విధించడం సహేతుకం కాదన్నది. ఒకపక్క ఈ తీర్పులో సూచించిన అంశాలు కానీ అభిప్రాయాలు కానీ కర్ర విరగకుండా పాము చావకుండా అన్న ధోరణిలో తమ నిశిత పరిశీలనలను అభిప్రాయాల ద్వారా వ్యక్తీకరించారు. రాజ్యాంగంలోని 200 నిబంధన కింద రాష్ట్ర ప్రభుత్వ బిల్లులకు సమ్మతి తెలియ చేయడం కానీ సహేతుకం కాదని అభిప్రాయపడినప్పుడు గవర్నర్ ఆ బిల్లును తిప్పి పంపించవచ్చు. లేదా నేరుగా రాష్ట్రపతికే పరిశీలనకు పంపడం వంటి ఒక ఆప్షన్‌నుఎంచుకోవచ్చు. ఈ మూడు ఆప్షన్‌లు తప్ప గవర్నర్లకు సుదీర్ఘకాల బిల్లులను పెండిర్‌లో పెట్టే అధికారం లేదంది. తగు సవరణలు సూచిస్తూ, అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ శాసనసభకు పంపించవచ్చు. లేదా రాష్ట్రపతికి పంపవచ్చు. సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచేందుకు గవర్నర్‌కు ఎలాంటి విచక్షణాధికారం లేదని వివరించింది. విధుల నిర్వహణలో గవర్నర్‌కు వ్యక్తిగతంగా రక్షణ ఉన్నప్పటికీ ఆయన కార్యాలయం కోర్టు విచారణ పరిధిలోనే ఉంది. ఇన్ని విషయాలను పూర్తిగా విశ్లేషించి తీర్పు చెప్పిన ధర్మాసనం ఏప్రిల్ 8 నాటి తీర్పును తోసిపుచ్చలేదు. దీంతో తమిళనాడు ప్రభుత్వం ఆనాటి తీర్పు, పరిణామాల పర్యవసానంపై ఎలాంటి పునరాలోచన చేయనవసరం లేదని భావించినట్లే.

పుస్తకం విలువ దాని ఖరీదుతో వెలకట్టకండి. ఆ పుస్తకం ఇచ్చే అపార విజ్ఞానంతో వెలకట్టండి.

ఆస్కార్‌వైల్డ్

ఎవరైనా మనకు ఇచ్చేది తాత్కాలికమైనది. కృషితో మనం సాధించుకునేది శాశ్వతమైనది.

మహాత్మా గాంధీ

# ఉపాధిని ఉరితాడుగా మార్చొద్దు

గ్రామీణు లను ముఖ్యంగా అన్నదాతలను దృష్టిలోఉంచుకొని పథకాలు రూపొందించాలి. వ్యవసాయంపైనే ఆధారపడి జీవించేవారి ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచే విధంగా విధానాలు రూపకల్పన చేయాలి. వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగా వారిలో ఆత్మవిశ్వా సం పెంచేందుకు రాజకీయాలకు అతీతంగా త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగాలి. ముందుగా నకిలీ, నాసిరకాలను పారద్రోలాలి. చేపట్టే కార్యక్రమాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి. ప్రకృతి సహాయనిరాకరణకు మించి మానవ వంచనకు గురై కృంగికృశించిపోతున్న రైతాంగానికి అభయహస్తం అందించాలి. వారికున్న ఒకేఒక ఉపాధి వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అప్పుడే ఆ సినీ కవి స్వప్నం నిజమౌతుంది.

దామెర్ల సాయిబాబ

'కల్లాకపటం కాననివాడా లోకం పోకడ తెలియనివాడా.. అంటూ రైతులను ఉద్దేశించి పాట రాస్తూ 'పల్లెటూళ్లలో చెల్లనివాళ్లు, పాలిటిక్స్‌తో బతికేవాళ్లు...ప్రజాసేవయని అరిచేవాళ్లు, ఓట్లు గుంజి నిను మరిచేవాళ్లు, పదవులు స్థిరమని భ్రమిసేవాళ్లు, నీవేదిక్కని వస్తురుపదవోయ్.. రోజులు మారాయి అంటూ ఏడు దశాబ్దాల క్రితమే ఒక సినీకవి కోసరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి వచ్చే రోజు,ఈ రోజులు మారేరోజు, ఆ కవి కల నిజమయ్యే రోజు కనుచూపుమేరలో కన్పించడం లేదు. వ్యవసాయం పట్ల గౌరవం మరింత తగ్గిపోతున్నది. ప్రకృతి కూడా రైతుపై పగబట్టి, పిచ్చిపట్టినట్టు వ్యవహరిస్తున్నదేమోననిపిస్తున్నది. ఆటుపోట్లతో అతలాకుతలం అవుతున్న అన్నదాతలకు నేతలు ఇచ్చే ఉపన్యాసాలు, చేసే వాగ్దానాలు ఆకలి మంటలపై మాటలు చిలకరించినట్లుగా ఉంటున్నది. మొన్న ఖరీఫ్ దారుణంగా దెబ్బతీసింది. విడవని వర్షాలు, వరదలతో రైతులుపడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. తొలకరి వర్షాలు ఖరీఫ్‌కు కొంత ఊరట కలిగించినా ఆ తర్వాత వాయు గుండాలు, తుఫాన్‌లు, సృష్టించిన బీభత్సంతో లక్షలాది ఎకరాల్లోని వరిపంట ముంపునకు గురైంది. ఇక మెట్ట పంటల గురించి చెప్పాల్సిన పనిలేదు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటల రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇప్పటికీ వర్షాలు వదలలేదు. మళ్లీ ఇప్పుడు తాజాగా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉంది. కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. మొత్తం మీద రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ క్లిష్టపరి స్థితుల్లో ఎదురొడ్డిపోరాడి అంతో ఇంతో పండించు కొని తెచ్చిన సరుకులను అమ్ముకోవడంలో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు పరాకాష్ఠగా చెప్పొచ్చు. అసలు పత్తి పెట్టవద్దు, ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని పెద్దలనాటినానుడి మళ్లీ ఇప్పుడు పత్తి రైతులకు పదేపదే గుర్తుకువస్తున్నది. రైతుల వద్ద ప్రతి యేడాది పత్తి కొనుగోలు చేసే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈసారి ఎందుకో సజావుగా కొనుగోలు చేయడం లేదు. తడిచిన పత్తిని కొనుగోలుకు ససేమిరా అంటున్నారు. నిబంధనల మీద నిబంధనలు విధిస్తున్నారు. ఎల్1, ఎల్2 అంటూ రైతులను ఇబ్బంది పెట్టేందుకు అన్నిదారులను అన్వేషిస్తున్నారు. రెండు రోజుల పాటు ఏకంగా కొనుగోళ్లు ఆపేశారు. చివరకు తెలంగాణ వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకొని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో చర్చలు జరిపి కొనుగోలుకు తెరలేపించారు. ఇక మొక్క జొన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మొక్క జొన్నలు మార్కెట్‌కు తీసుకువచ్చిన తర్వాత తూకం వేసిన పిదప లారీలు వచ్చి లోడ్ చేసే వరకు రైతులదే బాధ్యత అని అధికారగణం ఆదేశాలు జారీచేసింది. తూకం ఎప్పుడు వేస్తారో తెలియదు. ఎప్పుడు లారీలు వస్తాయో అంత కంటే తెలియదు. వచ్చిన తర్వాత లోడ్ ఎప్పుడు చేస్తారో చెప్పేవారు ఉండరు.గతంలో ఎప్పుడూలేని నిబంధనలు ఇప్పుడు పెడుతున్నారు. దీంతో సరుకులు తూకం వేసిన తర్వాత లారీ వచ్చేవరకు మార్కెట్ యార్డులలోనే రైతులు కాపలా కాయాల్సి వస్తున్నది. మరొకపక్క రాత్రిపూట దొంగలు క్వింటాళ్లకొద్దీ సరుకులను తరలించుకుపోతున్నారు. సిసికెమెరాల్లో రికార్డు అవుతున్నా చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇక వరి రైతుల గురించి ఎంత తక్కువగా చర్చిస్తే అంతమంచిదేమో. తెలం

## ఒక్క మాట

గాణ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు ఐదువందలరూపాయల బోనస్ గత ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వాల్సిన బోనస్ ఇప్పటికీ కొందరికి అందలేదు.తమ సమస్యల పరిష్కారం కొరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోఅఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం నలభైనాలుగు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. రాస్తారోకో చేయడంతో వందలాది వాహనాలు ఆగిపోయాయి. ప్రకృతి సహాయ నిరాకరణతోపాటు తోటి మానవుడు చేస్తున్న దోపిడీకి మరొకపక్క అన్నదాతలు విలవిల్లాడుతున్నారు. కళ్లముందు నకిలీ, నాసిరకం విత్తనాలు, పురుగుమందులతో రైతులు దోపిడీ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.అందిన చోటల్లా అప్పులు చేసి పెట్టుబడిపెట్టి తీరాపంట వచ్చే సమయానికి విత్తనాలు నాసిరకమో, నకిలీవనో తేలడం, లేక వచ్చిన రోగానికి కొట్టిన పురుగు మందులు బోగస్ కావడమో జరిగి రైతులు కుప్పకూలిపోతున్నారు. మళ్లీ అప్పులు ఇచ్చేవారు లేక, పెట్టుబడి లేక మరోపక్క అన్నానికి జరక్క ఆత్మహత్యలవైపు అడుగులు వేస్తున్నారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు దేశవ్యాప్తంగా వేలాదిమంది ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకున్నారు. నేటికీ రోజుకు ఎక్కడో ఒకదగ్గర రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. మరొకపక్క కన్నవారిని, పుట్టిన ఊరును వదిలి లక్షలాది మంది రైతు కూలీలు వలసబాట పడుతున్నారు. రానురాను వ్యవసాయం ఒక శాపంగా పరిణ మించింది. ఏ దిక్కులేక మరో గత్యంతరం లేనివారే గ్రామాల్లో వ్యవ సాయంతో జీవనం సాగిస్తున్నారు. ఏచిన్న అవకాశం దొరికినా గ్రామాన్ని, వ్యవసాయాన్ని వదిలి పట్టణాలవైపు పరుగులు తీయడానికి వెనుకాడడం లేదు. అందుకే గ్రామాల్లో జనాభా తగ్గిపోతుంటే పట్టణాల్లో, నగరాల్లో ఊహకు అందకుండా పెరిగిపోతున్నది. ప్రభుత్వాల వైపునుంచి చేపడుతున్న చర్యలు ఆశించిన మేరకు ఫలితాలు ఇవ్వడంలేదు. ఉపన్యాసాలు, వాగ్దానాలు, పత్రికాప్రకటనలకు మాత్రం కొదవ ఉండడంలేదు. తమ ప్రభుత్వం రైతు పక్షమని, తాము రైతుల శ్రేయోభిలాషులమంటూ వ్యవసాయానికి అగ్రస్థానం ఇచ్చి అభివృద్ధివైపు నడుపుతామని ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చాలా కాలంగా చెప్పుకుంటూనే ఉన్నారు. ఆత్మ హత్య సమస్యకు పరిష్కారం కాదని ధైర్యం కూడా చెబు తున్నారు. ఇలా అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు మాటల్లో అన్నిప్రయత్నాలు చేస్తున్నారు. రైతులు ఆత్మహ త్యలు చేసుకోవడానికి దారి తీస్తున్న కారణాలను అన్వేషించి పరిష్కార మార్గాలు సూచించేందుకు జయతీ ఘోష్ నేతృ త్వంలో ఏర్పాటైన నిపుణుల కమిటీ ప్రతిపాదనల్లో 114 సూచనలను ఆనాటి ప్రభుత్వం ఆమోదించింది. ఆ తర్వాత ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. మరెన్నో పథకాలు ప్రవేశ పెట్టారు.కోట్లాది రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నారు. ఇంత చేస్తున్నా వ్యవసాయరంగం ఏమాత్రం కోలుకోలేకపోతున్నది. విత్తేదగ్గర నుంచి విక్రయించేవరకు అన్నీ కష్టాలే. పాలకులు మూలాల్లోకి పోవాలి. ఉపన్యాసాలతో వారిలో ఆత్మస్థైర్యం పెరగదు.తమ అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదన్న విశ్వాసం, నమ్మకం వారిలో కలిగించాలి. ఉపన్యాసాలు, ప్రకటనలతోపాటు చేతల్లో ఫలితాలు అందినప్పుడే నమ్మకం, విశ్వాసం పెరుగుతుంది. అప్పుడే వారి ఉపన్యాసాలకు ఒక అర్థంపర్థం ఉంటుంది. ప్రభుత్వ విధానాల్లో మార్పురావాలి. ప్రపంచ బ్యాంకు పంథాలో కూడా మార్పు కన్పిస్తున్నది. పేదరికం అంతం కావాలంటే భారత్ లాంటి దేశాలు వ్యూహాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని గతంలో ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నివేదికలో స్పష్టం చేసింది. మార్కెట్ ఆధారిత సంస్కరణల పేరుతో అనుసరిం చిన వ్యూహం పనిచేయ లేదని వాటి స్థితిగతుల ఫలితాలు ఇవ్వలేదని ప్రపంచబ్యాంకు ఏనాడో అంగీకరించింది. పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు కొత్త ఊపిరి ఇవ్వాలంటే వ్యూహాన్ని పునర్ నిర్వచించుకోవాలని కోరింది. పేదలు తమ జీవనాన్ని మెరుగుపరుచుకోవడానికి ఇప్పుడు పరిస్థితులు సరిపోవడం లేదని భారత్ అభివృద్ధికి వ్యవసాయరంగమే ప్రధాన వనరు అని స్పష్టం చేసింది. గ్రామీణ భారతంలో పేదల ఆర్థిక పరిస్థితికి వ్యవసాయోత్పత్తుల పెరుగుదలే కీలకమని స్పష్టంచేసింది. ఇప్పటికైనా పాలకులు వాస్తవపరిస్థితులు గ్రహించాలి. గ్రామీణులను ముఖ్యంగా అన్నదాతలను దృష్టిలో ఉంచుకొని పథకాలు రూపొందించాలి. వ్యవసాయం పైనే ఆధారపడి జీవించే వారి ఆర్థికపరిస్థితి మెరుగుపరిచే విధంగా విధానాలు రూపకల్పన చేయాలి. వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగా వారిలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు రాజకీయాలకు అతీతంగా త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగాలి. ముందుగా నకిలీ, నాసిరకాలను పారద్రోలాలి. చేపట్టే కార్యక్రమాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి. ప్రకృతి సహాయ నిరాకరణకు మించి మానవ వంచనకు గురై కృంగికృశించిపోతున్న రైతాంగానికి అభయహస్తం అందించాలి. వారికి ఉన్న ఒకే ఒక ఉపాధి వారి పాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అప్పుడే ఆ సినీ కవి స్వప్నం నిజమౌతుంది. ●

# నిశ్శబ్దంగా రాలిపోతున్న యువత


సయ్యద్ నిసార్ అహ్మద్

రోజురోజుకు యువత ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు మేలుకోకపోతే పెనుప్రమాదం. మన భారతదేశానికి ఊహించని ప్రమాద ఘటికలు ముందుముందు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏ దేశానికైనా ప్రధాన ఆర్థిక వనరు మానవ వనరు. అందులోనూయువతే దేశానికి ప్రధాన ఆర్థిక వనరు. దేశంలో యువత ఎక్కువగా ఉంటే ఆ దేశం అంతవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ కారణం చేతనే తన దేశంలో యువత సంఖ్యను గణనీయంగా పెంచేందుకు చైనా అధిక సంతానం కోసం అక్కడి ప్రజలను ప్రోత్సహిస్తోంది. ఇలా ప్రతిదేశం యువత సంఖ్య పెంచేందుకు నానాపాట్లు పడుతున్నాయి. కానీ అందుకు భిన్నంగా మన దేశంలోని వాతావరణం కనిపిస్తోంది. మన దేశానికి నేడు యువత సంఖ్య బలంగా ఉంది. ఇది సంతోషించదగ్గ పరిణామమైతే ఈ వనరు ఆకారణంగా చేజారుతోందన్న ఆందోళనకరమైన పరిస్థితి మరోవైపు కనిపిస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. భారతదేశం అభివృద్ధిలో దూసుకుపోతున్న ఈ తరుణంలో, ఆ విజయాల వెనుక దాగి ఉన్న ఒక చీకటి సత్యాన్ని మనం తప్పక గుర్తించాలి. అదే భారత యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఆత్మహత్యల సంఖ్య,సాంకేతిక ప్రగతి, ఆర్థికాభివృద్ధి గురించిమనం ప్రతిరోజూ మాట్లాడుతున్నా, మన యువతరం ఎదుర్కొంటున్న భావోద్వేగ పోరాటాల గురించి మాట్లాడటానికి మాత్రం చాలా అరుదుగా సిద్ధమవుతున్నాం. ఈ నిశ్శబ్దం ఇప్పుడు ప్రాణాలను బలిగొంటోంది. భారత ప్రజా ఆరోగ్యఫౌండేషన్ (పీహెచ్‌ఎఫ్ఐ) తాజా నివేదిక అందించిన గణాంకాలు మనల్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. 15 నుండి 39 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న భారతీయుల్లో ఆత్మహత్యలు ఇప్పుడు ప్రధాన సమస్యగా మారుతోంది. ఇది కేవలం ఒక గణాంకం కాదు. ఇది మన సామాజిక వ్యవస్థలోని లోపాలను,కౌన్సిలింగ్ సేవల్లోని అంతరాలను, మానసిక ఆరోగ్యానికి మనం ఇస్తున్న ప్రాధాన్యత లేమిని ఎత్తి చూపుతోంది. మన యువతరం అనేక వైపుల నుండి తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షలు, కొద్దిపాటి ఉద్యోగాల కోసం తీవ్రమైన పోటీ. ఇవన్నీ యువతపై అపారమైన మానసిక భారాన్ని మోపుతున్నాయి. వైఫల్యంపై ఉన్న సామాజిక తీర్పు భయం వారిని మరింత కృంగదీస్తోంది. తమ పిల్లలుడాక్టర్లు లేదా ఇంజనీర్లు కావాలన్న తల్లిదండ్రుల అంచనాలు,వాటిని చేరుకోలేకపోతున్నామన్న భావన యువతలో ఆందోళనను పెంచుతోంది. సోషల్ మీడియాలో ఇతరుల 'పరిపూర్ణమైన' జీవితాలు, విజయాలు చూసి, తమ జీవితాలు అంత గొప్పగా లేవని భావించడం, నిరంతరం ఇతరులతో పోల్చుకోవడం వంటివి యువతలో తీవ్రనిరాశ, ఒంటరితనాన్ని పెంచి పోషిస్తున్నాయి. దురదృష్టవశాత్తు, మన సమాజంలో మానసిక సమస్యలు అంటే 'బలహీనత' అనే అపోహ ఉంది. 'మనసు బాగోలేదని చెబితే, సమాజం చిన్నచూపు చూస్తుందనే భయంతో చాలామంది యువకులు సహాయం అడగడానికి సంకోచిస్తున్నారు. ఈ ఆలస్యమే ప్రాణాలనుతీస్తోంది. కేవలం అవగాహన ప్రచారాలు సరిపోవు. మనకు ఇప్పుడు అత్యవసరం వ్యవస్థాత్మక మార్పులు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అకడమిక్ విజయాలకే కాకుండా, భావోద్వేగ ఎదుగుదలకు, ఒత్తిడిని ఎదుర్కొనే నైపుణ్యాలను నేర్పడానికి ప్రత్యేకమైన తరగతులు,సెమినార్లు నిర్వహించాలి. ప్రతి విద్యా సంస్థలో అనుభవజ్ఞులైన, సులభంగా అందుబాటులో ఉండే కౌన్సిలర్లు ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సివుంది. ఉద్యోగ స్థలాల్లో మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన పని వాతావరణాన్ని సృష్టించాలి. ఉద్యోగులకు గోప్యతతో కూడిన కౌన్సిలింగ్ సేవలుఅందించాలి. ఉద్యోగులు విరామం తీసుకోవడానికి, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడానికి ప్రోత్సహించాలి. కౌన్సిలింగ్, థెరపీవంటి సేవలు శారీరక చికిత్సల మాదిరిగానే సాధారణంగా, ఆర్థికంగా అందుబాటులో ఉండాలి. గ్రామీణ ప్రాంతాలకుకూడా మానసిక ఆరోగ్య నిపుణుల సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. యువత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. విమర్శించడం కంటే, సహానుభూతితో వారి మాట వినాలి. ●

# పంచాయతీ పోరుకు రంగం సిద్ధం!

ఫిరోజ్‌ఖాన్

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ డెడ్‌లైన్ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది. కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ.3,000 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులను కాపాడుకునే ఏకైక లక్ష్యంతో, మార్చి 31వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 25 లేదా 26 తేదీల్లో షెడ్యూల్ విడుదల చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. డెడికేటెడ్ కమిషన్ రిజర్వేషన్ల నివేదిక ప్రభుత్వానికి చేరినప్పటికీ, 50 శాతం పరిమితి, బీసీ కోటాపై హైకోర్టు విచారణ వంటి చట్టపరమైన సవాళ్లు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ప్రజాపాలన వారోత్సవాలు పూర్తవడానికి ముందే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించడం వెనుక, అధికార పార్టీ తమ పథకాల ప్రచారాన్ని ఎన్నికల ప్రయోజనాలకు వాడుకోవాలనే రహస్య వ్యూహం దాగి ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. రిజర్వేషన్ల విషయంలో పాత జీవోలను రద్దు చేయకుండా హడావుడిగా కొత్త నివేదికకు ఆమోదం తెలపడంచట్టపరమైన సవాల్‌కు తెరతీసింది. ఏదేమైనా, డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు దశల్లో పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమవుతుండగా, ఆశావహులు తమ నామినేషన్లకు ముందే బినామీ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా రూపొందించడం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై ఎస్ఈసీ దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 2025 తేదీలలోపు ఎన్నికల ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందనే సమాచారం వెలువడింది. భద్రతా కారణాల దృష్ట్యామూడు దఫాల్లో పోలింగ్ నిర్వహించడానికి ఎస్ఈసీ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో అతి పెద్ద సవాలుగా ఉన్న రిజర్వేషన్ల అంశంపైనే ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది. 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. సామాజిక, ఆర్థిక, విద్య,



ఉపాధి, రాజకీయ, కుల సర్వే2024 నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. అయితే, గతంలో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నించగా కొన్ని కారణాల వల్ల కోర్టు అడ్డుకుంది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు బీసీల రిజర్వేషన్ కోటా పెంచుతారా లేదా పాత పద్ధతి (సుమారు 22.3 శాతం)నే కొనసాగిస్తారా అనేది తేలాల్సి ఉంది. ఈ అంశంపై హైకోర్టు తీర్పు, ప్రభుత్వ తుది నిర్ణయానికి కీలకం కానుంది. డెడికేటెడ్ కమిషన్ నివేదికకు సర్క్యులేషన్ విధానంలో కేబినెట్ మంత్రుల ఆమో దం తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే, పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్ల శాతాన్ని ఖరారు చేస్తూ జీవో జారీ చేయనుంది. జీవో రాగానే, జిల్లా అధికారులు రెండు రోజుల్లో స్థానిక జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవోలు, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేసి, జాబితాను గెజిట్ రూపంలో ఈ నెల 23న ప్రచురించాలని పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. రిజర్వేషన్లు ఖరారు అయిన తర్వాత మార్పులు చేయరాదనే ఎస్ఈసీ ఆదేశంతో, అధికారులు తప్పులు లేకుండా జాబితా సిద్ధం చేసేందుకు అత్యంత అప్రమత్తంగా ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎస్ఈసీ పూర్తి చేస్తోంది.23వ తేదీన తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలవారీగా ప్రచురించనున్నారు. ఓటర్ల అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం ప్రక్రియ కొనసాగుతోంది. ముఖ్యంగా, ఒకే ఇంట్లోని ఓటర్లు వేర్వేరు వార్డుల్లో ఉండకుండా, ఒకే వార్డు పరిధిలోకి వచ్చే విధంగా మ్యాపింగ్‌లో తప్పులను సవరించాలని ఎస్ఈసీ అధికారులను ఆదేశించింది. పాత జాబితాలో కొత్తగా ఓటర్లను చేర్చడం, తీసివేయడం చేయవద్దని స్పష్టం చేయడం ద్వారా, వివాదాలకు తావు లేకుండా ఎన్నికలకు వెళ్లాలని యంత్రాంగం భావిస్తోంది. ఎస్ఈసీకి పెద్దసవాలు మొత్తంగా, డిసెంబర్ డెడ్‌లైన్‌ను చేరుకునేందుకు యంత్రాంగం వేగంగా కదులుతోంది. ఈ హడావుడి వెనుక ఉన్న ఆర్థిక ఒత్తిడిని పక్కన పెడితే, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగడం అత్యవసరం. అయితే, క్షేత్రస్థాయిలో అధికార పార్టీ మద్దతుదారులు తమకు ఎన్నికల యంత్రాంగం నుంచి సహకారం ఉంటుందనే ధీమాతో ఉండగా, ప్రతిపక్ష శిబిరంలో మాత్రం రిజర్వేషన్ల ప్రక్రియలో లోపాలు జరుగుతాయేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థుల ఎంపికలో పార్టీల బినామీవ్యూహాలు, ఆర్థిక బలం ప్రధాన పాత్ర పోషించనున్నాయి.ముఖ్యంగా, డబ్బు, మద్యం పంపిణీ సంస్కృతికి అడ్డుకట్ట వేయడం ఎస్ఈసీకి అతిపెద్ద సవాలు కానుంది. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యా నికి పట్టుకొమ్మలు. ఈ ఎన్నికల ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపైనా, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎస్ఈసీపైనా ఉంది. ●

# ప్రజావాక్కు



### మావోయిస్టులకు జీవనోపాధి

**మావోయిస్టులు** తాము కోరుకున్న సమాజాన్ని తుపాకీ గొట్టంద్వారా సాధించలేరు.ఈమధ్య అనేక మంది ముఖ్య నాయకులు వారి అనుచర సభ్యులు ఎన్ కౌంటర్లో మరణించగామరెంతోమంది స్వచ్ఛందంగా పోలీసులకు లొంగిపోయారు.ఈమారణకాండలో గతంలోఎంతోమంది పోలీసులు కూడా మావోయిస్టులు పాతిన మందు పాతర్లలో, కాల్పులలో మరణించారు. కేంద్రప్రభుత్వం మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలించడానికి కంకణం కట్టుకుంది. అందుకోసం కాలపరిమితిని నియమించుకున్నది. అందుచేతఅందరూసాహసాలకు పోకలొంగిపోతే బాగుంటుంది. ప్రభుత్వం కూడా వారికి పునరావాసం కల్పిస్తామని అంటోంది.వీరంతా జనజీవన స్రవంతిలోకి త్వరలో వస్తారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### కొండెక్కిన కోడి గుడ్ల ధరలు

**తెలుగు** రాష్ట్రాల్లో సాధారణ ప్రజలు రోజూ వినియోగించే కోడిగుడ్డు ధరలుసామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి.. ఉత్పత్తి తగ్గి, డిమాండ్ పెరగడం వల్ల ధరలు ఒక్కసారిగా రికార్డు స్థాయికి చేరాయి.రిటైల్ మార్కెట్లో ఒక్కో గుడ్డు ధర రూ.7 దాటి పోవడం, హోల్‌సేల్ మార్కెట్లలోనూ ధరలు ఆల్‌టైమ్‌గరిష్టానికి చేరుకున్నాయి.ఈధరలు రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశంఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఉత్తర భారతంలో చలి తీవ్రత పెరగడంతో అక్కడికి తెలుగు రాష్ట్రాల నుంచి గుడ్ల ఎగుమతులు భారీగా పెరిగాయి.పెంచిన ధరలు తగ్గించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### నూతన విద్యావిధానం అవసరం

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీమెకాలే విద్యా విధానాన్ని 2035 నాటికి భారతదేశం నుండి పూర్తిగా తొలగించాలనే సంకల్పం వ్యక్తం చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పవచ్చు. ఇది భారత ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే సాహసోపేత ప్రయత్నం.ఇప్పటి ప్రపంచం టెక్నాలజీ ఆధారంగా వేగంగా మారిపోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటేఅంతర్జాతీయ మేధస్సుముఖ్యంగా అమెరికన్ టెక్నాలజీ ప్రభావం ప్రపంచాన్ని ఒకే గ్లోబల్ విలేజ్‌గా మార్చేస్తోంది.అందువలన ప్రపంచధోరణికి అనుగుణంగా మన విద్యా విధానాన్ని మలచడం అవసరం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఏకరీతి అవయవ దానం అవసరం

**దేశంలో** అవయవ దానం, మార్పిడి వ్యవస్థను మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మార్చేందుకు సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఏకరీతిగల జాతీయ అవయవ దాన విధానం రూపొందించాలని ఆదేశించడం ప్రశంసనీయం. ఇప్పటికీ రాష్ట్రాల వారీగా వేర్వేరు నియమాలు కొనసాగుతుండడం వలన అవయవాల కేటాయింపులోఅసమానతలు,పేదలపై అన్యాయం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఒకే విధమైన నిబంధనలు ఉండటం అత్యవసరం.ప్రత్యేకంగా, అవయవ దాతల భద్రతపై కోర్టు చూపించిన శ్రద్ధ ప్రస్తావనీయమైనది. దాతలు ధనదాహం, ఒత్తిడి వంటి మార్గాల్లో దోపిడీకి గురికాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించడం సమయావసరం. అంతేకాదు, రాష్ట్ర స్థాయి అవయవ మార్పిడి సంస్థలను ఏర్పాటుచేయాలని కోర్టు సూచించడం ద్వారా వ్యవస్థ మరింత బలపడే అవకాశం ఉంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఆర్మీ పాలన

**పాకిస్తాన్‌లో** ఉపయోగిస్తున్న 27వ అధికరణ ఆర్మీ పాలనను మరింత కేంద్రీకృతంగా మరింత శక్తి వంతంగా మారుస్తున్నదా అంటే అవుననే సమాధానం వస్తుంది. ఇంతకు ముందు కూడా ఆర్మీ జనరల్ అధికారులు పాక్‌ను ఏలిన మునీర్ తన విశృంఖలతను చూపుతూ సర్వాధికారాలు చేలాయిస్తున్నారు. అది ఏమి చేస్తుంది? న్యాయ,కార్యనిర్వాహక వ్యవస్థలను ఆగం చేయడం, వాటికి వెన్నుముక లేకుండా చేయడం చేస్తుంది. ఆర్మీ దయాదాక్షి ణ్యాలపై ఆధార పడేట్టు చేస్తుంది.

- భారత అవినాష్, జనగామ

### రెవెన్యూ అధికారులు

**రాష్ట్రప్రభుత్వం** ఆర్థిక సహకారంతో రాష్ట్రంలోని నిరుపేదలకు పంచిన ఇండ్ల స్థలాలు కొన్నిచోట్ల భూకబ్జాలకు, భూ అక్రమాలు గురవుతున్నాయి. రెవిన్యూ కార్యాలయాలలో కాలనీలకు సంబంధించిన రికార్డులున్నాయి. ఇళ్ల స్థలాల కొలతలు, విస్తీర్ణం, కొనుగోలు అమ్మకాల వివరాలను సరిచేసి వివాదాలు లేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఆదేశించారు. ప్రభుత్వం పంచిన కాలనీలలో భూ కబ్జాల గురించి రెవిన్యూ అధికారులకు దరఖాస్తు చేసిన వికలాంగుల సమస్యలు పరిష్కారం చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

Main tab page 111_Main tab page 111.qxd 11/21/2025 11:00 PM Page 1



## జిజిహెచ్‌ని పరిశీలించిన డిఆర్ఓ

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రి (జిజిహెచ్)ని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిజీహెచ్ సుపరింటెండెంట్‌లతో కలసి శుక్రవారం సందర్శించి రోగులకు అందిస్తున్న వసతులు, పారిశుధ్య ఏర్పాట్లను, డంపింగ్ యార్డ్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో రోగులకు అందిస్తున్న వసతులు, ఉన్న సైడు మురుగు కాలువల నిర్వహణ, పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి సూచనలతో జిజిహెచ్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వసతులు, పారిశుధ్య ఏర్పాట్లను, డంపింగ్ యార్డ్ నిర్వహణ, పరిశీలించడం జరిగిందని, దీనిపై జిల్లా కలెక్టర్ వారికి నివేదిక ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంట, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వరరావు, జిజీహెచ్ సుపరింటెండెంట్ డా. మాణిక్య రావు, జిజిహెచ్ వైద్యులు తదితరులు ఉన్నారు.

## సిఎం చంద్రబాబును ఆహ్వానించిన దామచర్ల సత్య

**ఒంగోలు, ప్రభాతవార్త**



కాకినాడలో నిర్మించిన నాలుగు ఆఫ్‌షోర్ నౌకల కమిషనింగ్ వేడుక..తొలి ఎలక్ట్రిక్ టగ్ స్టీల్ కట్టింగ్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆహ్వానిస్తూ ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, సాన్‌మారిటైం వ్యవస్థాపకుడు డైరెక్టర్ అహ్మద్ అలిషా మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం నవంబర్ 29న కాకినాడ పోర్టు వద్ద జరగనుందని, కాకినాడలో పూర్తిగా మేక్ ఇన్ ఇండియాలో భాగంగా నిర్మించిన నాలుగు నౌకలు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమ రంగంలో మైలురాయిగా నిలుస్తాయిని చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. మొదటి ఎలక్ట్రిక్ టగ్ నిర్మాణం తూర్పు తీరంలో షిప్‌బిల్డింగ్ అభివృద్ధికి కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకకు కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ కూడా హాజరుకానున్నారు. స్థానిక మత్స్యకార యువతకు శిక్షణ ఉపాధి కల్పించడం, కాకినాడను షిప్‌బిల్డింగ్ శక్తికేంద్రంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా సాన్‌మారిటైం ఇండియా పనిచేస్తోందని సంస్థ డైరెక్టర్ అలిషా చెప్పారు. ముఖ్యమంత్రి హాజరు ఆంధ్రప్రదేశ్ సముద్ర పరిశ్రమకు ప్రోత్సాహకరంగా నిలుస్తుందని వారు తెలిపారు.

## బాలోత్సవ్‌కు నమోదు తేదీ నవంబర్ 30గా మార్పు

**ఒంగోలు, ప్రభాతవార్త**




విద్యార్థులలో దాగి వున్న వివిధ ప్రతిభలను వెలికి తీయడం కోసం "నెక్స్ట్ జెన్ బాలోత్సవ్" పేరిట ఒంగోలులోని ప్రసిద్ధ విద్యాసంస్థ నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ జిల్లా స్థాయిలో మరియు రాష్ట్రస్థాయిలో మొత్తం 67 విభాగాలలో 23 రంగాలలో సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నది. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, వక్తృత్వం, కథలు చెప్పటం ఇటువంటి ఎన్నో విభాగాలలో ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని రాష్ట్రస్థాయిలో ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం మన ప్రాంతాల్లో ఇదే మొదటిసారి అని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అందరూ కూడా అర్హులే. ఈ పోటీలలో పాల్గొనడం పూర్తిగా ఉచితం. డిసెంబరు 6,7, 13,14 తేదీలలో ఈ పోటీలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేయబడింది. ఈ సందర్భంగా స్కూలు యాజమాన్యం వారు పత్రికా సమావేశం ఏర్పాటు చేసి ఈ పోటీల ఉద్దేశం వివరించడం జరిగింది. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి తమ సదుద్దేశాన్ని గమనించి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని వాగ్దానం చేశారని తెలియజేయడం జరిగింది. బాలోత్సవ్ ప్రచారానికి సంబంధించిన గోడపత్రికలను జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ విడుదల చేశారు. సమావేశంలో స్కూల్ డైరెక్టర్లు డా. మురళీధర్ రెడ్డి, కె. అరవింద, ప్రిన్సిపాల్ డా. ఆర్.ఎల్.వి.రమేష్, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనాలి అనే ఉద్దేశంతో ఆన్లైన్లో నమోదు చేసుకోవడానికి చివరి తేదీ 30.11.2025గా మార్పు చేసినట్లు యాజమాన్యం వారు తెలియజేస్తున్నారు. మిగిలిన సమాచారం కొరకు 7660005774/7660001368 నంబర్లలో సంప్రదించవచ్చు.

## టెలివిజన్ రూపకర్త జాన్ లోగి బెయర్డ్‌కు నివాళి

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని ఒంగోలు బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఒంగోలు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మెకానిక్ అసోసియేషన్, ఒంగోలు ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ జిల్లా అధ్యక్షులు బొడ్డు నరసింహారావు(రాజు) అధ్యక్షత వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు టీవీ రూపకర్త జాన్ లోగి బెయిర్డ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ 1927 సెప్టెంబర్ 7న జాన్ లోగి బైర్డ్ టీవీ కనిపెట్టి ప్రపంచానికి ఎంతో మేలు చేశారని అన్నారు. బ్లాక్ అండ్ వైట్ టీవీ కనిపెట్టిన కాలానుగుణంగా కలర్లో ఆధునికత సంతరించుకుంటుందని అన్నారు. టీవీ మెకానిజం పై ఆధారపడ్డ ఎంతో మంది ఇప్పుడు ఉపాధి కోల్పోయే పరిస్థితి వస్తుందని అన్నారు. కొత్త కొత్త మోడల్స్ వస్తున్నా కానీ వాటి స్పేర్ పార్ట్స్ దొరకడం లేదని, దీని వల్ల టీవీ రంగాన్నే నమ్ముకున్న మెకానిక్‌లు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం టీవీ మెకానిక్‌ల ఆర్థిక స్థితిగతులను ఆలోచించి వారికి సహకారం అందించాలని పేర్కొన్నారు. కొత్తగా వస్తున్న టెక్నాలజీకి టీవీ మెకానిక్‌లకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం బ్యాంకుల ద్వారా అందించినట్లయితే వారి ఉపాధి కోల్పోరని అన్నారు. సంస్థ సీనియర్ నాయకులు పొన్నం హరిబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ వారు ఎలక్ట్రానిక్ కాంప్లెక్స్ నిర్మించి తక్కువ అద్దెలకు షాపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పవీ శేషయ్య, శేఖర్, బీపీఎల్ భాషా, ఎన్వి సుబ్బయ్య, బుజ్జి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి - మరొకరికి తీవ్ర గాయాలు

**చీమకుర్తి, నవంబర్ 21, ప్రభాతవార్త**



ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొని, పక్కనే వస్తున్న లారీ కిందపడి అందులో ఒకరు అక్కడికక్కడే చనిపోయారు. చీమకుర్తి మండలం రెడ్డి నగర్ దగ్గర ఒంగోలు కర్నూలు రహదారిపై శుక్రవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. మరణించిన యువకుడు చీమకుర్తి క్రిస్టియన్ పాలెంకు చెందిన సిహెచ్ ఏడుకొండలు(36) గుర్తించారు. ఇతనికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. ఒక లారీ కి డ్రైవర్ గా పోతుంటాడని తెలిసింది. ఒంగోలు నుంచి తన బైక్ పై ఏడుకొండలు చీమకుర్తికి వస్తుండగా, చీమకుర్తి నుంచి రుద్రవరం వెళ్తున్న మరొక యువకుడు వేగంగా ఎదురవటంతో రెండు బైకులు ఢీకొని కింద పడిపోయారు. ఏడుకొండలు కు బాగా దెబ్బలు తగిలి రోడ్డు మీద పడి ఉన్న సమయంలో, గ్రానైట్ లోడుతో చీమకుర్తి నుంచి ఒంగోలు వెళ్తున్న ఒక ట్రాలీ అతని మీదుగా వెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడే చనిపోయారు. ప్రమాద వార్త తెలుసుకొని చీమకుర్తి సీఐ డి ప్రసాద్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. తీవ్ర గాయాలైన మరొక వ్యక్తిని సీఐ ప్రసాద్ వెంటనే మానవత్వంతో తమ వాహనంలో ఒంగోలుకు తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల ద్వారా తెలియాల్సి ఉంది.






## సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు, ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని అమరావతి సచివాలయంలో మర్యాద పూర్వకంగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు కలిశారు. ఈ సందర్భంగా జనార్దన్ తెలియజేస్తూ ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ, నల్ల వాగు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి అన్ని, కొత్తపట్నం బీచ్ రోడ్డుకు నిధులు కేటాయించాలని కోరడం జరిగిందని, కార్పొరేషన్‌కి రావాల్సిన నిధులు త్వరగా మంజూరు చేయాలి అని తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని తెలిపారు.

# మెప్మాలో అవినీతి అనకొండలు..

- *మహిళల దాచుకున్న సొమ్మును దోచుకుంటున్న ఆర్పీలు,అధికారులు*
- *కోట్లకు పడగెత్తిన పిడి, సీఎంఎంలు రోజు రోజుకు బయట పడుతున్న మెప్మా భాగోతం*
- *విచారణలు బయటపడనున్న విస్తుపోయే వాస్తవాలు*
- *మెప్మా అవినీతిలో భాగస్వామ్యమైనఅధికార,ప్రతిపక్ష నాయకులు*


**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం మెప్మలో రోజుకో అవినీతి బట్టబయలు అవుతుంది. మహిళలు ఆర్థికంగా స్వయం ఉపాధి పరంగా రాణించాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించి వారికి అండగా నిలవాల్సిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అవినీతి జలగలు చేతివాటం ప్రదర్శిస్తూ అవకతవకలకు పాల్పడుతోంది.క్రింద స్థాయి సిబ్బంది నుంచి ఉన్నత అధికారి వరకు చితివాటం ప్రదర్శించడంతో స్వయం సహాయక సంఘాల మహిళలు దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోయింది. బోగస్ గ్రూపులు ఏర్పాటు చేసి ఏకంగా కోట్ల రూపాయలను కొంత మంది ఆర్పీలు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికలుగా చెప్పుకునే డ్వాక్రా సంఘాలు నేడు ఓ అధికారి అవినీతి దాహానికి బలి అయ్యింది. ఒంగోలు మెప్మా నందు మొత్తం 4800 గ్రూపులు ఉండగా 155అంది ఆర్పీలు ఉన్నారు.వారితో పాటుగా 11 మంది సివోలుతోపాటు సిటీ మిషన్ మేనేజర్ ఉన్నారు.వారికి అధిపతిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యవేక్షణ ఉంటుంది. అయితే స్వయం సహాయక సంఘాల మహిళ లకు రుణాలు ఇప్పించడం వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాల్సి ఉండగా ఒంగోలు మెప్మలో మాత్రం అందుకు బిన్నంగా ఉంటుంది.కొంత మంది ఆర్పీలు అధికారికంగా వున్న డ్వాక్రా గ్రూపులకు దీటుగా బోగస్ గ్రూపులు ఏర్పాటు చేసి కోట్లకు పడగెత్తుతూ డ్వాక్రా మహిళలను నిలువునా ముంచుతున్నారు.కింద స్థాయి సిబ్బంది చేస్తున్న అవినీతిని అరికట్టాల్సిన అధికారులు సైతం అదే బాట పట్టడంతో ఆ శాఖ అవినీతి డంపింగ్ యార్డ్ లా మారింది.

**లోన్ చేయాలంటే రేట్ పెట్టాల్సిందే...**

స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు నందు రుణాలు పొందాలంటే ఆర్పీ నుంచి పిడి స్థాయి వరకు ముడుపులు ఇవ్వాల్సిందే.గ్రూపు నందు కొత్త సభ్యులను చేర్చాలంటే 1000 రూపాయలు ఇవ్వాల్సిందే,వాటితో పాటుగా వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటే 2లక్షల నుంచి 4లక్షల వరకు పిడికి అప్పజెప్పాల్సిందే, మార్కాపురం నందు ఎన్నికల సమయంలో కొంత మంది ఆర్పీలను కొన్ని కారణాల నేపథ్యంలో తొలగించారు.వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి వారిని విధుల్లోకి తీసుకున్నారు అని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**ఆర్పీల ఆగడాలతో అమాయకులు బలి...**




డ్వాక్రా సంఘాల నందు బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు అనేకం,వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది ఆర్పీలు వారి పేరుతో నకిలీ గ్రూపు లు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. బ్యాంకులకు చెందిన క్షేత్ర స్థాయి సిబ్బందితో కుమ్మక్కు అయ్యి కరోపతిగా మారుతున్నారు.అవినీతి ఆర్పిల చేతిలో మోసపోయాం అని తెలుసుకున్న అమాయక ప్రజలు లబోదేబోమని కన్నీటి పర్యంతం చెందుతున్నారు.

**అవినీతి ఆర్పిలపై చర్యలు శూన్యం..**

అవినీతికి పాల్పడిన ఆర్పీల పైన చర్యలు లేకపోవడం వలనే అనేక మంది ఆర్పీలు అవినీతి బాట పడుతున్నారు.మొదట విచారణ చేపడతామని పిడి చెప్పినప్పటికీ విచారణ అందుకు బిన్నంగా సాగింది.శాఖాపరమైన చర్యలు తీసుకోగా వారికి పిడి తొత్తుగా వ్యవహరిస్తూ వారి వద్ద నుంచి పైకం వసూలు చేస్తున్నారు అనే విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇలా మెప్మ నందు ప్రతి విషయంలో అవినీతి రాజ్యం ఏలుతుంది,కంచె చేను మేసే అనే విధంగా మెప్మ వ్యవహారం బట్ట బయలు అవుతుంది.ఇంత జారుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ మోనంగా ఉండడం పలు విమర్శలకు తావిస్తుంది.

**ఇబ్బడి ముబ్బడిగా బోగస్ గ్రూపులు ...**

గత వైసిపి ప్రభుత్వంలో హయాంలో బోగస్ గ్రూపులు సృష్టించి బ్యాంకుల ద్వారా అనధికారికంగా కోట్ల రూపాయలను అనేక మంది దోచుకున్నారు.తాము ఏమి తక్కువ కాదు అంటూ ప్రస్తుత అధికార పార్టీ నాయకులు అంతకు మించి వ్యవహరించడంతో అవినీతి తారా స్థాయికి చేరింది..

**మెప్మా అవినీతిపై స్పందించిన దామచర్ల ..**

మెప్మ పై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ ఒంగోలు శాసన సభ్యులు దీనిపై ఘాటుగా స్పందించారు,ప్రతి రోజు ఏదో ఒక రూపాన అటు పత్రికల్లో ఇటు సామాజిక మాధ్యమాల్లో మెప్మపై కథనాలు రావడంతో రాష్ట్ర పురపాక శాఖ మంత్రి నారాయణను ఎమ్మెల్యే దామచర్ల స్వయంగా కలసి ఒంగోలు మెప్మ నందు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు,దీనిపై మంత్రి నారాయణ కూడా సానుకూలంగా స్పందిస్తూ విచారణకు ఆదేశించారు.

**విచారణ వేళ వారిలో భయాందోళనలు ..**

మెప్మ నందు భారీ అవినీతిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపద్యంలో అటు మెప్మ సిబ్బందితో పాటు అధికార ప్రతిపక్ష నాయకుల్లో ఆందోళన నెలకొంది. మరో ప్రక్క స్థానిక ప్రజాప్రతినిధి వద్ద వ్యక్తిగత కార్యదర్శులుగా ఉన్న వారు కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నారన్న ఆరోపణలు వస్తున్న తరుణంలో విచారణ ఏ విధంగా జరుగుతుందో అనే విషయం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.అవినీతి పరులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ దామచర్ల జనార్ధన్ చేసిన వ్యాఖ్యలు తో అవినీతిపరుల్లో వణుకు మొదలైంది. విచారణ నిష్పక్షపాతంగా జరుగుతారా లేక తెలుగు తమ్ముళ్ల ఉన్నారంటూ చేతులు దులుపుకుంటారా అన్నది చర్చగా మారింది. మెత్తంగా మెప్మ అవినీతి బాగోతంపై విచారణ ఏవిధంగా ఉండబోతుందో వేచి చూడాలి.

# స్థిరమైన వ్యవసాయ పద్దతులను ప్రోత్సహించాలి: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి, నేల ఆరోగ్యాన్ని కాపాడడానికి ధార్తీ మాతా బచావో అభియాన్(భూమి మాత రక్షణ కార్యక్రమం- 5050) కార్యక్రమం కింద ధార్తీ మాతా బచావో నిగ్రాణి సమితి'ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ రాజాబాబు అధికారులతో సమావేశమై ధార్తీ మాతా బచావో అభియాన్(భూమి మాత రక్షణ కార్యక్రమం- 5050) కార్యక్రమం విధివిధానాలపై సమగ్రంగా చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయ పద్దతులను ప్రోత్సహించడానికి, నేల ఆరోగ్యాన్ని కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధార్తీ మాతా బచావో అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన విధంగా గ్రామ, సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో ధార్తీ మాతా బచావో నిగ్రాణి సమితిలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. రైతులు తమ పొలాల నేల పరిస్థితులను మెరుగుపరచడానికి, అలాగే అవసరం మేరకు ఎరువులను వివేకవంతంగా ఉపయోగించమని ప్రోత్సహించడం, రైతులకు పంపిణీ చేయబడిన నేల ఆరోగ్య కార్డు నేలలో సూక్ష్మ పోషకాల లోపాన్ని పరిష్కరించడంలో సహాయపడేలా ఈ కమిటీలు పని చేయాల్సి ఉంటుందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువ, వాటి అవశేషాలు మన ఆహారం ద్వారా మన శరీరంలోకి చేరుతున్నాయని, దానివలన క్యాన్సర్ వంటి పలు రకాల వ్యాధులకు మనం గురవుతున్నామని, కనుక ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గించాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు పని చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, ప్రకృతి వ్యవసాయ అధికారి సుభాషిణి, మార్క్‌ఫెడ్ అధికారి హరికృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీలక్ష్మి, ఫెర్టిలైజర్స్ డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదాయ వనరుగా మత్స్యసంబంధ కార్యక్రమాలు విస్తృతం: మంత్రి డోలా







**ఒంగోలు, ప్రభాతవార్త**

రాష్ట్రానికి కీలక ఆదాయ వనరుగా మత్స్య సంబంధ కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి చెప్పారు. ప్రపంచ మత్స్యదినోత్సవ వేడుకలు శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్‌లో ఘనంగా జరిగాయి. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు జి.పేరయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఆర్.వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్య ఆదాయం ఆర్జనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆక్వా కల్చర్‌లో ఒక్కో యూనిట్ రూ.1.5 చొప్పున విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఉప్పాడలో మత్స్యకారుల ఆందోళనను పరిగణలోకి తీసుకుని వారి భూములను ప్రభుత్వం వెనక్కి ఇచ్చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రితెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మత్స్యకారులకు పిలుపునిచ్చారు. ఆక్వా రంగంలో మరింత మంది అధ్యయనం చేసేలా కాలేజీలలో వినూత్న కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి ఉన్న విశాల తీర ప్రాంతాన్ని ఆదాయంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు తమ ఆదాయం పెంచుకునేందుకు ఉత్తమ విధానాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తీర ప్రాంతం వెంట చేపట్టిన పర్యాటక, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో ధరలను కూడా మత్స్యకారుల సమక్షంలోనే ఖరారు చేశామని గుర్తు చేశారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక కట్టుబాటుకు మత్స్యకారులు ప్రతిరూపంగా ఉంటున్నట్లు చెప్పారు. వేట నిషేధ సమయంలోనూ, ఇతర విపత్తులలోనూ ఈ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. వేట నిషేధ సమయంలో రూ.20వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు తాజాగా వచ్చిన మొంథా తుఫాన్ సమయంలో నూ మరిన్ని నిత్యవసర సరుకులను ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బాధితులందరికి పూర్తి స్థాయిలో పరిహారం అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రమాద భీమా రూ.10 లక్షలకు పెంచడాన్ని ఆయన ప్రస్తావించారు. పల్లెపాలెంలో త్వరలోనే ఫిషింగ్ హార్బర్ పనులు కూడా మొదలు పెడతామని చెప్పారు. మత్స్యకారులకు ఉపయోగపడేలా జెట్టీ కూడా కట్టామన్నారు. మత్స్యకారుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, డీజిల్‌కు ఇస్తున్న సబ్సిడీని కూడా పెంచేలా ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ప్రకటించారు. మడనూరు-గుండమాల బీచ్ రోడ్డును సుందరంగా అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక మత్స్యకారులకు తమిళనాడు మత్స్యకారుల నుండి ఎదురవుతున్న సమస్యను పరిష్కరించేలా గత ఏడాదే ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లేఖ రాసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మత్స్యకారులకు ఇళ్ల స్థలాల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మేయర్ మాట్లాడుతూ మత్స్యకారులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కోసం అమలు చేస్తున్న పథకాలే దీనికి నిదర్శనం అని చెప్పారు. జి.పేరయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఇస్తున్న సబ్సిడీని పెంచాలని కోరారు. రాయితీ డీజిల్‌ను 300 లీటర్ల నుంచి 600 లీటర్లకు పెంచాలని కూడా ఆయన అభ్యర్థించారు. ఆర్.వెంకటరావు శ్రీ నిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయరత్నం, పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ ఫిషరీస్ రంగంలో ఉన్న అభివృద్ధి అవకాశాలు ప్రభుత్వం నుంచి కావాల్సిన తోడ్పాటును వివరించారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు మత్స్యకారుల కుటుంబ సభ్యులకు ఒక్కొరికి ఐదు లక్షల రూపాయలు విలువైన బ్యాంకు చెక్కును ఈ కార్యక్రమంలో అతిథులు అందించారు. పది మంది మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, ఐదుగురికి జీపీఎస్ సెట్లు, ఇద్దరికి పడవలు, ఇంజిన్లు, వలలను కూడా ప్రధానం చేశారు.

# నేడు గొర్రెపాడులో గ్రామసభ

**బల్లికురవ, నవంబర్ 21, ప్రభాతవార్త**



స్వామిత్వ సర్వేకి సంబంధించి శనివారం మండలంలోని గొర్రెపాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుసుమ కుమారి తెలియజేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గొర్రెపాడులో గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభం కానున్న ఈ గ్రామ సభకు గ్రామస్తులంతా పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## చంద్రబాబు ఏ విషయం తేల్చలేని ఉత్త నాన్చుడు వ్యవహారం గల్లోడు

**- మార్కాపురం జిల్లా సాధన సమితి**

**యర్రగొండపాలెం, నవంబర్ 21, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మార్కాపురం జిల్లా చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయి రెండు సంవత్సరాలు కావస్తున్న ఎందుకు నాన్చుడు యవ్వారానికి పాల్పడుతున్నారని జిల్లా సాధన సమితి కన్వీనరు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా, జేఏసీ నాయకులు అందే నాసరయ్య, సోమయ్య, సుదర్శన్, రజాక్‌లు ధ్వజమెత్తారు. యర్రగొండపాలెం పట్టణంలోని ఎన్జీవో హోంలో మార్కాపురం జిల్లా సాధన సమితి యర్రగొండపాలెం నియోజకవర్గ జేఏసీ సర్వసభ్య సమావేశం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మెడబలిమి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు స్వచ్ఛంద సంస్థ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి ముఖ్య నాయకులు పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్తనాన్చుడు ధోరణి గల్లోడని, ముఖ్యమంత్రిగా మంచి చేయాలనుకున్న, చెడుగాని చేయాలనుకున్నా జనంలో నాన్చడం ఆయనకు అలవాటు అని దుయ్యబట్టారు. ఎన్నికల తరువాత ప్రకాశం జిల్లా పర్యటనకు పలుమార్లు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లా ఊసే ఎత్తడం లేదని ఆయన ధోరణి చూస్తుంటే మనసుమార్చుకున్నట్లు అనుమానం వస్తుందని అన్నారు. చంద్రబాబునాయుడు అనే వ్యక్తి అధికారంలో లేనప్పుడు ఒక రీతిగా అధికారంలో ఉంటే ఇంకో రీతిగా మారిపోయే మనిషని విమర్శలకు దిగారు. ఎన్నికల ముందు మార్కాపురం సాధన సమితితో సాగిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మార్కాపురం జిల్లా విషయంపై ఒత్తిడి తేలేకపోవడం శోచనీయమని అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ జేఏసీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా నిలబడే అవకాశం ఇప్పటి వరకు స్థానిక నాయకులకు రాలేదని, వలస నాయకులే యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని ఏలుతున్నారని, ఆయారం గయారం లాగా ప్రతి సారి ఎన్నికలకు ఒకరు వస్తున్నారని, నాడు వైసీపీలో ఆదిమూలపు సురేష్, నేడు టీడీపీలో ఎరిక్షన్‌బాబు అంటూ వారి పేర్లను ఎత్తి విమర్శలకు దిగారు. మార్కాపురం జిల్లా సాధన సమితికి జనం సహకారం కావాలని రేపు మార్కాపురంలో జరిగే మరో పోరాటానికి కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం జేఏసీ నాయకులు దేవేండ్ల శ్రీనివాసరావు, కృష్ణ గౌడ్, చెన్నయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు గుమ్మా రాజయ్య, సత్య నారాయణ, అచ్చయ్య లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గ్రంధాలయం వారోత్సవాల పోటీల్లో రాణించిన ముద్ర హైస్కూల్ విద్యార్థి

**యర్రగొండపాలెం, నవంబర్ 21, ప్రభాతవార్త**



58వ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా యర్రగొండపాలెం గ్రంధాలయం శాఖ నిర్వహించిన పోటీల్లో యర్రగొండపాలెం ముద్ర హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చూపి విజేతగా నిలిచారని ముద్ర హైస్కూల్ సెక్రటరీ నాగార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రంధాలయంలో బహుమతుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల విద్యాశాఖాధికారులు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ పాల్గొన్నారు. ముద్ర హైస్కూల్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థి విష్ణన్‌కు పలు కాంపిటీషన్‌లో మొదటి బహుమతి అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు ఝాన్సీ, డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు ప్రదీప్, సార్డ్ స్వచ్ఛంద సంస్థకు చెందిన మరియబాబు పాల్గొన్నారు బహుమతులు పొందిన విద్యార్థులను సెక్రటరీగా నాగార్జునరెడ్డి కరస్పాండెంట్ సాయి కుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.



# ప్రజల కోసం ఎరిక్షన్‌బాబు..

## యర్రగొండపాలెంలో మరోసారి ప్రజాదర్బార్

**యర్రగొండపాలెం, నవంబర్ 21, ప్రభాతవార్త**



యర్రగొండపాలెంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మరోసారి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు . యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ప్రజలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో భాగంగా ఎరిక్షన్‌బాబు ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, అర్జీల రూపంలో స్వీకరించి వాటి పరిష్కారానికి చరవాణి ద్వారా అధికారులతో చర్చించి అర్హ దారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన చాలా మంది తమ సమస్యలను పరిష్కారం దిశగా సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, దోర్నాల మండల పార్టీ అధ్యక్షులు షేక్ మాబూబ్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## దోర్నాలలో విజువల్లి క్లీన్ విలేజ్ - క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్

**పెద్దదోర్నాల, నవంబర్ 21, ప్రభాతవార్త**





థీం- 5 శిక్షణ కార్యక్రమంలో భాగంగా విజువల్లి క్లీన్ విలేజ్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం సంబంధించి దోర్నాలలో శుక్రవారం డీఎల్డీఓ నాసర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పద్మనాభరెడ్డి, దోర్నాల పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం స్వచ్ఛ గ్రామ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తూ పెద్దదోర్నాల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో విజువల్లి క్లీన్ విలేజ్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుధ్యం, పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి గ్రామ రహదారులను పూర్తిగా శుభ్రపరిచారు. గ్రామంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి ఇరువైపులా గ్రామంలోని అన్ని రోడ్లను శుభ్రపరిచి చెత్తను సేకరించి తరలింపు చేశారు. బ్లీచింగ్ పౌడర్ వంటివి చల్లి దుర్వాసన లేకుండా చేశారు. గ్రామంలో ఉన్న రహదారులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ క్లీన్ అండ్ గ్రీన్ ధ్యేయంతో పర్యావరణ పరిరక్షణకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ మన గ్రామాభివృద్ధి మన అందరి బాధ్యత, పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి అద్దం. చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో వేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. గ్రామస్తులు శివ కోటేశ్వరరావు కృషిని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

## గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

**వెలిగండ్ల, నవంబర్ 21, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు థీమ్-5 శిక్షణ కార్యక్రమం, విజువల్లి క్లీన్ విలేజ్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా వెలిగండ్ల మండలంలోని మొగళ్లూరు సచివాలయం పరిధిలో డీఎల్డీఓ కే.శ్రీనివాసులురెడ్డి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్.గంగాధర్ ఆధ్వర్యంలో మొగళ్లూరు సచివాలయంలో క్లాప్ మిత్రలకు ట్రైనింగ్ ప్రోగ్రామ్ శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్డీఓ కే.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ పరిశుభ్రంగా ఉండే విధంగా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అన్ని వీధులు, బస్టాండ్, స్కూల్స్, పార్కింగ్ స్థలాలు, అంగన్వాడీ స్కూల్స్, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, వాటర్ ట్యాంకుల దగ్గర నీళ్ళ బావుల దగ్గర, ఊరిలో ఉన్నా అన్ని వీధులు, రోడ్లు, రహదారులను గ్రీన్ అంబాసిడర్లతో అన్ని చెత్త కుప్పలను నీటుగా తొలగించి అన్ని వీధుల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లించటం, నీళ్ళ ట్యాంకులను క్లీనింగ్ చేపించి బ్లీచింగ్ చల్లించటం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎల్డీఓ కే.శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ గంగాధర్, డిప్యూటీ ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శికొండయ్య, సర్పంచ్ మోపూరి లక్ష్మి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, హెల్త్ డిపార్ట్మెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

**వెలిగండ్ల, నవంబర్ 21, ప్రభాతవార్త**



మండలంలోని మొగళ్ళూరుపల్లి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డిగారి గంగాధర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అందరూ మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మగుండంలో ప్రత్యేక పూజలు

**బల్లికురవ, నవంబర్ 21, ప్రభాతవార్త**



బ్రహ్మగుండం మహా పుణ్యక్షేత్రంలో శుక్రవారం శ్రీగంగాపార్వతి సహిత నాగలింగేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు కొనసాగాయి. అనంతరం స్వామివారికి అష్టోత్తర పూర్వక మహాబిల్వ దళార్చన నివేదన నీరాజన, మహా మంత్రపుష్ప కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి





**పొన్నలూరు,నవంబర్ 21 ,ప్రభాతవార్త**

మండల ప్రజలు వారి వారి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడివో పి.సుజాత అన్నారు. థీమ్ 5 శిక్షణా కార్యక్రమంలో భాగంగా విజువల్లి క్లీన్ విలేజ్ క్లీన్ అండ్ గ్రీన్ ను శుక్రవారం శింగరబొట్లపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు వారి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎవరికి వారు బాధ్యత తీసుకొని పరిశుభ్ర గ్రామాలను రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామవీధులు, రహదారులు, బస్సుస్టాండ్, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, దేవాలయం, చర్చిలు, వాటర్ ట్యాంకులు, బావులలో చెత్తను తొలగించారు. అన్ని చెత్త కుప్పలను తొలగించి, వీధుల వెంట బ్లీచింగ్ పొడర్ చల్లించారు. అదేవిధంగా మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించి వాటి చుట్టూ బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ పి.సాంబయ్య , పంచాయతీ కార్యదర్శు లు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, క్లాప్ మిత్ర లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వామిత్వ గ్రామ సభలు





**పొన్నలూరు,నవంబర్ 21,ప్రభాతవార్త**

మండలంలోని బోగనంపాడు, లింగంగుంట గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వామిత్వ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలకు అధ్యక్షత వహించిన ఎంపీడీఓ పి. సుజాత మాట్లాడుతూ స్వామిత్వ సర్వే వలన ఇళ్ల స్థలాలకి హక్కు పత్రాలు మరియు ఉపయోగాల గురించి వివరించారు. అదే విధంగా 9(2) నోటీసులను, పిపిఎం మ్యాపులు జారిచేసి రిజిస్టర్లలో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.సాంబయ్య, పంచాయతీ కార్యదర్శులు యు.సుబ్రహ్మణ్యం, జె.రవిబాబు, సర్పంచ్‌లు బడుగు సత్యకుమార్, శిరిగిరి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధి నివారణ సర్వేను పక్కగా నిర్వహించాలి

**సింగరాయకొండ, నవంబర్ 21,ప్రభాతవార్త**



కుష్ఠు వ్యాధి నివారణ ఇంటింటి సర్వేను పక్కగా నిర్వహించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ వాణి శ్రీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం భాగంగా ఈ నెల 17వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ టి. వాణిశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చెవులపై లేదా ఎదపై నొప్పిలేని బుడిపెలు, అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యులందరికీ విదిదీ-దిదీ సర్వే తప్పనిసరిగా చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం గ్రామ కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగతపరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీధర్, ఆరోగ్యవిస్తరణ అధికారి మోహన్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సుభాకర్, MLHP సునీత, విజయమ్మ, భారతి, ఆశా కార్యకర్త ఆరిఫా పాల్గొన్నారు.

## ప్రథమ స్థానం వృధా... ప్రభుత్వ నిర్ణయంపై ఆవేదన

**- విద్యశాఖ మంత్రి స్పందించి విద్యార్థినికి న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్**

**సింగరాయకొండ, నవంబర్ 21,ప్రభాతవార్త**



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కొండపి నియోజకవర్గంలో విద్యాశాఖ నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి ప్రభుత్వ పెద్దలు నిర్ణయం కొండంత నిరాశ మిగిల్చింది. సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీవర్షిత పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగిన వక్తృత్వ-క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించింది. ఒంగోలు డివిజన్ విద్యాశాఖ అధికారి చంద్ర మోలేశ్వర్ వర్షిత ప్రతిభను ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు. అయితే అదే పోటీలో తృతీయ స్థానం పొందిన విద్యార్థినికి అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించక పోవడం బాధిత విద్యార్థిని వర్షిత కుటుంబ సభ్యుల్లో ఆవేదన రేపింది. ప్రథమ స్థానం సాధించిన అవకాశాన్ని దక్కనివ్వక పోవడం పిల్లల మనోబలాన్ని దెబ్బతీసేస్తోందని బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థినితో ఇలా వ్యవహరించడం సరికాదని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. బేటీ బచావో-బేటీ పడావో నినాదాన్ని అర్థం చేసే నిర్ణయం ఇదేనని స్థానికులు విమర్శించారు.

## తక్కెళ్ళపాడు, చంద్రపాలెం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభలు ద్వారా పనులు గుర్తింపు

**సంతనూతలపాడు, నవంబర్ 21, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్ళపాడు, చంద్రపాలెం గ్రామాల్లో శుక్రవారం నాడు ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ గ్రామ సభల ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ మేరకు పనులను గుర్తించారు. జాబ్ కార్డులు, కూలీలు, పనుల వ్యయం, వేజ్ పేమెంట్, మెటీరియల్ పేమెంట్‌లకు సంబంధించి వేతనాల వ్యయం ను లేబర్‌బడ్జెట్ ద్వారా గుర్తించారు. ఈ కార్యక్రమాల్లో మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కే.వాసంతి, ఈసీ ఈశ్వరి, చంద్రపాలెం సర్పంచ్ బొడ్డు రామారావు, తక్కెళ్ళపాడు గ్రామఅభివృద్ధి నాయకులు గ్రామటీడీపీ అధ్యక్షులు నలుమోతు శ్రీనివాసరావు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి టి.చిన్న మాధవరావు, టీడీపీ నాయకులు ఈర్ల కమలాహాసన్, నేతిరాజేష్, అనిల్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మనోహర్, విజయ్ చంద్ర, పిచ్చయ్య, జిలాని, కళ్యాణ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, నలుమోతు లక్ష్మీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో లేబర్ బడ్జెట్ ప్రకారం పనులను గుర్తించారు.

# మహా ఫలాలను ఇచ్చే మార్గశిర మాసం ఆరంభం

**బల్లికురవ, నవంబర్ 21, ప్రభాతవార్త**





పవిత్ర వేద భూమి అయిన భారతదేశంలో అందున సనాతన సాంప్రదాయాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చే ఆంధ్ర దేశంలో మార్గశిరమాసం, శుక్రవారం ఘనంగా ఆరంభమైంది. ఈ సందర్భంగా దేవాలయాలలో విగ్రహాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వేదములలో సామవేదమును, రుద్రులలో శంకరుడను, చందస్సులో గాయత్రిని, మాసాలలో మార్గశీర్ష మాసాన్ని అన్నాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో మహాభారతకాలంలో మాసములు మార్గశీర్షములో ఆరంభమవుతూ ఉండేవి. కనుక మాసములలో మార్గశీర్షము మొదటిది. అదే విధంగా ఈ మాసములో ఆచరించబడు ఉపవాసాది వ్రతములన్నియు మహాఫలమును ప్రసాదిస్తాయని శాస్త్రాల పేర్కొంటున్నట్లు వేద పండితులు వివరించారు. ఈ మాసంలో వివాహిత యువతి కొత్తగా కాపురానికి వచ్చిన పిమ్మట ప్రత్యేక వ్రతాలను ఆచరిస్తుంటారు. ఈ మాసమునందే కొత్తగా ఇంటికి వచ్చిన పంటను, భగవదర్పణము కావింతురు. దీనినే అన్నయజ్ఞము అందురు. వాల్మీకి రామయణము నందు ఈ మార్గశిర మాసము మాస శిరోభూషణముగాను, ఆ సంవత్సరమునకే అలంకార ప్రాయముగా చెప్పబడింది. ఈ మాసంలో కలువపూలతో శివుని అర్పించిన అది మహా ఫలితాలను అందజేస్తుందని వేదాలు తెలియజేస్తున్నాయి. ఈ మాసములో ఒక పూట భుజించి, తనశక్తిని అనుసరించి బ్రాహ్మణులకు భోజనం పెట్టినవాడు వ్యాధులనుండి, పాపాలనుండి విముక్తి నందగలడు. సర్వకళ్యాణ సంపూర్ణుడై, అన్ని రకాల ఓషధులను పొందగలడు. ఈ మాసములో ఉపవసించినవాడు మరుసటి జన్మలో వ్యాధి రహితుడు. బలశాలి కాగలడు. వ్యవసాయంలో భాగస్వామియై బహుధనధాన్య సంపన్నుడు అవుతాడు. ఈ మాసములో రోజంతా ఉపవాసముండి కేశవుని అర్చిస్తే అశ్వమేధయాగ ఫలితాన్ని పొందవచ్చు. ఆవ్రతశీలుని పాపం కూడా నశిస్తుంది. ఈ విధంగా మార్గశిర మాసం ప్రాముఖ్యతను వేద పండితులు వివరించారు.

## ప్రదోష వేళలో పరమేశుని మహిమాన్విత విశేషాలు

**పెద్దదోర్నాల, నవంబర్ 21, ప్రభాతవార్త**





పుణ్య కాలలోనే కాక ప్రతి ప్రదోష వేళలోనూ భక్తి తరంగాలు ఉప్పొంగే పుణ్య క్షేత్రం శ్రీశైలం. ప్రదోష సమయం శివునికి అత్యంత ప్రియమైనది అనే పురాణాల ప్రకారం, ఆ సమయాన శ్రీశైల మహా శంకరుడు భక్తుల రక్షణార్థం ఆలయం దిగివచ్చి సంచరిస్తాడని విశ్వాసం భక్తుల్లో అపారమైన ఆధ్యాత్మిక అనుభూతిని నింపుతుంది. ప్రదోష సమయంలో శ్రీ మల్లిఖార్జున స్వామివారి పాద స్పర్శ శ్రీశైల భూమిని మరింత పవిత్రం చేస్తుందని, ఆ శ్రీపాద స్పర్శ మహిమతో అనేక జన్మ పాపాలు నివృత్తి అవుతాయని పండితులు చెబుతున్నారు. ఈ నమ్మకం కారణంగానే ఆ వేళలో స్వామివారి దర్శనం పొందేందుకు లక్షలాది మంది భక్తులు ఉత్సాహంగా తరలివస్తున్నారు. ప్రదోష వేళలో శివాలయ ప్రాంగణమంతా అనిర్వచనమైనా శివనాదంతో మార్మోగుతుంది. భక్తులు దీపాలు వెలిగించడం, రుద్రాభిషేకం, శివనామస్మరణతో ఆలయాన్ని పరమ పవిత్రంగా తీర్చిదిద్దుతారు. శివుని కటాక్షం లభించే అత్యుత్తమ సమయం ప్రదోషం అని శ్రీశైల పీఠాధిపతులు వివరిస్తూ, ఆ సమయాన ఒక సారి ఓ నమో భగవతే రుద్రాయ అని జపించిన శివ కృప ఖచ్చితమని చెబుతున్నారు. ప్రదోష వేళలో శ్రీశైల పర్వత ప్రాంతం శివమయముగా శాంతిమయంగా మారుతుంది. గిరులు ఘోషిస్తాయి. భక్తి వాహకమవుతుంది. అన్నింటిని ఆవరించే శివాంస అక్కడ ప్రతి భక్తుడికి అనుభూతమవుతుంది. శ్రీపాద స్పర్శ భాగ్యము లభించుటే జన్మ సాఫల్యం అంటూ భక్తులు పరమానందాన్ని ఆస్వాదిస్తున్నారు. ప్రదోష మహిమలో శంకరుని అనుగ్రహం అందాల కైలాసం శ్రీశైలంలో శాశ్వతంగా ప్రసరిస్తూనే ఉంది. శ్రీశైలం స్వయం భూజ్యోతిర్లింగం. ఈ సమయంలో ఇక్కడ దర్శనం దొరికితే సర్వ పాప నాశనం, ఆయురారోగ్య సర్వసంపదలు, కర్మబంధ విమోచనము లభిస్తాయని అగస్త్య మహర్షి, శివపురాణం వర్ణిస్తాయి. సంధ్యాకాలములో మల్లిఖార్జున దేవాలయం గంటారవాలు, శివనామస్మరణ అన్ని గిరి పర్వతాల మధ్య ప్రతిధ్వనిస్తాయి. ప్రదోష వేళలో శ్రీశైలాన్ని చూసిన వారికి కైలాస అనుభూతి కలుగుతుందని భక్తులు చెబుతున్నారు.

## ప్రైవేట్ ట్రావెల్లో అక్రమంగా రవాణా చేస్తున్న గోమాంసం పట్టివేత

**సింగరాయకొండ, నవంబర్ 21, ప్రభాతవార్త**



జాతీయ రహదారిని అడ్డాగా చేసుకొని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న గోమాంసాన్ని సింగరాయకొండ పోలీసులు గురువారం తెల్లవారుఝామున పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పదహారు నంబర్ జాతీయ రహదారి మీదుగా విశాఖపట్నం నుంచి చెన్నై దిశగా వెళ్తున్న ఎస్‌వీడీ దేవాంశ్ ట్రావెల్స్ బస్ (AR 01 W 9299)లో తుని వద్ద భారీగా ఐస్‌బాక్స్‌లలో ప్యాకింగ్ చేసిన గోమాంసం లోడ్ చేసినట్టు ముందస్తు సమాచారం లభించింది. ఈ నేపథ్యంలో ఎస్ఐ బి.మహేంద్ర తన సిబ్బందితో కలిసి బస్సును ఆపి తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో బస్ లగేజ్ క్యాబిన్‌లో 11 ఐస్‌బాక్స్‌లలో సుమారు 550 కిలోలకు పైగా గోమాంసం దాచిపెట్టి తరలిస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రారంభ విచారణలో పెట్టెల్లో రొయ్యలు ఉన్నాయని డ్రైవర్ గుజ్జుల ప్రేమకుమార్ చెప్పినప్పటికీ, పోలీసుల ప్రశ్నలు ముమ్మరం కావడంతో నిజం బయటపడింది. ఈ స్వాధీనం చేసిన గోమాంసంపై రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నమోదు చేసి, పాకల పశుసంవర్ధకశాఖ వైద్యుడి సూచనల మేరకు ఎఫ్ఎస్ఎల్ పరీక్ష కోసం నమూనాలు పంపారు. ఈ ఘటనపై క్రైమ్ నం.204/2025 కింద కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

## అన్ని పంచాయితీల్లో ఎన్ఆర్ఈజిఎస్ పనులపై గ్రామసభలు

**రాచర్ల, నవంబర్ 21, ప్రభాతవార్త**

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గల సచివాలయాల్లో నేడు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు జరుగుతాయని మండల ఎంపీడీవో ఎస్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ గ్రామసభల ద్వారా కొత్త జాబ్ కార్డు కావాలన్న వారి నుండి దరఖాస్తుల స్వీకరించడం, పనుల కొరకు డిమాండ్ తీసుకోవడం, తొలగించబడిన జాబుకార్డుల గురించి సిబ్బంది ద్వారా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు, ఉదయం 10 గంటలకు ఆకవీడు, గౌతవరం, జేపీ చెరువు, సత్యవోలు, సోమిదేవిపల్లి, 12గంటలకు అనంపల్లి, చిన్నగానిపల్లి, గుడిమెట్ట, 2గంటలకు కాల్వపల్లి, 3గంటలకు చోళవీడు, పాలకవీడు, 4గంటలకు ఎడవల్లి, ఒద్దులవాగుపల్లి, రాచర్ల గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## జాతీయ చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన నల్లగట్ల ప్రసాద్

**రాచర్ల, నవంబరు 21 ప్రభాతవార్త**



ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఉద్యోగుల జాతీయ చెస్ క్రీడా పోటీల్లో రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన నల్లగట్ల ప్రసాద్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో గెలుపొంది అందరి మన్ననలు పొందారు. ఈనెల 19వ తేదీన విజయవాడ జిఎంసి స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఉద్యోగులకు రాష్ట్రస్థాయి చెస్ క్రీడా పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 94మంది ఈ జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనగా అందులో నల్లగట్ల ప్రసాదు మొదటి స్థానం సాధించారు. ఈయన గిద్దలూరు మండలం నరవ బయనపల్లె గ్రామం మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల యందు ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేయుచున్నారు. రాష్ట్రస్థాయిలో జాతీయ క్రీడలో ప్రథమ స్థానం సాధించిన ఉపాధ్యాయుడు ప్రసాదుకు గిద్దలూరు, రాచర్ల మండలాల పలువురు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన మైనంపాడు హైస్కూల్ విద్యార్థులు



**సంతనూతలపాడు, నవంబర్ 21, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు తెలిపారు. శుక్రవారం నాడు పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయా పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాలుర విభాగంలో గిరి వర్ధన్, శ్రావణ సాయి, తేజ మోక్షజ్ఞలు, అండర్-17 బాలికల విభాగంలో లోహిత, సిరి చందన, దీపికలు, అండర్-17 బాలుర విభాగంలో చరణ్ కుమార్, అశోక్, యశ్వంత్, నరేంద్రలు, అండర్-19 బాలికల విభాగాలలో సాయి శ్రీవాణి, సువర్షితలు, అండర్-19 బాలుర విభాగంలో వెంకట కార్తీక్ ఎంపికైనట్లు పీఈటీలు డి.శ్రీనివాసరావు, తిరుమలశెట్టి రవికుమార్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వివిధ ప్రాంతాలలో త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను పీఈటీలను, ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు తదితరులు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మెంథా తుఫాను బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ





**దొనకొండ,నవంబర్ 21,ప్రభాతవార్త**

ASSIST సేవా సంస్థ సహకారంతో మెంథా తుఫాను భాధితులకు పైటర్స్ కీ నిత్యావసర సరుకులు పంపిణీ శుక్రవారం దొనకొండ డా. గొట్టిపాటి లక్ష్మీ నివాసం వద్ద ఇటీవల మెంథా తుఫాను కారణంగా బాధితులకు పైటర్స్ కీ దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో ASSIST సేవా సంస్థల సహకారంతో దర్శిలో 150 మందికి, దొనకొండలో 86 మొత్తం 246 మందికి 10ల బియ్యం,1 ఆయిల్,1 కందిపప్పు నిత్యావసర సరుకులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో దొనకొండలో మండల పార్టీ అధ్యక్షులు మోడీ ఆంజనేయులు,దొనకొండ మండల MRO, MPDO దర్శిలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యాడ్ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా,దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపుడి స్టివెన్ వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు,కూటమి శ్రేణులు ఉన్నారు.త్వరలో ASSIST సేవా సంస్థ సహకారంతో 9,10 తరగతి చదువుతున్న ఆడపిల్లలకు సైకిళ్లు పంపిణీ చేస్తాము అని అన్నారు.

## ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దు

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**




**దొనకొండ,నవంబర్ 21,ప్రభాతవార్త**

మండల కేంద్రమైన దొనకొండ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమంలో దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటిలక్ష్మీ పాల్గొని ప్రజల నుండి వినతులను అందుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం,ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మాత్యులు నారాలోకేష్‌బాబు స్వయంగా ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసు కొని అప్పటికప్పుడే పరిష్కరించేందుకు చేస్తున్నకృషి చూస్తున్నాం.ప్రజాదర్బార్లు ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి,లోకేష్ స్వయంగా పాల్గొంటూ ప్రజల నుండి సమస్యలు తెలుసుకుని అధికారుల ద్వారా తక్షణమే పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తున్నారు. అదే స్ఫూర్తితో దర్శి నియోజకవర్గంలో కూడా అధికార యంత్రాంగం అప్రమత్తతతో ప్రజల సమస్యలను తక్షణం పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.చిన్నచిన్న సమస్యల కోసం వచ్చే ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పవద్దని మన కూటమి ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలు తీర్చే విధంగా అందరూ జవాబుదారీ తనంతో పనిచేయాలని ఆమె ఇతవు పలికారు.ముఖ్యంగా రెవిన్యూ సమస్యలు, భూముల ఆన్లైన్లో ఎక్కించడం,పట్టాదారు పాసుపుస్తకాలు,సర్వేలు భూవివాదాల పట్ల రెవిన్యూ సిబ్బంది తక్షణమే పరిష్కారమయ్యే విధంగా శ్రద్ధ చూపాలన్నారు.అదేవిధంగా విద్యుత్ సమస్యలు,పెన్షన్లు,రోడ్లు,డ్రైన్లు,చిన్న చిన్న వివాదాలు పోలీస్ కేసులు ఇలా ప్రజల సమస్యల పట్ల అధికార యంత్రాంగం మన ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు సేవకులుగా పనిచేయాలని అందుకు నా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అవినీతికి తావు లేకుండా ప్రజల అవసరాలు తీర్చాలని ఆమె స్పష్టం చేశారు.వచ్చే ప్రజా వేదిక నాటికి ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా అధికారులు కసరత్తు చేసి పూర్తి చేయాలని ఆమె కోరారు.స్థానికంగా పరిష్కారం కాని సమస్యలు తనకు అందజేయాలని జిల్లా కలెక్టర్‌కి ఆయా సమస్యలను విన్నవించి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానన్నారు.వెనుకబడిన దొనకొండలో ఉపాధి కల్పించి వలసలు నివారించే లక్ష్యంగా అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేయాలని అందుకు కూటమి ప్రభుత్వం కూడా అండదండగా ఉంటుందని ఇప్పటికే కొన్ని పరిశ్రమలు దొనకొండకు రప్పించేందుకు కృషి జరుగుతుందన్నారు. సోలార్ పార్క్స్, ఆయుధ కేంద్ర పరిశ్రమ వంటి పరిశ్రమలతో దొనకొండను పారిశ్రామిక అభివృద్ధి దిశగా మన కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల ప్రజానీకం,మండలMRO రమాదేవి,MPDO వసంతరావు,పంచాయతీ,విద్యుత్, హౌసింగ్,RWS, ఇరిగేషన్ వివిధ శాఖల అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు మోడీ ఆజనేయులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పాగాపురపు శివకోటేశ్వరరావు,పట్టణ టిడిపి అధ్యక్షులు తోహిద్, మండల ఐటీడీపీ అధ్యక్షులు వై.కె.చౌదరి, మండల తెలుగు యువత శేషు,సహకార బ్యాంక్ చైర్మన్ లు,నీటి సంఘం అధ్యక్షులు,వివిధ హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు,క్లస్టర్,యూనిట్ బూత్ ఇంఛార్జిలు,కూటమి శ్రేణులు తదితరులు ఉన్నారు.

## థీమ్-5 శిక్షణ కార్యక్రమంలో భాగంగా మేడపిలో స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాం



**త్రిపురాంతకం, నవంబర్ 21, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని మేడపి గ్రామ పంచాయతీ నందు ఎంపీడీఓ రాజ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ మురళి ఆధ్వర్యంలో విజవల్లి పరిశుభ్రత వర్షపదం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఉదయం 7గంటలకే గ్రామానికి చేరుకొని అన్ని వీధులు, రహదారు, బస్టాండ్, స్కూల్స్, పార్కింగ్ స్థలాలు, అంగనవాడి స్కూల్స్, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, వాటర్ ట్యాంకుల దగ్గర, నీళ్ల బావుల దగ్గర, ఊరిలో వున్న అన్ని వీధులు, రోడ్లు, రహదారులను మండలంలో ఉన్న 72 మంది గ్రీన్ అంబాసిడర్ (క్లాప్ మిత్ర)లతో అన్ని చెత్త కుప్పలను తొలగించారు. అన్ని వీధుల వెంట బ్లీచింగ్ పౌడర్ను చల్లించారు. నీల ట్యాంకులను శుభ్రం చేపించి బ్లీచింగ్ చల్లించడం జరిగింది. సాధ్యమైనంత వరకు గ్రామమంతా కలియతిరిగి కొంతమేరా శుభ్రం చేయడం జరిగింది. పూర్తిగా శుభ్రం చేయాలి అంటే కనీసం మరో రెండు మూడు రోజులు పడుతుంది. కారణం ఎక్కువ విస్తీర్ణంలో మెయిన్ రోడ్ ఎండురివారిపాలెం చెరువు నుండి పాత అన్నసముద్రం మెట్టు వరకు సుమారు కిలోమీటర్ పొడవు, పాలెం నుండి ఐటీ వరం రోడ్ వరకు, అలాగే గ్రామంలో నుండి హై స్కూల్ వరకు వెరసి సుమారు రెండుచదరపు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన వీరమేడిపిలో సుమారు మాత్రమే క్లాప్ మిత్ర కార్మికులతో శుభ్రం కావాలంటే సాధ్యపడని విషయమని, కనీసం పరిసరాల పరిధిలో అయినా నిల్వ ఉన్న వ్యర్థాలను తొలగించి కొంతమేరా రోగాలు రాకుండా ఉండాలి అంటే మరో ముగ్గురు లేక నలుగురు క్లాప్ మిత్రమా వర్కర్స్ అవసరం ఎంతైనా ఉందని, ఈ విషయం అధికారులు గుర్తించి జలాంటి మేజర్ పంచాయతీలకు వారిని నియమించాలని అక్కడ గుమికూడిన ప్రజలు చర్చించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ మురళి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరు, సచివాలయం సిబ్బంది, హెల్త్ డిపార్టుమెంట్, ఎస్హెచ్జి సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు మండలంలోని 72 మంది క్లాప్ మిత్రలు మండలంలోని అన్ని శాఖలవారిని ఒక గ్రామానికి చేర్చి గ్రామాన్ని శుభ్రం చేయడంలో ఎంపీడీఓ రాజ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ మురళి కొంతమేరా సఫలీకృతులయ్యారని చెప్పవచ్చు. కార్యక్రమం నూతనంగా భాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎంపీడీఓ మురళికి ఘనంగా శాలువా కప్పి సత్కరించారు.


## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విశ్వనాథపురం హై స్కూల్ విద్యార్థిని కావ్య



**త్రిపురాంతకం, నవంబర్ 21, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రమైన ఒంగోలులో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ పోటీలలో అండర్ 17 బాల బాలికల అథ్లెటిక్స్‌లో ట్రిపుల్ జంప్ విభాగంలో విశ్వనాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పిక్కిలి కావ్య జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, ప్రకాశం జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనదని ప్రధానోపాధ్యాయులు పోలయ్య, ఫిజికల్ డైరెక్టర్ మాగులూరు కోటేశ్వరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, పాల్గొని విద్యార్థినికి అభినందనలు తెలియజేసి రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆశీర్వదించారు.

## మార్కాపురంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**మార్కాపురం, నవంబర్ 21, ప్రభాతవార్త**

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి శుక్రవారం మార్కాపురం పట్టణంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల గృహాలకు స్వయంగా వెళ్లి అందజేశారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు తెలుసుకుని ధైర్యంగా ఉండాలని తెలిపారు.సీఎం సహాయనిధి చెక్కులు పొందిన వారిలో సాంబశివరావు ప్రసాదరావు రూ.42,881, కొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి రూ..47,450లు, గ్రంధే రామసుబ్బారావు రూ.27వేలు, దూదేకుల పెద్దఖాసిం రూ.68,415, కొల్లి వెంకయ్య రూ.43,092లు, వంగాల ప్రసాదరావు రూ.41,084లు, షేక్ మహమ్మద్ అయాన్ రూ.35,681లు, కోలా కుమారి, రూ.27,114లు, షేక్ రహమత్ బి రూ.25,541లు,మొత్తం పంపిణీ చేసిన రూ.3,58,258లు పంపిణీ చేసినట్లు తెలిపారు. తమ్ముపురం పట్టణంలో ప్రభుత్వ పథకాల ప్రజలకు అందుబాటులో ఉండే సేవలు, సహాయాలు మరింత బలోపేతం అవుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఏల్చూరుకు చెందిన తలపల శ్రీనుకు మెదడు ఆపరేషన్‌కు ఎల్ ఓ సీ



**సంతమాగులూరు, నవంబర్ 21, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కుటుంభానికి తలపల శ్రీను తీవ్ర మైన మెదడు వ్యాధితో బాదపడుతున్నాడు. మెదడు ఆపరేషన్ చేయాల్సి రావడంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు పెరివేముల అరుణ రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసు పోవడంతో ఆయన సిఫార్సు మేరకు ప్రభుత్వం పేదకుటుంభానికి మేమున్నాం అంటూ అండగా నిలచింది. గుంటూరులోని ప్రముఖ న్యూరో వైద్యశాల బ్రిందా న్యూరో సెంటర్‌లో తలపల శ్రీను మెదడుకు తక్షనమే శస్త్ర చికిత్స చేసే విధంగా రు.3.0 లక్ష ఎల్ ఓ సీ ని బాదిత శ్రీను భార్య అనురాధకు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యక్తిగత అంతరంగికుడైౖ కుక్కపల్లి పార్ధ సారధి చిలకలూరిపేట లోని మంత్రి క్యాపు కార్యాయలంలో శుక్రవారం సాయంత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారు బాదిత తలపల శ్రీను భార్య అనురాధ, పెరివేముల అరుణ ,నక్కా శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ ఢీకొట్టి ఒకరికి తీవ్ర గాయాలు



**సంతమాగులూరు, నవంబర్ 21, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం పాతమాగులూరు వద్ద గుంటూరు-కర్నూలు రహదారిపై మోటార్ బైకు రోడ్డు దాఉతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటనలో పాతమాగులూరు గ్రామానికి చెందిన షేకన మస్తాన్ వలి గాయాల పాలయ్యాడు, వివరాలలోకి వెళితే బాదిత మస్తాన్‌వలి నరసరావుపేటలో ముటా పనులకు వెల్లి బస్సు దిగి ఇంటికి చేరుకునేందుకు రోడ్డు దాటుతుండగా వినుకొండ వైపు నుండి లైట్లు వేయకుండా వేగంగా వస్తున్న మోటార్ బైకు ఢీకొట్టడంతో మస్తాన్ వలి తలకు, కాళ్లకు బలమైన గామాలయ్యాయి. క్షత గాత్రుని 108 వాహనంలో నరసరావుపేటలోని ప్రవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తున్నారు. బాదితుని నుండి నరసరావుపేట పోలీసులు పిర్యాదు స్వీకరించి సంతమాగులూరుకు బదిలీ చేశారు.

## పశువుల సంరక్షణ, రోడ్డు ప్రమాదాలపై అవగాహన



**సీఎస్‌పురం, నవంబర్ 21, ప్రభాతవార్త**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం 2025లో భాగంగా పశువుల సంరక్షణ, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కోవిలంపాడు, మిట్టపాలెం గ్రామాలలోపశువైద్య సహాయకు రాలు అపూృత సహకారంతో, గ్రామాలలోని గేదెలకు రేడియం మెడ బ్యాండ్‌లను విద్యార్థులు కట్టారు.జాతీయ రహదారి సమీపంలో రాత్రి పూట పశువుల మరణాలు పెరుగుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. పశువులను కాపాడుకోవడానికి రేడియం మెడ్ బ్యాండ్‌లను ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.ఈ బ్యాండ్‌లు డ్రైవర్లు చీకటిలో జంతువులను గమనించడానికి సహాయపడతాయని,ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి లక్ష్యంగా స్వామిత్వ గ్రామసభ

**- టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి**




**హనుమంతునిపాడు, నవంబర్ 21, ప్రభాతవార్త**

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం స్వామిత్వ ప్రత్యేక గ్రామ సభలు చేపట్టిందని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద గొల్లపల్లి గ్రామ పంచాయతీలో స్వామిత్వ స్వామిత్వ ఫేస్-2 ప్రత్యేక గ్రామసభ డిప్యూటీ ఎంపీడీవో జయప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ స్వామిత్వ సర్వే ద్వారా ప్రతి ఇంటి స్థల యజమానులకు శాశ్వత స్థల హక్కును కల్పించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యమంలో గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, బూత్ ఇన్‌చార్జి పగడాల శ్రీనివాసరెడ్డి, వీరబ్రహ్మాచారి,వీఆర్వో బాదుర్ల, కాట్రగుండ్ల గ్రామ పార్టీ అధ్యక్షులు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలి

**- మార్కాపురం జిల్లా సాధన సమితి డిమాండ్**




**మార్కాపురం, నవంబరు 21, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు చూపుతున్న నిరక్ష్య ధోరణిని తీవ్రంగా ఖండిస్తూ, మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ 24 తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మార్కాపురంపట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మార్కాపురం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మార్కాపురం జిల్లా సాధన సమితి పిలుపునిచ్చింది. మార్కాపురం జిల్లా కోసం పోరాడిన ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు,ప్రాంతంలోని రాజకీయ నాయకులు,అలాగే మార్కాపురం జిల్లా సాధన సమితి సభ్యులు, మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆకాంక్షించే ప్రతి శ్రేయోభిలాషి ఈ నిరసన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని, ప్రభుత్వానికి తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని హృదయపూర్వకంగా కోరుతున్నట్లు తెలిపారు.

## నేడు నాగిరెడ్డి పల్లెలో విద్యుత్ సరఫరా నిలిపివేత



**కొమరోలు, నవంబర్ 21, ప్రభాతవార్త**

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల, నాగిరెడ్డిపల్లె ఫీడర్లోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం ఉదయం 9 గంటల నుండి, సాయంత్రం 6 గంటల వరకు ఆర్‌డిఎస్‌ఎస్ కొత్త లైన్ వేయడం జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

## మాలధారులు దీక్షను భక్తిశ్రద్ధలతో పూర్తి చేయాలి



**రాచర్ల, నవంబర్ 21 ,ప్రభాతవార్త**

మాలధారులు దీక్షకాలాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేయాలని రాచర్ల తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు తెలిపారు.మండల కేంద్రమైన రాచర్ల శివాలయం లో ఆంజనేయ స్వామి మాలదారులకు ఆయన శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయస్వామి ఆశీస్సులతో ఆంజనేయ భక్తులకు మాలధారులకు అన్నదానం ఏర్పాటు చెయ్యాలనే ప్రేరణ కలిగి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మాలదారులు భయభక్తులతో దీక్ష కాలాన్ని పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమం అనంతరం కమిటీ సభ్యులు కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఎస్ వెంకట్రామిరెడ్డి రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు, రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కె యోగానంద్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ జీవనేశ్వర్ రెడ్డి, టిడిపి నేతలు డి కాశిరెడ్డి, పి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీలను తనిఖీ చేసిన ఉద్యానవనాధికారి శ్వేత



**కొమరోలు, నవంబర్ 21,ప్రభాతవార్త**

కొమరోలు మండలంలోని తాటిచర్ల, నాగిరెడ్డిపల్లి గ్రామంలోని షెడ్ నెట్ నర్సరీలను ఉద్యానశాఖ అధికారి శ్వేత శుక్రవారం తనిఖీ చేశారు. నర్సరీ యజమానులు నారు అమ్మే సమయంలో రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. అదే విధంగా అందరూ యజమానులు నారుకు సమందించిన రిజిస్టర్లను నిర్వహించాలని, నాణ్యమైన నారుమాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు .నర్సరీ చుట్టూ చెత్తమొక్కలు లేకుండా చూసుకోవాలని, మొక్కలు కొనుగోలు చేసిన రైతుల వివరాలు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

## తాటిచర్ల విద్యుత్ లైన్మెన్ మృతి



**కొమరోలు, నవంబర్ 21, ప్రభాతవార్త**

కొమరోలు మండలం తాటిచెర్ల విద్యుత్‌శాఖ లైన్మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం బీకోజీ నాయక్ (42) గుండె పోటులో మృతి చెందారు. ఎం బీకోజి నాయక్ స్వగ్రామం పుల్లలచెరువు గ్రామం కాగా తాటిచర్ల విద్యుత్ లైన్మెన్‌గా గత కొంత కాలంగా విధులు నిర్వహిస్తున్నారు. కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఉద్యోగులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## అధికారులు పారిశుధ్య పనులను నిత్యం పరిశీలిస్తూ ఉండాలి

**- ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి**



**రాచర్ల, నవంబర్ 21,ప్రభాతవార్త**

అధికారులు పారిశుధ్య పనులు ప్రతిరోజు పరిశీలిస్తూ ఉండాలని, ప్రజలు కూడా కార్మికులకు, అధికారులకు సహకరించాలని ఎంపిడిఓ ఎస్ వెంకట రామిరెడ్డి అన్నారు. మండలంలోని కాల్వపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లపై చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఉదయం 6 నుండి 8 గంటలలోపు పారిశుధ్య కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, స్థానిక టిడిపి నేత ముత్తుముల రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఎం వెంకట నారాయణమ్మ, మండలంలోని అన్ని గ్రామాల కార్మికులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై ఆక్రమణలు తొలగించి ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటాం

**- డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సుశీల**



**కంభం, నవంబరు 21 ,ప్రభాతవార్త**

కంభం పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సుశీల తెలిపారు. శుక్రవారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్, వై,జంక్షన్,రావిపాడుకు వెళ్లే రహదారిని ఆయా ప్రాంతాలలో జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్ పాత్, డ్రైనేజీలను ఆక్రమించి ఏర్పాటుచేసిన షాపులను, అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు పలువురు జాతీయ రహదారి నిర్మాణం, డివైడర్ల నిర్మాణం లోప భూయిష్టంగా ఉన్నాయని రోడ్డు నిర్మాణ సమయంలో సూచించిన హద్దులను అతిక్రమించి పలువురు డ్రైనేజీలను, రోడ్లను ఆక్రమించుకోవడంతో ఇరుకుగా మారిన రోడ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని డీటసి సుశీలకు తెలిపారు .రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగిస్తేనే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో రోడ్డుకు ఇరువైపులా కొలతలు వేయించి ఆక్రమణ తొలగించడంతోపాటు భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. డిటిసి సుశీల వెంట ఆర్‌టీఓ సిరి చందన, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాధవరావు, ఆర్అండ్‌బి డిఈ నరసింహారావు, ఏవో శ్రీనివాసరావు, కంభం సిఐ మల్లికార్జున ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవమైన ఏపీఎన్‌జీవో అసోసియేషన్ పొదిలి తాలూకా యూనిట్ ఎన్నికలు



**కొనకనమిట్ల, నవంబర్ 21, ప్రభాతవార్త**

ఏపీఎన్జీవో అసోసియేషన్ పొదిలి తాలూకా యూనిట్ ఎన్నికలు శుక్రవారం పొదిలి ఎన్జీవో సంఘ భవనంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొ పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు పరచగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి కంభం తాలూకా అధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి ప్రకటించారు. అధ్యక్షులుగా పొదిలి యుపీహెచ్‌సీఎంపీహెచ్‌ఏఎల్ శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులుగా మర్రిపూడి డిప్యూటీ ఎంపీడీవో ఎస్‌కే నాగూర్ వలి, ఉపాధ్యక్షులుగా షేక్ కరిముల్లా, షేక్ అబ్దుల్ అరిప్, జే.వెంకటేశ్వర్లు, ఎస్‌కే యూసఫ్, ఉపాధ్యక్షురాలు(మహిళ) పి.కళాప్రపూర్ణ, కార్యదర్శిగా షేక్ సంధాని భాష, కార్యనిర్వహక కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా వీవీ నరసారెడ్డి, షేక్ గౌషియా, ఎం.రమేష్, కేవీ అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా కే.విజయ, జిల్లాకార్యవర్గ సభ్యులు జే.రవిశంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రాధాకృష్ణమూర్తి ప్రకటించారు. ఈ ఎన్నికలకు సహాయ ఎన్నికల అధికారిగా కంభం తాలూకా యూనిట్ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ బి.విజయ్ కుమార్‌లు వ్యవహారించారు. నూతనంగా ఎన్నికైన పొదిలి తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షులు కే.శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిలు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కే.శివకుమార్, జిల్లా సహాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.రామాంజనేయులు, మార్కాపురం అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాస శాస్త్రి, జే.రవికిరణ్, కనిగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు పి.రమణారెడ్డి, దర్శి తాలూకా యూనిట్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, కార్యదర్శి బీజేఎస్ హెరాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

## చింతలపాలెంలో విజువల్లి క్లీన్ విలేజ్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం




**జరుగుమల్లి, నవంబర్ 21, ప్రభాతవార్త**

థీమ్-5 శిక్షణ కార్యక్రమంలో భాగంగా విజువల్లి క్లీన్ విలేజ్ క్లీన్ అండ్ గ్రీన్‌ను జరుగుమల్లి మండలంలోని చింతలపాలెం గ్రామ పంచాయతీ నందు ఎంపీడీవో ఎంవీ రమణమూర్తి, జీవీ కామేశ్వరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అన్ని వీధులు, రహదారులు, బస్టాండ్, స్కూల్స్, అంగన్‌వాడీ స్కూల్స్, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, వాటర్ ట్యాంకుల దగ్గర నీల బావుల దగ్గర, ఊరిలో ఉన్న అన్ని వీధులు, రోడ్లు, రహదారులను గ్రీన్ అంబాసిడర్‌లతో కలిసి అన్ని చెత్త కుప్పలను నీటుగా తొలగించి అన్ని వీధుల వెంట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. నీళ్ల ట్యాంకులను క్లీనింగ్ చేపించి బ్లీచింగ్ చల్లించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, మండలంలోని పీడీఓ అందరూ సచివాలయ సిబ్బంది, హెల్త్ డిపార్టుమెంట్, ఎస్‌జీహెచ్ మెంబర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్లాప్ మిత్రాలు గ్రామాలను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలి

**- ఎంపీడీవో సురేష్‌బాబు**

**సంతనూతలపాడు, నవంబర్ 21, ప్రభాతవార్త**

క్లాప్ మిత్రా, సీఆర్పీలు ముఖ్యంగా గ్రామాలను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేయాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం పి.గుడిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శుక్రవారం నాడు జరిగిన క్లాప్ మిత్రా, సీఆర్పీల ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి గుడిపాడు పంచాయతీ కార్యదర్శి ఆర్.జ్యోతి అధ్యక్షత వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. గ్రామాల్లో ప్రతి రోజు ఉదయాన్నే క్లాప్ మిత్రాలు గ్రామస్తుల నుండి తడి చెత్త పొడి చెత్తలను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించి నాణ్యమైన కంపోస్టు ఎరువులు తయారీకి పాటుపడాలన్నారు. ముఖ్యంగా క్లాప్ మిత్రాలకు అర్హత ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పక కేటాయిస్తామని ఎంపీడీవో సురేష్‌బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యంగా పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ సబ్సిడీ గృహ నిర్మాణాలు తప్పక కేటాయిస్తామని అన్నారు. సంతనూతలపాడు మండల స్థాయిలో కార్యదర్శులు పర్యవేక్షణలో క్లాప్ మిత్రాలు గుడిపాడు గ్రామంలో శుక్రవారం నాడు ముమ్మరంగా శానిటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం క్లాప్ మిత్రాలకు సర్టిఫికేట్స్‌ను ఎంపీడీవో సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో అరుణకుమారి, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు,రిసోర్స్ పర్సన్ పి.రవికుమార్,గుడిపాడు, సంతనూతలపాడు పంచాయతీ కార్యదర్శులు ఆర్.జ్యోతి, ఎన్.ప్రతాప్ కుమార్‌లు క్లాప్ మిత్రాలకు పంపిణీ చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మైనంపాడు పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కే.రవికుమార్, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల బీజేపీ అధ్యక్షులు బాలినేని కళ్యాణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సంకె సుబ్బారావు, సిండికేట్ రైతు సొసైటీ డైరక్టర్ మల్లవరపు రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పసుపులేటి మోహన్, కాజా పరశురామిరెడ్డి, కాజా వెంకట్ సుబ్బారెడ్డి, ఆర్‌వి సుబ్బారావు, మండలంలోని పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.



8_8.qxd 11/21/2025 11:55 PM Page 1



## మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ఉద్యమం



**కనిగిరి, నవంబర్ 21 ,ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు పాతూరు ఎస్సీ పాలెంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పిలుపుతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలని, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతగుంట్ల కిషోర్, జిల్లా మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శి పలుకూరి భాస్కర్, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.

## కూటమి ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి

**- తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ హాజీగౌస్**



**పామూరు, నవంబర్ 21, ప్రభాతవార్త**
రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం ముస్లింల మైనార్టీ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ మైనార్టీల పక్షపాతిగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముస్లిం సోదరుల హృదయాల లో నిలిచినట్లు పామూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం కింద 90 కోట్ల రూపాయలు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీ వర్గాల సంక్షేమ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని అందుకు నిదర్శనం ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు విడుదల అని హాజీ గౌస్ అన్నారు. అదే విధంగా ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు సముచిత స్థానం కల్పించి ప్రత్యేక గుర్తింపు కూటమి ప్రభుత్వం ఇచ్చిందని, అంతే కాకుండా ముస్లింలకు ప్రత్యేక స్థానం ఇచ్చినందుకు టీడీపీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వేతనాల విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రులు ఫారుక్, లోకేష్, ప్రభుత్వ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు షేక్ హాజీ గౌస్.

## పేరంగుడిపల్లిలో 'గ్రీన్ అండ్ క్లీన్ విలేజ్' కార్యక్రమం



**కనిగిరి, నవంబర్ 21, ప్రభాతవార్త**
కనిగిరి మండలంలోని పేరంగుడిపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గ్రీన్ అండ్ క్లీన్ విలేజ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దంతులూరి ప్రకాశం ముఖ్య అతిధిగా హాజరై ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్, డీఎల్డీఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ శ్రమించారు. పరిశుభ్రత- పర్యావరణ పరిరక్షణలో గ్రామస్తుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, చెత్తను శాస్త్రీయంగా నిర్వహించాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలతో కలిసి విజయవంతం చేయాలని కోరారు. చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సైకం మాలకొండారెడ్డి, నంబుల కొండయ్యతో పాటు గ్రామ అధికారులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అధికారులు మాట్లాడుతూ గ్రీన్ అండ్ క్లీన్ విలేజ్ కార్యక్రమం ద్వారా గ్రామాలు మరింత అదనంగా ఆరోగ్యవంతంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భూ ఆక్రమణలపై ఉక్కు పాదం మోపాలి

**- అక్రమ రియల్ వ్యాపారులపై కఠిన చర్యలు కోరిన పీసీ కేశవరావు**



**కనిగిరి, నవంబర్ 21, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ, మండలపరిధిలో ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి, అనుమతులు లేకుండా వెంచర్లువేసి ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుపై భూ ఆక్రమణల కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తహసీల్దార్ జయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని సూరా పాపిరెడ్డి నగర్‌లో సర్వే నెంబర్లు 894, 895 లోని ప్రభుత్వ హూమిని బలసాని బెంజిమెన్, రూబెన్, కోటేశ్వరరావు ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించారని ఆరోపించారు.900/ ఏ సర్వే నంబర్‌లోని అసైన్మెంట్ భూమిలో పెద్దన్న వెంచర్ వేశారని, 901/1 ఏ ప్రభుత్వ భూమిలో పగ్గాల వెంకటేశ్వర్లు అక్రమంగా ప్లాట్లు విక్రయించారని తెలిపారు. కనిగిరి పట్టణంలో 493/ బిలో 2.94 ఎకరాల ప్రభ్వు భూమిని ఆక్రమించి పిల్లర్లతో నిర్మాణాలు చేపట్టారని, సాధన రెస్టారెంట్ పక్కన వాగును ఆక్రమించడంతో నీరు వెళ్లే మార్గం మూసుకుపోయిందని చెప్పారు. పవిత్ర ఫంక్షన్ హాల్ వెనుక వాగు ఆక్రమణతో అక్రమ వంతెన నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. వంఖవరం, చాకిరాల, నందన మారెళ్ళ ప్రాంతాలలో అనేక సర్వే నంబర్లలో అసైన్మెంట్ భూములు, వాగులు, చెరువులు ఆక్రమించి వెంచర్లు వేసి ప్రజలకు విక్రయిస్తున్నారని వివరించారు. ఎవ్వరుగానుకు కేటాయించిన భూములను సైతం ఆక్రమించి పొలువిక్రయించడంపై తీవ్రవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇలాంటి ఆక్రమణలు అడ్డుకట్ట వేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పీసీ కేశవరావు కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఏడుకొండలు, నరేంద్ర, వెంకటయ్య, నరసింహ,ధనలక్ష్మీ ప్రసన్న, ప్రమీల, లాలీబీ, షమీల తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తపై ప్రేమకు నిదర్శనం

**- పాడె మోసిన ఎమ్మెల్యే ఉగ్ర**



**కనిగిరి, నవంబర్ 21, ప్రభాతవార్త**
కనిగిరి మండలం వీర్దడిన్నె పంచాయతీ మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు అల్లా మల్లికార్జునరెడ్డి గుండెపోటుతో గురువారం మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని రేకెత్తించింది.పార్టీకి అంకితభావంతో, గ్రామాభివృద్ధికి నిరంతరం సేవలందించిన ఆయన మరణం తీరని లోటని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. శుక్రవారం వీర్దడిన్నెలో నిర్వహించిన అంత్య క్రియలకు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై మల్లికార్జునరెడ్డి పాడెను స్వయంగా మోసి తన మానవీయతను చాటారు. ప్రజా నాయకుడు అంటే కేవలం అధికార ప్రతినిధి మాత్రమే కాకుండా, కార్యకర్తల బాధను తన బాధగా భావించే వ్యక్తిగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహా నిరూపించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, అల్లా మల్లికార్జునరెడ్డి సేవలను కొనియాడుతూ, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అంత్య క్రియల్లో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని మల్లికార్జునరెడ్డికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ ఘటనతో వీర్దడిన్నె గ్రామ శోకసంద్రంగా మారింది.

## ఉల్లగల్లులో విజువల్లి క్లీన్ విలేజస్ ట్రైనింగ్ ప్రోగ్రాం



**ముండ్లమూరు, నవంబర్ 21, ప్రభాతవార్త**
విజువల్లి క్లీన్ విలేజ్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ముండ్లమూరు మండలం పెద్ద ఉల్లగల్లుగ్రామపంచాయతీ నందు ముండ్లమూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న క్లాప్ మిత్రాలకు, పెద్ద మిత్రాలకు ట్రైనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. సదరు ట్రైనింగ్ కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా డీఎల్డీఓ హాజరు కావడం జరిగింది. సదరు కార్యక్రమం నందు మండలంలోని అందరూ పారిశుధ్య కార్మికులు, శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మధ్యాహ్నం నుండి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు డీఎల్డీఓ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

# ఇంటి శుభ్రతే గ్రామ శుభ్రతకు మూలం..

## గ్రామ పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత

**- ముప్పవరపు సుచిత్ర**



**నాగులుప్పలపాడు, నవంబర్ 21, ప్రభాతవార్త**
స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో థీమ్-5, గ్రీన్ అండ్ క్లీన్ గ్రామం గురించి నాగులుప్పలపాడు మండల పరిధిలో పని చేస్తున్న హరిత రాయబారులు, హరిత రక్షకులకు, కమ్యూనిటీ రిసోర్సు పర్సన్స్‌కు చవటపాలెం గ్రామంలో ప్రత్యేక శిక్షణ, ఒక రోజు, ఒక గ్రామాన్ని చూడచక్కనిగ్రామము ద్వారా పారిశుధ్య పనులు చేశారు. ఎంపీడీవో తేళ్ల రవికుమార్ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి బి.చిరంజీవి బాపట్ల ఎక్సటెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డి.వెంకటరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, స్థానిక ఎంపీటీసీ సభ్యులు ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. గ్రామం అంతట పది బృందాలతో నాయకులు, అధికారులు పర్యటించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చవటపాలెం గ్రామాన్ని థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగిందన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని తెలిపారు. వారి సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి గ్రీన్ ఎంబసిడర్లుగా నియమించిందన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధనలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమన్నారు. ప్రజలు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తేళ్ళ మనోజ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సునీల్ బాబు, సర్పంచ్ కాట్రగడ్డ వనజ, శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు దొడ్డ సీతారామయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ఈదర వెంకట కృష్ణారావు, చెన్నారెడ్డి శ్రీనివాసరావు, చెన్నారెడ్డి కృష్ణ, కవిల వినోద్, మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులతో డాక్టర్ లక్ష్మీ మాట మంచి






**దర్శి, నవంబర్ 21, ప్రభాతవార్త**
దర్శి మండలం బట్టువారిపల్లె గ్రామంలో శుక్రవారం బేర్ని పొగాకు కడుతున్న మహిళలతో దర్శి తెలుగుదేశ ంపార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వారి బాగోగుల అడిగి తెలుసుకున్నారు. ఏడాది పొగాకు పంట దిగుబడి, పెట్టుబడుగుల, తెగుళ్ల తదితర అంశాలపై మహిళా రైతులతో మాట్లాడారు. పొగాకు పంట కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని డాక్టర్ లక్ష్మీ వారికి హామీ ఇచ్చారు. పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం తగిన మద్దతు ధర అందించడం కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని ఆమె వివరించారు. గత ఏడాది కూడా పొగాకు కొనుగోలు చేయని సందర్భంలో స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంన్నాయుడు మన జిల్లాకు వచ్చి రైతుల బాధలు తెలుసుకుని టొబాకో కంపెనీలతో మాట్లాడి రైతుల సమస్యలు పరిష్కరించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. డాక్టర్ లక్ష్మీ మహిళలతో కలివిడిగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వస్తున్నాయా అని తెలుసుకుంటూ వారి బాధలు తెలుసుకుంటూ మాట్లాడడం పట్ల వారు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

### జాతీయ స్థాయి ఆటల పోటీకి దర్శి ఉపాధ్యాయుడు మస్తాన్ వలి ఎంపిక



**దర్శి, నవంబర్ 21, ప్రభాతవార్త**
సివిల్ సర్వీసెస్ ఆటల పోటీల్లో భాగంగా గురువారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం విజయవాడలో జరిగిన క్యారమ్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన ఎంపీపీఎస్ బిసిరెడ్డి పాఠశాల నందు ఎస్జీటీగా పని చేస్తున్న ఎస్‌కే మస్తాన్ వలి గుజరాత్‌లో జరగబోవు జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఎంపిక కాబడ్డారు. ఈ సందర్భంగా దర్శి మండల ఎంఈఓ-1 కే.మాలకొండయ్య, ఎంఈఓ-2 రమాదేవి, వాకా జనార్ధన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, హెచ్ఎం ఖాదర్ మస్తాన్, ధనిరెడ్డి వెంకటరెడ్డి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు, వైవీ ప్రసాదరెడ్డి, వి.రామిరెడ్డి, ముక్కాలరెడ్డి, మారుతీ కిరణ్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## దర్శి సుందరయ్య భవన్‌కి ఫ్యాన్లు బహుకరణ



**దర్శి, నవంబర్ 21, ప్రభాతవార్త**
దర్శి సీపీఎం కార్యాలయం సుందరయ్య భవన్‌కి దర్శి మండల వైఎస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ఎల్ఐజీ ఏజెంట్ రాగిపిండి రామకోటిరెడ్డి 4 సీలింగ్ ఫ్యాన్లు బహుకరించారు. ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ పేద, రైతు, కార్మిక మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం ఆందోళన పోరాటాలకు కేంద్రంగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య భవనం కి ఫ్యాన్లు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని, సుందరయ్య మొదటి ప్రతిపక్ష నాయకుడిగా ఉండి పార్లమెంట్‌కి సైకిల్‌పై వెళ్లారని గుర్తు చేశారు. సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ సోము దుర్గారెడ్డి, రామకోటిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు, రైతు, డీవైఎఫ్ఐ కార్యదర్శులు పంటా ఏడుకొండలు, కేవీ పిచ్చయ్య, గర్నిపూడి జాన్ సామ్యేల్, ఉప్పు నారాయణ, పాల్గొన్నారు.

## విలువిద్యలో నేషనల్‌కు సెలెక్ట్ అయిన గౌతమి గ్రామర్ స్కూల్ విద్యార్థి మహ్మద్ సోహైల్



**దర్శి, నవంబర్ 21, ప్రభాతవార్త**
స్థానిక గౌతమి గ్రామర్ స్కూల్ విద్యార్థి షేక్ మహ్మద్ సోహైల్ విలువిద్యలో నేషనల్‌కు సెలెక్ట్ అయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ ఫెడరేషన్ అండర్-17 ఇండియన్ రౌండ్ విభాగంలో బ్రాంజ్ మెడిల్ 3వ స్థానం సాధించి జార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జాతీయ స్థాయిలో జరిగే ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా నూజువీడులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 ఇండియన్ రౌండ్ ఆర్చరీ విభాగంలో 4వ స్థానం పొంది చత్తీష్‌గడ్‌లో రాయపూర్‌లో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక అయ్యారు. పై రెండు జాతీయ విభాగాల ఆర్చరీ పోటీల్లో ఎంపిక కావడం పై స్కూల్ యాజమాన్యం పాపసాని రాజకేశవరెడ్డి, పద్మ, ప్రిన్సిపాల్ ఎం.రామారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

## అసిస్ట్ సేవా సంస్థ సహకారంతో మొంథా తుఫాన్ బాధితులకు, ఫైటర్స్‌కి నిత్యవసర సరుకులు పంపిణీ

**- సరుకులు అందజేసిన గొట్టిపాటి లక్ష్మీ**




**దర్శి, నవంబర్ 21, ప్రభాతవార్త**
దొనకొండ టౌన్, దర్శిలోని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నివాసం వద్ద ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా బాధితులకు , ఫైటర్స్ కి దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో అసిస్ట్ సేవా సంస్థల సహకారంతో దర్శిలో 150 మందికి, దొనకొండలో 86మొత్తం 246 మందికి 10 కేజీల బియ్యం, 1 కేజి ఆయిల్, కేజీ కందిపప్పు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దొనకొండ లో మండల పార్టీ అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, దొనకొండ ఎమ్మార్వో, ఎంపీడీవో, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టీవెన్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడరేవు మత్స్యకారుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా

**- మత్స్యకార్మిక సంఘం జిల్లా కన్వీనర్ యేసుబాబు**

**- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**



**చీరాల టౌన్, నవంబర్ 21, ప్రభాతవార్త**
ప్రభుత్వం మత్స్యకారుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి న్యాయం చేసి వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జి.యేసుబాబు అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా అన్ని చోట్ల మత్స్యకారులు ఘనంగా నిర్వహించుకుంటు న్నప్పటికి వాడరేవులో మాత్రం మత్స్యకారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాడరేవులో మత్స్యకార యువకులు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ఆందోళన చేపట్టారు. తమ ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన సమస్యల పట్ల ప్రభుత్వ యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాడరేవులోనిఈపురుపాలెం స్ట్రేట్ కట్ సముద్ర ముఖద్వారం వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారులు సముద్ర వ్యూ కోసం కొండరాళ్లు వేసి మత్స్యకారుల బోట్ల రాకపోకలకు అడ్డుగా నిలవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. దీనిపై నెలల తరబడి పోరాడుతున్నా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం స్పందించడం లేదని, పైగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకే అనుకూలంగా వ్యవహరిస్తోందని, మత్స్యకార యువకులు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. డీజిల్ సబ్సిడీ తక్షణమే పునరుద్ధరించాలని, సముద్రంలో చనిపోయిన మత్స్యకారుడికి మృతదేహం దొరకితేనే డెత్ సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని, సముద్రంలో మరణించిన మత్స్యకారుల కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మత్స్యకారులకు ప్రత్యేక బెడ్జెట్ ప్రకటించాలన్నారు. అలాగే సొసైటీ ద్వారా 75 శాతం సబ్సిడీతో బోట్లు, వలలు, ఇంజన్లు అందించాలని తుఫాన్ కారణంగా 15 నుంచి 20 రోజులు వేట నిలిచిపోయే సమయంలో, ప్రతి మత్స్యకార కుటుంబానికి తక్షణమే రూ.20వేలు ఇవ్వాలని, వేటకు వెళ్లే వారికి ఖర్చుల భారం తగ్గించేందుకు రూ.20 సబ్సిడీతో 3000 లీటర్లు డిజల్ అందించాలని పలు డిమాండ్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం నాయకులు గంగిరిబాబు, కోడా రవి, ఎజ్జల బాబ్జి, ఏరిపిల్లి రమణ, వెంకటేశ్వర్లు, పి.రమణ, జి.అప్పలరాజు, మెరుగు జాబేస్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పందిళ్ళపల్లి హైస్కూల్ విద్యార్థులు



**వేటపాలెం, నవంబర్ 21, ప్రభాతవార్త**
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని జవహర్ నవోదయ పాఠశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అండర్-17 విభాగంలో పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.సందీప్ హై జంప్‌లో అబ్బు, పూజిత హేమర్ త్రోలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి తెలియజేశారు. వీరు ఈనెల 24న వినుకొండలో జరుగు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ తోట వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా పీఈటీ కర్ణ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండోలో స్వర్ణంతో మెరిసిన సెయింట్ ఆన్స్



**వేటపాలెం, నవంబర్ 21, ప్రభాతవార్త**
స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లోని బీటెక్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ చూపినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. కేటగిరిలలో బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ పరందబోయిన భాను రేఖ అండర్ 57కేజీల పోటీలలో స్వర్ణ పతకం, బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఎస్‌కే షాహిద్ ఓవర్ 87 కేజీ కేటగిరిలో కాంస్య పతకం, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్ అభిరామ్ రజిత పతకం సాధించినట్లు వ్యాయామ అధ్యాపకులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. డిసెంబర్ 2025లో హైదరాబాద్‌లో జరగబోయే నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలకు పందరబోయిన భాను రేఖ పాల్గొంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు తెలిపారు. రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో పతకాలను సాధించిన విజేతలను సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి.హరిణి, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఇంద్రనీల్, ఎస్.అమర్‌నాథ్, ఇన్‌చార్జి డాక్టర్ సి.సుబ్బారావు, రమణమూర్తి,మేనేజర్,కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు , అధ్యాపక సిబ్బంది అభినందించారు.

## ఛలో విజయవాడ కాపు నాడు స్వర్ణోత్సవ సభ



**చీరాల, నవంబర్ 21, ప్రభాతవార్త**
కాపునాడు స్వర్ణోత్సవ సభ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా కాపునాడు కమిటీ శుక్రవారం మార్కాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా కాపునాడు నూతన మహిళ కమిటీలను నియామకంలో భాగంగా మార్కాపురం నియోజకవర్గ కాపునాడు అధ్యక్షురాలు బాసు కృష్ణవేణి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శిగా మర్రి ఝాన్సీ రాణి, ఉపాధ్యక్షులుగా పుట్టా లక్ష్మీ, తాడి లక్ష్మీదేవి, సహ కార్యదర్శులుగా మద్దెల లక్ష్మీదేవి, కాలంగి రేణుకాదేవి, ప్రచార కార్యదర్శులుగా రెడ్డిపల్లి సుబ్బులు, తుమ్మలపల్లి సునీత, కన్వీనర్లుగా బాదినేని స్వాతి, బోడ స్వప్న. కాపునాడు మహిళా కార్యవర్గ సభ్యులుగా మీనా భారతి, లావణ్య, స్వప్న, శైలజ, రమాదేవి, కృష్ణవేణి, వసుంధర, సుబ్బమ్మ, వెంకటరత్నమ్మ, ఉషారాణి, లక్ష్మీదేవి, శిరీష, సుబ్బులు, లక్ష్మీ కుమారి, సుబ్బమ్మ, సుజాత, రమాదేవి, లక్ష్మీ తదితరులను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ప్రకాశం జిల్లా పార్లమెంట్ అధ్యక్షుఉ పోగులు మల్లిఖార్జునరావు, ప్రకాశం జిల్లా జనరల్ సెక్రటరీ దాసరి పిచ్చయ్య, ప్రకాశం జిల్లా కాపు సీనియర్ నాయకులు చెన్ను రఘురాం మూర్తి, పిండికూరి కోటేశ్వరరావు, ప్రకాశంజిల్లా కాపు నాడు ఉపాధ్యక్షులు చెంగలశెట్టి సుధాకర్‌బాబు, జిల్లా జాయింట్ సెక్రటరీ గారా నారాయణరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహాశెట్టి విజయ్ నాయుడు, మార్కాపురం నియోజకవర్గ కాపు సీనియర్ నాయకులు శ్రీనరసింహారావు, మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, మార్కాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బ్రహ్మనాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### హనుమాన్ స్వామి దీక్షోత్సవాలకు దద్దాల నారాయణకు ఆహ్వానం



**కనిగిరి, నవంబర్ 21, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణం కొత్తూరు ఆంజనేయస్వామి గుడి నందు ఈ నెల 25వ తేదీ మంగళవారం నిర్వహించనున్న హనుమాన్ స్వామి మాలధారణ దీక్షోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ మాల ధారణ చేసిన స్వాములు కనిగిరి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ హనుమాన్ స్వామి దీక్ష కార్యక్రమం భక్తి శ్రద్ధలతో, శ్సాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజా మహోత్సవంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనితమ భక్తిని చాటాలని పిలుపునిచ్చారు. దద్దాల నారాయణ యాదవ్ స్వాముల ఆహ్వానాన్ని సంతోషంతో స్వీకరిస్తూ కార్యక్రమంలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందుతామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించిన మండల అభివృద్ధి అధికారి బ్రహ్మయ్య



**పామూరు, నవంబర్ 21, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలమేరకు పామూరు గ్రామ పంచాయతీలోని గోపాలపురం గ్రామంలో గ్రీన్ అంబాసిడర్ గ్రీన్ గార్డెస్ , సీఆర్‌పిలకు మండల అభివృద్ధి అధికారి వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పలు వీధుల్లో గ్రీన్ అంబాసిడర్ చేత సైడ్ కాలువలలోని మురికిని తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు బొల్లా నరసింమారావు, మండల అభివృద్ధి అధికారి ఎల్.బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి జి.అరవిందరెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, పామూరు నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య, యూనిట్ ఇన్‌చార్జి ఇర్రి శ్రీనివాసులు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అంచురి వెంకటరెడ్డి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇకపై నిరంతరం మండల అకడమిక్ ఫోరం తనిఖీలు



**కారంచేడు, నవంబర్ 21, ప్రభాతవార్త**
ఇకపై నిరంతరం మండల అకడమిక్ ఫోరం తనిఖీలు నిర్వహిస్తామని ఎంఈఓ-1 సత్యనారాయణ తెలిపారు. మండల అకడమిక్ ఫోరం తనిఖీలు శుక్రవారం కుంకలమర్రు జడ్పీ మండల పరిషత్ పాఠశాలల్లో ప్రారంభించిన సందర్భంగా ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. కరదీపికలు, సమగ్ర అభివృద్ధి పత్రాలు, మార్కులు, గ్రేడ్‌లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇంటి డాక్యుమెంట్ పోయినది**

సంతనూతలపాడుకు చెందిన పులగాల జానకి రామ్ తండ్రి అంజయ్య అనే వ్యక్తికి చెందిన డాక్యుమెంట్ నెంబర్ 3558/2021 రు. దాఖల సర్వేనెంబర్ 304/1 నందు గల ప్లాట్ నెంబర్ 17 రు.లో 1296 లేక 18 గదులు ఒరిజినల్ ఇంటి డాక్యుమెంట్ ఇటీవల ఇల్లు మారే క్రమంలో పోయినది. ఇంటి డాక్యుమెంట్ ఎవరికైనా దొరికితే సెల్:9849704542ను సంప్రదించగలరు. ఇట్లు.. పులగాల జానకి రామ్, వడ్డెర పాలెం సంతనూతలపాడు.

22-11Pg5 9_22-11Pg5.qxd 21/Nov/25 10:06 PM Page 1





# బ్రిటన్ వలస విధానాల్లో భారీ మార్పులు!

## పర్మనెంట్ రెసిడెన్సీకి 20యేళ్లకు పైగానే వెయిటింగ్

**లండన్, నవంబరు 21:** బ్రిటన్ ప్రభుత్వం గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా తమ వలస విధానంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టింది. కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త నిబంధనల ప్రకారం, చట్టబద్ధమైన వలసదారులు సైతం దేశంలో శాశ్వతంగా స్థిరపడటానికి (సెటిల్‌మెంట్) దరఖాస్తు చేసుకోవాలంటే 20 ఏళ్ల వరకు వేచి ఉండాల్సి రావచ్చు. దేశానికి, ఆర్థిక వ్యవస్థకు తోడ్పడే వారికి, నిబంధనలు పాటించే వారికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ సంస్కరణలు చేపట్టినట్లు హోం సెక్రటరీ షబానా మహమూద్ స్పష్టం చేశారు. ప్రతిపాదిత కొత్త విధానం ప్రకారం, వివిధ రంగాల వారికి వేర్వేరు కాలపరిమితులుంటాయి. నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్)లో పనిచేసే డాక్టర్లు, నర్సులు 5 ఏళ్లకే సెటిల్‌మెంట్‌కు అర్హత సాధిస్తారు. అత్యధికంగా సంపాదించేవారు, పారిశ్రామికవేత్తలు కేవలం 3 సంవత్సరాల్లోనే స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది. అయితే, తక్కువ వేతనం ఉన్న కార్మికులు 15 ఏళ్లు, ప్రభుత్వ ప్రయోజనాలు (బెనిఫిట్స్) పొందే వలసదారులు 20 ఏళ్లు వేచి ఉండాలి. అక్రమ వలసదారులు, వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉన్నవారు స్థిరపడాలంటే 30 ఏళ్లు ఆగాల్సి ఉంటుంది. ఈ మార్పులు 2021 నుంచి యూకేకి వచ్చిన దాదాపు 20 లక్షల మంది వలసదారులపై ప్రభావం చూపనున్నాయి. వీరిలో అత్యధిక నైపుణ్యం కలిగిన వలసదారులుగా ఉన్న భారతీయుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. అయితే, ఇప్పటికే సెటిల్డ్ స్టేటస్ పొందిన వారికి ఈ నిబంధనలు వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కొత్త ప్రణాళికలపై 12 వారాల పాటు ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. మరో కీలక మార్పు ఏంటంటే, వలసదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు, సామాజిక గృహ వసతి వంటివి సెటిల్‌మెంట్ పొందిన వెంటనే కాకుండా, బ్రిటిష్ పౌరసత్వం పొందాకే లభిస్తాయి. "బ్రిటన్‌లో స్థిరపడటం అనేది హక్కు కాదు, అదొక అదృష్టం. దాన్ని సంపాదించుకోవాలని హోం సెక్రటరీ షబానా మహమూద్ వ్యాఖ్యానించారు. ఈ సంస్కరణలు యూకే సెటిల్‌మెంట్ విధానాన్ని ఐరోపాలోనే అత్యంత కఠినమైనదిగా మార్చనున్నాయి.

# 23 యేళ్లనాటి మర్డర్ మిస్టరీ ఛేదించిన ఢిల్లీ పోలీస్!






**న్యూఢిల్లీ, నవంబరు 21:** ఢిల్లీలో దాదాపు 23 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన జంట హత్యల కేసు మిస్టరీని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఛేదించారు. ఒక మహిళ, ఆమె రెండేళ్ల కుమార్తెను అత్యంత కిరాతకంగా హత్య చేసి దశాబ్దాలుగా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. నిందితుల్లో ఒకరు 23 ఏళ్లుగా పరారీలో ఉండగా, మరొకరు ఇదే కేసులో శిక్ష పడి 18 ఏళ్ల క్రితం పెరోల్‌పై విడుదలై తప్పించుకు తిరుగుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితులను బీహార్ శివ్‌హర్ జిల్లాకు చెందిన అమలేష్ కుమార్, సుశీల్ కుమార్‌గా గుర్తించారు. 2002 జనవరి 28న సరితా విహార్‌లోని మదన్‌పూర్ ఖాదర్‌లో ఈ దారుణం జరిగింది. అనిల్ కుమార్ అనే వ్యక్తి ఇంటికి తిరిగి వచ్చేసరికి, అతని భార్య అనిత (22), రెండేళ్ల కుమార్తె మేఘ వంటగదిలో కత్తిపోట్లతో రక్తపు మడుగులో పడి ఉన్నారు. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా, టైలరింగ్ వ్యాపారంలో పోటీనే ఈ హత్యలకు కారణమని తేలింది. బాధితురాలి భర్త అనిల్ కుమార్‌కు వ్యాపారం బాగా జరగడంతో అసూయ చెందిన నిందితులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ కేసులో సుశీల్ కుమార్‌కు ట్రయల్ కోర్టు మరణశిక్ష విధించగా, ఢిల్లీ హైకోర్టు దానిని యావజ్జీవ శిక్షగా మార్చింది. అయితే 2007లో పెరోల్‌పై బయటకు వచ్చిన సుశీల్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. టెక్నికల్ అనాలిసిస్, గ్రౌండ్ ఇంటెలిజెన్స్ సాయంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. హత్య జరిగినప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అమలేష్ కుమార్‌ను గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో గుర్తించారు. అక్కడ అతను మారుపేరుతో కూలీగా పనిచేస్తున్నాడు. మరో నిందితుడు సుశీల్ కుమార్‌ను ఇండో నేపాల్ సరిహద్దులోని లాల్‌గఢ్ గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు.

ఇద్దరు నిందితులు తమ నేరాన్ని అంగీకరించారని, వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేశామని డీసీపీ పంకజ్ కుమార్ తెలిపారు. ఎంతకాలం దాక్కున్నా చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని ఈ అరెస్టు నిరూపిస్తోందని పోలీసులు వెల్లడించారు.

# తక్షణమే 'సర్' నిలిపేయండి



- ఎన్నికల సంఘానికి మమతాబెనర్జీ లేఖ - ఘాటుగా జవాబిచ్చిన అమిత్ షా
- 'సర్'కు వ్యతిరేకంగా పిటిషన్లు - విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం - ఇసికి త్రిసభ్య ధర్మాసనం నోటీసులు

**న్యూఢిల్లీ, నవంబరు 21:** పశ్చిమబెంగాల్‌లో తక్షణమే 'సర్'ను నిలిపేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం(సిఇసి)కు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ లేఖ రాశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ బెంగాల్‌లో అరాచకంగా, బలవంతంగా, ప్రమాదకరంగా సాగుతోందని ఆ లేఖలో ఆరోపించారు. ప్రణాళిక లేకుండా, స్పష్టమైన సమాచారం లేకుండానే ఎస్ఐఆర్ చేపట్టారని మండిపడ్డారు. ఎస్ఐఆర్‌లో పాల్గొంటున్న అధికారులు అసాధారణ పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే కొందరు ఉద్యోగులు ఆస్పత్రి పాలయ్యారు. ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అందుకు దారితీసిన పరిస్థితులు, కారణాలు వివరిస్తూ సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు మూడు పేజీల లేఖ రాశారు. ఎస్ఐఆర్‌ను తక్షణమే నిలిపేయాలని కోరారు. క్రమంగా దేశంలోకి వస్తున్న చొరబాటుదారులను కొన్ని రాజకీయ పార్టీలు రక్షించే ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కొన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీచొరబాటుదారులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. చొరబాటు దారులను అడ్డుకోవడం దేశ భద్రతకు ఎంతో కీలకమని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు చొరబాట్లను నిరోధించాల్సిన అవసరం ఉందని, కానీ కొన్ని రాజకీయ పార్టీలు చొరబాటు దారులను సమర్థించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు అమిత్ షా శుక్రవారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అయితే ఆయన నేరుగా మమతా బెనర్జీ పేరును ప్రస్తావించలేదు. ఇసికి మమత లేఖ రాసిన నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆ తర్వాత బిఎస్ఎఫ్ డైమండ్ జూబ్లీ వేడుకల్లోనూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కేరళ సహా ఇతర రాష్ట్రాల్లో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పటిషన్లను విచారించ డానికి సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. కేరళ ప్రభుత్వంతోపాటు పలువురు రాజకీయ నేతలు వేర్వేరు కారణాలతో వివిధ రాష్ట్రాల్లో చేపట్టనున్న ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించ డానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. అంతేకాదు దీనిపై వివరణ ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌కు త్రిసభ్య ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. కేరళలో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని సవాల్ చేసిన పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉందని, అందువల్ల ఎస్ఐఆర్ అత్యవసర విచారణ అవసంమన్నారు. దీనితో కేరళలో ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై నవంబర్ 26న విచారణ చేస్తామని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. అలాగే ఇతర రాష్ట్రాల్లో ఇదే అంశంపై దాఖలైన పిటిషన్లను డిసెంబర్ మొదటి లేదా రెండో వారంలో విచారణ చేస్తా మని స్పష్టం చేసింది. వాస్తవానికి దేశవ్యాప్తంగా ఎస్ ఐఆర్ నిర్వహించాలని ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇప్పటికే విచారణ చేస్తోంది. ఇక నవంబర్ 11న, తమిళనాడు, బంగాల్‌లో ఎస్ఐఆర్ నిర్వహణను సవాల్ చేస్తూ డిఎంకె, సిపిఎం, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పిటిషన్లపై సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ నుంచి స్పందనలు కోరింది.

# గవర్నర్లకు గడువు విధించేలా రాజ్యాంగంలో సవరణలు తేవాలి

## అంతవరకు పోరాడుతూనే ఉంటాం: తమిళ సిఎం స్టాలిన్

**చెన్నై, నవంబర్ 21:** శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ స్పందించారు. బిల్లులపై నిర్ణయం తీసుకునేలా గవర్నర్లకు గడువు విధించే విధంగా రాజ్యాంగంలో సవరణలు తెచ్చేవరకు తమ పోరాటం ఆపబోమని వెల్లడించారు. ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన అభిప్రాయం ఏప్రిల్ 8 నాటి తీర్పును ప్రభావితం చేయలేదు. వాస్తవానికి ఎన్నికైన ప్రభుత్వం డ్రైవర్ సీటులో ఉండాలని, రాష్ట్రంలో రెండు పాలక వర్గాలు ఉండకూడదని సుప్రీం తీర్పు పునరుద్ఘాటించింది. బిల్లులను పక్కన పడేసేలా వీటో అధికారం చూపే అవకాశం గవర్నర్లకు ఉండదు. బిల్లులను నిలిపివేసే అధికారం వారికి లేదు. రాష్ట్ర హక్కులు, సమాఖ్యవాదం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది అని స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధికంగా నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న నిర్ణయం వెలువరించింది. ఆ తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో మే 13న ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము 14 ప్రశ్నలతో సిజెఐకి లేఖ రాశారు.

# ఐదేళ్లూ సిద్దరామయ్యే సిఎం

## స్పష్టం చేసిన డి సిఎం శివకుమార్

## కర్ణాటక రాజకీయ సంక్షోభానికి తెర



**బెంగళూరు, నవంబర్ 21:** కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకత్వం మార్పు ప్రచారానికి ఎట్టకేలకు తెరపడింది. ముఖ్యమంత్రిగా అయిదేళ్లు సిద్ధరామయ్యే కొనసాగుతారని డిప్యూటీ సిఎం డికె శివకుమార్ స్పష్టం చేశారు. తామంతా ఆయనకు సహకరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ పోస్ట్‌తో క్లారిటీ ఇచ్చారు. మొత్తం 140 మంది శాసనసభ్యులు నా ఎమ్మెల్యేలే. గ్రూప్‌లు కట్టడం నా రక్తంలోనే లేదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సిఎం నిర్ణయించారు. మంత్రి కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఈ క్రమంలోనే ఢిల్లీలోని హైకమాండ్‌తో వారు సమావేశం అవడం సాధారణమే. అది వారి హక్కు కూడా. అధిష్టానం వద్దకు వెళ్లవద్దని మేం వారిని ఆపలేం కదా! అయిదేళ్లు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిఎం చెప్పారు. ఆయనకు మేమంతా అభినందనలు తెలియజేస్తున్నాం. ఆయనతో కలిసి పనిచేస్తాం. సిఎం అయినా, నేనైనా పదే పదే చెప్పేది ఒక్కటే హైకమాండ్ ఆదేశాలకు మేం కట్టుబడి ఉంటాం అని డికె శివకుమార్ తన పోస్టులో రాసుకొచ్చారు. 2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. గురువారంతో సిద్ధరామయ్య నేతృత్వంలోని సర్కార్‌కు రెండున్నరేళ్లు నిండాయి. దీంతో రాజకీయం వేడెక్కింది. సిద్ధరామయ్య, డికె శివకుమార్ మద్దతుదారులు ఒక్కొక్కరుగా ఢిల్లీలకి వెళ్లడంతో ఈ ప్రచారం మరింత జోరందుకుంది. సిఎంగా శివకుమార్‌కు పగ్గాలు ఇవ్వాలని ఆయన మద్దతుదారులు హైకమాండ్‌ను అభ్యర్థించినట్లు కూడా వార్తలు వచ్చాయి. అయితే అధికార పంపిణీ అంశాన్ని మొదటి నుంచి తోసిపుచ్చుతున్న సిద్ధరామయ్య అయిదేళ్లు తానే సిఎంగా ఉంటానని పలుమార్లు బహిరంగంగానే చెప్పారు. ఎమ్మెల్యేల్లో అత్యధికుల మద్దతు తనకు ఉందని అన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో వేర్వేరుగా సమావేశమై మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. క్యాబినెట్‌లో మార్పులు చేస్తే అసంతృప్తులను బుజ్జగించవచ్చని సిఎం భావించారు.

# రాజీనామా తర్వాత తొలిసారి ప్రజల్లో కనిపించిన మాజీ ఉపరాష్ట్రపతి

## ఆర్ఎస్ఎస్ రచయిత పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న ధన్‌ఖడ్



**భోపాల్,నవంబరు 21:** ఉపరాష్ట్రపతిగా రాజీనామాచేసిన తర్వాతరాజ్యసభ మాజీ ఛైర్మన్ జగదీప్‌ధన్‌ఖర్ మొట్టమొదటిసారి ప్రజాబాహుళ్యంలో కనిపించారు. ఆరోగ్యకారణాల రీత్యా తాను తప్పుకుంటున్నట్లు ప్రకటించిన ధన్‌ఖర్ శుక్రవారం భోపాల్‌లో దర్శనమిచ్చారు. అందులోనూ ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సమావేశంలో ఆయన కనిపించారు. 74 ఏళ్ల సుప్రీం న్యాయవాది గత జులై 21వ తేదీ వైద్యసలహామేరకు దిగిపోతున్నట్లు తెలిపారు. అంతకుముందు ఇదే ఏడాది గుండెపోటు కూడా రావడంతో ఆయన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామాచేసారు. కాగా తాజాగా ఆయన ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిది డాక్టర్ మన్‌మోహన్ వైద్య "మనం మన విశ్వం" పేరిట రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించే సభలో పాల్గొన్నారు. కుశభవ్ థాక్రే కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యాక్రమం జరిగింది. సంఘ్ సిద్ధాంతకర్తలు, మేధావులు, బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాజీనామా తర్వాత మొట్టమొదటిసారి తన పుస్తకావిష్కరణకు విచ్చేసిన ధన్‌ఖర్‌కు రచయిత వైద్య ధన్యవాదాల చెపుతూ కార్యకర్తలకు ఇది స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. పాశ్చాత్య ధోరణులమధ్యకొట్టుమిట్టాడుతున్న నేటి తరుణంలో భారత సంస్కృతి సంప్రదాయాలను చాటి చెపుతుందని ధన్‌ఖర్ అన్నారు.

## సంక్షిప్తంగా..

### కాప్ సదస్సులో అగ్నిప్రమాదం - 21 మందికి గాయాలు

**బ్రసిలా, నవంబరు 21:** బ్రెజిల్‌లోని బెలెమ్‌లో నిర్వహిస్తున్న కాప్-30 సదస్సులో అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 21 మంది గాయపడ్డారు. మైక్రోవేవ్‌లో మంటలు రేగడంతో ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వాతావరణ సంక్షోభవం పరిష్కారానికి అంతర్జాతీయ ప్రయత్నాల బలోపేతానికి ఒప్పందం కుదుర్చుకోవడంపై చర్చలు జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గురువారం సదస్సుకు సంబంధించిన సమావేశాలతోపాటు సంప్రదింపులు, వివిధ దేశాలు నెలకొల్పిన పెవిలియన్లు, మీడియా సెంటర్ వంటి కీలక ప్రదేశాలు ఉన్న 'బ్లూ జోన్'లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 21 మంది గాయపడగా.. సదస్సుకు హాజరైన వేలాది మంది ప్రాణభయంతో పరుగులు తీశారు.

ఈ క్రమంలో అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

### మంటల్లో నుంచి ఎగిరిపడిన విమాన ఇంజిన్!



**వాషింగ్టన్, నవంబరు 21:** అమెరికాలోని కెంటకీలో ఇటీవల ఘోర విమాన ప్రమాదం జరిగింది. కార్గో విమానం కూలి 14 మంది దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. విమానం నుంచి ఇంజిన్ విడిపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు దర్యాప్తు బృందం నిర్ధారించింది. మంటల్లో నుంచి విమానం ఇంజిన్ ఎగిరిపడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. టేకాఫ్ అవుతుండగా విమానానికి ఎడమవైపున ఉన్న రెక్క భాగంలోని ఇంజిన్ విడిపోవడం మొదలుపెట్టిందని దర్యాప్తు బృందం నిర్ధారించింది. కాసేపటికే ఆ ఇంజిన్ విమానం నుంచి ఊడి ఎగిరిపడింది. విమానం మండుతూ ఊడి పడుతున్న దృశ్యాలు సిసిటివిలో రికార్డయ్యాయి. వాటిని దర్యాప్తు బృందం విడుదల చేసింది. ప్రమాద సమయంలో విమానం కేవలం భూమికి 30 అడుగుల ఎత్తులోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

# అమలులోకి కొత్త లేబర్‌కోడ్స్!



**న్యూఢిల్లీ, నవంబరు 21:** కార్మికశాఖపరిధిలో అమలవుతున్న 29 చట్టాలస్థానంలో కేంద్రప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చింది. కొత్త లేబర్‌కోడ్‌లప్రకారం మహిళలు రాత్రి షిఫ్టుల్లోకూడా ఏ రంగంలో అయినా పనిచేసుకోవచ్చు. పనికి తగిన వేతనం, సమాన పని, సమాన వేతనం అనేవి ఇపుడు చట్టంగా అమలులోకి వచానచయి. 40 ఏళ్లకుపైబడిన ఉద్యోగులకు తరచూ వైద్యపరీక్షలునిర్వహించాలని కూడా నిబంధనలు విధించారు. సంఘటిత, అసంఘటి తరంగాల్లోని అందరు కార్మికులకు నియామక ఉత్తర్వులు అనేవి తప్పనిసరిచేసింది. కనీస వేతన హామీ, సామాజికభద్రత ప్రతి ఒక్క ఉద్యోగికి ఉండాలని నిర్ణయించింది. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు కూడా సమానపని సమానవేతనాలు ఉంటాయని నిర్దేశించింది. ఇప్పటికే రాత్రిషిప్టుల్లో మహిళల విధినిర్వహణ అనేది 20 రాష్ట్రాలు అమలుచేస్తుండటం విశేషం. దేశవ్యాప్తంగా కార్మికులు అందరికీ కార్మిక రాజ్యభీమా (ఇఎస్ఐసి) వర్తింపచేయాలనినిర్ణయించింది. పదిమందికంటే తక్కువ కాని ఉద్యోగులున్న సంస్థలన్ని కూడా విధిగా ఇఎస్ఐ అమలుచేయాలి. ప్రమాదకర విభాగాల్లోపనిచేస్తున్నవారికయితే మరింత భద్రతాపూర్వక బీమా కల్పించాలనినిర్ణయించింది. కొన్ని నిర్దేశిత రంగాలకు మాత్రమే ఇఎస్ఐసి కవరేజి ఉండేది. పదిమంది ఉద్యోగులకంటేతక్కువ ఉన్నవారిని సహజంగానే మినహాయించింది. కార్మిక మంత్రి మన్సుక్ మాండవీయ మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి కొత్త కార్మికచట్టాలు హుందాతనాన్ని పెంచుతాయని అన్నారు. 40 కోట్లమంది కార్మికులకు సామాజికభద్రత పెరుగుతుందని, గ్రాట్యుటీ సదుపాయం స్పష్టమైన ఉద్యోగులకు ఏడాది జరిగిన తర్వాతనే లభిస్తుంది. ఐటి ఉద్యోగులకు ఏడో తేదీలోపే వేతనాలు చెల్లించాలి. మహిళా ఉద్యోగుల కుటుంబంలో అత్తమామలకు చోటు. దీనివల్ల డిపెండెంట్‌కవరేజి పెరుగుతుంది. గిగ్‌వర్కక, ప్లాట్‌ఫామ్‌వర్క్, అగ్రిగేటర్స్‌కు చట్టంలో తొలిసారి నిర్వచనం. అగ్రిగేటర్లు వార్షిక టర్నోవర్‌లో 1నుంచి 2శాతం సామాజికభద్రతకు నిధులు కేటాయించాలి. ఆదార్ అనుసంధానిత యుఎఎన్ ద్వారా ఈ ప్రయోజనాలు అందించాలి.యుఎఎన్‌సాయంతో పోర్టబుల్‌చేసుకునే వెసులుబాటు కల్పించింది.

**40 కోట్లమంది కార్మికులకు లబ్ధి**
**కేంద్ర కార్మిక మంత్రిమన్సుక్ మాండవీయ**

# గాజాలో ఏడు కిలోమీటర్ల నిడివికలిగిన సొరంగం



## 25 మీటర్లలోతున 80 అధునాతన గదులతో నిర్మాణం

**గాజాసిటీ, నవంబరు 21:** ఇజ్రాయెల్ రక్షణరంగ దళాలు గాజాస్ట్రిప్‌లో భారీ ఎత్తున నిర్మించుకున్న హమాస్ సొరంగాన్ని గుర్తించారు. ఇజ్రాయెల్ లెఫ్టినెంట్ హదర్ గోల్డిన్ మృతదేహం బయటపడిన చోట ఈ టన్నెల్ ఉన్నట్లు గుర్తించారు. గాజాపై ముప్పేట దాడిలో గోల్డిన్ మృతిచెందారు. రఫా పరిసరాల్లోనే ఈ అతిపెద్దభారీ టన్నెల్ ఉందని, ఈ సొరంగం హమాస్ కమాండర్లు ఆయుధ సామగ్రి భద్రపరుచుకోవడం, దాడులకు ప్రణాళికలు చేయడం, సుదీర్ఘకాలం బసచేసేందుకు వినియోగించేవారని తేలింది. ఏడు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ సొరంగంలో 80 గదులున్నాయి. 25 మీటర్ల లోతున ఏర్పాటుచేసిన ఈసొరంగం అత్యంత సురక్షితంగా ఉందని ఇజ్రాయెల్ దళాలు గుర్తించాయి. ఇజ్రాయెల్‌కు చెందిన షాయేటెట్13 నావల్ కమాండో యూనిట్, ఎలైట్ యాహాలోమ్ కంబాట్ ఇంజనీరింగ్ యూనిట్లు సంయుక్తంగా జరిపిన సోదాల్లో ఈ సొరంగం బయటపడింది. ముహమ్మద్ సిన్వర్‌తోపాటే చనిపోయిన మహమ్మద్ షబానాలు కూడా ఇక్కడే ఉన్నట్లు ఆనవాళ్లులభించాయి.

### పంజాబ్‌ప్రావిన్స్‌లో బాయిలర్‌పేలుడు -15 మంది మృతి, ఏడుగురికి గాయాలు

**కరాచి, నవంబరు 21:** పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో గల ఒక జిగురు తయారీ కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో దాదాపు 15 మంది కార్మికులు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ దుర్ఘటన లాహోర్ నుంచి 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫైసలాబాద్ జిల్లాలో శుక్రవారం ఉదయం సంభవించింది.ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, శిథిలాల కింద మరికొంతమంది ఉండి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఈ ఘటన జరిగిన వెంటనే ఫ్యాక్టరీ యజమాని పరారీ కాగా, మేనేజర్‌ను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### ఢిల్లీ కాలుష్యంపై క్రికెటర్ జాంటిరోడ్స్ ఆందోళన!



**న్యూఢిల్లీ, నవంబరు 21:** ఢిల్లీ వాయు కాలుష్యంపై దక్షిణాఫ్రికా క్రికెటర్ జాంటీ రోడ్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం తన కుటుంబంతో గోవాలో నివసిస్తున్న రోడ్స్, ఢిల్లీకి రాగానే గాలిలో నాణ్యత ఎంత దారుణంగా ఉందో వెంటనే అర్థమైందని అన్నాడు. ఈ కాలుష్య వాతావరణంలో పిల్లలను బయటకు వెళ్లి ఆడుకోమని ప్రోత్సహించడం ఎలా సాధ్యమని ఆవేదన చెందాడు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రోడ్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశాడు. మేము గోవాలో సముద్రం పక్కన నివసిస్తాం. అక్కడ పరిశ్రమలు తక్కువ, గాలి ఎప్పుడూ స్వచ్ఛంగా ఉంటుంది. కానీ ఢిల్లీకి రాగానే ఆ తేడా స్పష్టంగా తెలిసిందని రోడ్స్ వివరించాడు. క్రీడలను ప్రోత్సహిస్తూ పిల్లలను బయట ఆడుకోమని చెప్పే తాను, ఢిల్లీ పరిస్థితులు చూసి అయోమయానికి గురయ్యానని తెలిపాడు.

# ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు.. వాటిలో భారత్ సంస్థలు సైతం!

**వాషింగ్టన్, నవంబరు 21:** ఇరాన్ నుంచి చమురును ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు సరఫరా కాకుండా అడ్డుకునేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆ దేశంలోని పలు కంపెనీలు, వ్యక్తులపై తాజాగా ఆంక్షలు విధించింది. ఇందులో భారత్‌కు చెందిన కంపెనీలతోపాటు కొందరు వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయి. టెహ్రాన్ సైనిక కార్యకలాపాలపై ఆర్థిక ఒత్తిడి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇజ్రాయెల్‌తో జరిగిన 12 రోజుల యుద్ధంలో ఓటమి నేపథ్యంలో టెహ్రాన్ సైనిక దళాలకు నిధులు సమకూర్చేందుకు ఈ చమురు ద్వారా వచ్చే ఆదాయం కీలకంగా మారిందని ట్రెజరీ పేర్కొంది. 'ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధికి, ఉగ్రవాద ప్రాక్సీలకు మద్దతు ఇచ్చేందుకు నిధులు అందకుండా చేసేందుకు ట్రెజరీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మొత్తం 17 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించింది. ఆ దేశంపై ఆర్థిక ఒత్తిడి తెచ్చేందుకు ఇది ఉపయోగపడుతుంది' అని ట్రెజరీ శాఖ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. యుఎస్ విధించిన ఆంక్షల్లో భారత్ కేంద్రంగా పనిచేస్తున్న టిఆర్6 పెట్రో కంపెనీ కూడా ఉంది. ఈ సంస్థ 2024-25 మధ్య బహుళ కంపెనీల నుంచి 8 మిలియన్ డాలర్ల చమురును దిగుమతి చేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి.



# కరవు రహిత రాష్ట్రమే చంద్రబాబు లక్ష్యం

● కృష్ణా జలాలు తెచ్చి కుప్పం వాసుల దశాబ్దాల కల నెరవేర్చారు ● కుప్పానికి పరిశ్రమల రాకతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ● మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి ● ఉపాధి పొందడం కాదు.. ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలి ● 3వ రోజు కుప్పం నియోజకవర్గం పర్యటనలో నారా భువనేశ్వరి

కుప్పం, నవంబరు 21 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కృష్ణా జలాలు తీసుకొచ్చి కుప్పం వాసుల దశాబ్దాల కల నెరవేర్చారని అన్నారు. మహిళలకు ఆర్థిక భద్రత అవసరమని, స్వయం ఉపాధి ద్వారా వారికి మరింత ఆదాయం లభిస్తుందని అన్నారు. 3వ రోజు కుప్పం నియజకవర్గం పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక ప్రగతికి చేయూత

నడింపల్లి గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి ముందుగా గంగమ్మ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. వారితో కలిసి కోలాటం ఆడారు. ఆపై వారిని ఉద్దేశించి మాట్లాడుతూ... "మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో చంద్రబాబు డ్వాక్రా స్థాపించారు. నేడు డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తూ పారిశ్రామికవేత్తల స్థాయికి ఎదిగారు. మహిళలు తలుచుకుంటే ఏదైనా చేయగలరు. మన వల్ల ఏమీ కాదు అనే భావన నుంచి ముందు బయటకు రావాలి. ఎదురుదెబ్బలు తగులుతుంటాయి. వాటి నుంచి నేర్చుకుని ముందుకు నడవాలి. మహిళల్లో ప్రతిభను వెలికితీసి వారికి సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయడంలో ఎలీప్ చేస్తున్న కృషి అభినందనీయం. రమాదేవి ఆమె టీం సభ్యులంతా ఎలీప్ ద్వారా అనేకమంది మహిళలను ఔత్సాహిక పారిశ్రామివేత్తలుగా తీర్చిదిద్దారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కూడా మహిళల ఆర్థిక ప్రగతికి పాటుపడుతున్నాం. వారి స్వయం ఉపాధికి చేయూత అందిస్తున్నాం. టైలరింగ్, మగ్గం, చికెన్ కారీ వర్క్‌లో శిక్షణ ఇస్తున్నాం. నడింపల్లిలో 198 మందికి పింఛను అందుతోంది. టిడ్కో కింద 62 గృహాలు, రూ.1.30 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించారు. తల్లికి వందనం పథకం కింద 155 మంది లబ్ధి పొందుతున్నారు. 147 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఆర్థిక సాయం అందింది" అని నారా భువనేశ్వరి వివరించారు.

### దేశంలో ఏపీ నెంబర్ వన్‌గా నిలవాలి

"రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేశారు. చంద్రబాబు దూరదృష్టితో కుప్పానికి నీటి కష్టాలు తీరాయి. కుప్పంలో ప్రతి గ్రామం పచ్చగా ఉండాలన్నదే ఆయన కోరిక. ఇటీవల కుప్పానికి 7 పరిశ్రమలు వచ్చాయి. త్వరలో మరో 8 సంస్థలు రాబోతున్నాయి. గత ఐదేళ్లలో ప్రజలు భయం గుప్పిట్లో బ్రతికారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ లభించింది. గంజాయిపై ఉక్కుపాదం మోపారు. మహిళల రక్షణ కల్పించడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మేము ఎంత చేసినా కుప్పం ప్రజల రుణం తీర్చుకోలేము. నేను నిజం గెలవాలి యాత్ర చేసినప్పుడు టీడీపీ కార్యకర్తలు, కుప్పం ప్రజల ఎంతో సహకరించారు. అలాగే...2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు తరపున నామినేషన్ వేయడానికి వచ్చినప్పుడు మీరు నాపై చూపిన అభిమానాన్ని మర్చిపోలేను" అని భువనేశ్వరి పేర్కొన్నారు.

### కృష్ణమ్మకు జలహారతి

తుమ్మిసి పెద్దచెరువు దగ్గర జలహారతి కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. అంతకు ముందు శాంతిపురం నుంచి తుమ్మిసి వరకూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులతో ముచ్చటించారు. భువనేశ్వరి ఆర్టీసీ బస్సు ఎక్కగానే ఆధార్ తప్పనిసరి అని మహిళా కండెక్టర్ చెప్పింది. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్నావని మహిళా కండెక్టర్‌ను భువనేశ్వరి అభినందించారు. ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, నారా భువనమ్మ కుప్పం ప్రజలపై చూపుతున్న అభిమానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. అంతకుముందు నారా భువనేశ్వరి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి మహిళలతో ముచ్చటించారు. నడింపల్లిగ్రామంలో మహిళలతో సరదాగా కోలాటం ఆడారు. నారా భువనేశ్వరికి గ్రామాల్లో మహిళలు నీరాజనం పలికారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, టిడిపి మండల అధ్యక్షులు ఉదయ్‌కుమార్, వెంకటరమణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.



# ఇందిరాగాంధీ స్టేడియం ఇక క్రీడావసరాలకే

అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో మైదానం అభివృద్ధికి ప్రభుత్వ చర్యలు

విజయవావ, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించేలా ఉన్నత ప్రమాణాలతో కొత్త క్రీడా ప్రాంగణం ఏర్పాటుతోపాటు పాత వాటిని ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా విజయవాడ నడిబొడ్డుననున్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. 2028 చివరి నాటికి దీన్ని ఆధునీకరించి, 2029లో అంతర్జాతీయ క్రీడలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్), విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(విఎంసి) సంయుక్తంగా ఈ స్టేడియం అభివృద్ధి, నిర్వహణ చేపటనున్నాయి. పనులకు రూ.53 కోట్లు అంచనా వేయగా, రూ.30 కోట్లతో మొదటి విడత పనులు ప్రారంభిచనున్నారు. ఈ నెలాఖరు కల్లా అధికారులు డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందించనున్నారు. స్టేడియంలో ఇకపై ప్రభుత్వ, ప్రైవేటు క్రీడేతర కార్యక్రమాలు ఉండవని అధికార వర్గాలు వెల్లడించాయి. స్టేడియంలో ఇప్పుడున్న కొన్ని నిర్మాణాలను ఆధునీకరించి, మరికొన్ని భవనాలు నిర్మించి అదనపు కోర్టులు,వసతులు అందుబాటులోకి తేవాలని ప్రతిపాదనలున్నాయి. ఇప్పుడున్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగిస్తారు. ఆ స్థలంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ హాల్, బాక్సింగ్ ప్రాక్టీస్ ఎరీనా, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కమర్షియల్ హాల్‌ను నిర్మిస్తారు. స్టేడియంలో సాధనకు 3 సింథటిక్ ఔట్‌డోర్ టెన్నిస్ కోర్టులు ఉన్నాయి. అదనంగా రెండేసి చొప్పున టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ ఔట్‌డోర్ కోర్టుల నిర్మాణం, ప్రాక్టీస్ కోసం క్రికెట్ నెట్ ఏర్పాటు, స్థలాభావం దృష్ట్యా అవసరం లేనప్పుడు పక్కన పెట్టే గ్యాలరీలు, ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ మధ్య ఫుట్‌బాల్ ఫీల్డ్, గ్యాలరీలకు అనుసంధానంగా ఓ వైపు భవనం నిర్మాణం, మొదటి అంతస్థులో మరో సింథటిక్ వార్మప్ ట్రాక్. గ్యాలరీ లకు నేరుగా ప్రధాన స్టేడియం చేరుకునేలా మార్గం ఏర్పాటు చేస్తారు. క్రీడా క్యాంపులకు వీలుగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో కిచెన్, డార్మెంటరీ, వసతి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ప్రధాన స్టేడియం గ్యాలరీల కింద ఉన్న గదుల ఆధునీకరిస్తారు.




# జనవరి 4న తెనాలిలో ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్

మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

గుంటూరు, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ జనవరి 4న గుంటూరు జిల్లా తెనాలిలో భారీ స్థాయిలో జరుగుతుందని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా ఏపీ) వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. గుంటూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మా ఎపి నిర్వహిస్తున్న ఈపోటీల్లో ఆంధ్రప్రదేశ్‌లో నివాసముంటున్న వ్యక్తులకు మాత్రమే పాల్గొనే అర్హత ఉందన్నారు. ఒక్క రూపాయి కూడా ప్రవేశ రుసుం చెల్లించవలసిన అవసరం లేదన్నారు. 15 నిమిషాల నిడివి మించకుండా, ఏ మతాన్ని, కులాన్ని, రాజకీయ పార్టీలను విమర్శించకుండా షార్ట్ ఫిల్మ్‌లను ప్రతిభగల ఆంధ్రులు రూపొందించాలన్నారు. సమాజంపై విషం చిమ్ముతున్న వ్యవస్థలపై గాని, దేశ భద్రత పతిష్టతపై గాని, సృజనాత్మకతతో తమకిష్టమైన కథాంశాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ దర్శక, నిర్మాతలకు ఉందని నిర్వాహకుడు దిలీప్ రాజా స్పష్టం చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ స్మారక ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, మహానటి సావిత్రి స్మారక ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, కొంగర జగ్గయ్య స్మారక తృతీయ బహుమతిగా 20 వేల రూపాయల నగదు, పర్మనెంట్ షీల్డ్, ప్రశంసా పత్రం విజేతలకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. గుమ్మడి, జమునల పేరుతో కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని చెప్పారు. వ్యక్తిగత బహుమతులను గోవిందరాజుల సుబ్బారావు, కాంచనమాల, సభారంజని, ఏవీయస్, వల్లూరి వెంకట్రామయ్య చౌదరి, కన్నెగంటి నాసరయ్య, ఆకుల వెంకయ్య, చక్రపాణి, బొల్లిముంత శివరామ కృష్ణ, మోదుకూరి జాన్సన్ పేరిట విజేతలకు బహుమతులు అందిస్తామని కో కన్వీనర్, సినీదర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఎంట్రీలను డిసెంబరు 20లోగా "మా ఏపి "కార్యాలయం, ఆలపాటి నగర్, సుల్తానాబాద్, తెనాలి 522202, గుంటూరు జిల్లా చిరునామాకు పూర్తి చేసిన ఎంట్రీ ఫారంతో షార్ట్ ఫిల్మ్‌ను పెన్‌డ్రైవ్‌లో పంపవలసిందిగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉంటున్న ఆధార్ కార్డు నఖలును జతపర్చవలసిందిగా శ్రీనివాస్ యాదవ్ వివరించారు. పూర్తి వివరాల కోసంపై చిరునామాలో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో నటుడు మిలటరీ ప్రసాద్, మేకప్ ఉమన్ శిరీష, మోటూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దండి

● బ్యాంకు రుణాలు సకాలంలో అందేలా చూడండి ● సెర్ప్ పనితీరుపై సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సచివాలయం, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని, వారికి అవసరమైన బ్యాంకు రుణాలను సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం విజయవాడ సెర్ప్ కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి శ్రీనివాస్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్‌ల ఏర్పాటుపై అధికారులతో మంత్రి చర్చించారు. రైతుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు వాసన్ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలపై సమీక్షించారు. 202526 ఆర్థిక సంవత్సరంలో లక్ష మంది స్వయం సహాయక సంఘ సభ్యులను మహిళా వ్యవస్థాపకులుగా, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం, కొత్త సంస్థల ఏర్పాటుపై అధికారులతో మంత్రి చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.578.08 కోట్లతో, 39 వేల 371 మంది మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు వ్యాపార సేవా, పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేయగా, మిగిలిన లక్ష్యాలను వచ్చే ఏడాది మార్చ్ లోగా సాధించాలని అధికారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దిశానిర్దేశం చేశారు.

బ్యాంకుల ద్వారా ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటి వరకు రూ.16,846 కోట్ల రుణాలు ఇవ్వగా, మార్చి 2026లోగా రూ.32 వేల 322 కోట్ల రుణాలు స్వయం సహాయక సంఘాలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెర్ప్ ద్వారా 520 ఎఫ్పీవో (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు)లు ఏర్పాటు చేయగా, హైఫర్ ఇంటర్నేషనల్, వాసన్, కాల్గుడి, బ్రెడ్స్ సంస్థల సహకారంతో రైతు ఉత్పత్తి సంస్థలు బలోపేతం చేసి, రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు అందించి, రైతులు పండించిన పంటలను, ఎఫ్పీఓ ద్వారా సేకరించి, పంటలను ప్రాసెస్ చేసి, బహిరంగ మార్కెట్ లో విక్రయించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదాయం పెంచే విధంగా పనిచేయాలని సూచించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఈ ఆర్థిక ఏడాదిలో 175 కోట్ల సామాజిక పెట్టుబడి నిధి రుణాలను స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగుపరుచుటకై మంజూరు చేయడం జరిగిందని, సామాజిక పెట్టుబడి నిధి రుణాలు మంజూరు మరియు తిరిగి చెల్లింపు సహా అన్ని వివరాలను ఆన్లైన్ ద్వారా పారదర్శకంగా చేపట్టినందుకు అధికారులను మంత్రి అభినందించారు. స్వయం సహాయక సంఘ మహిళలను వ్యవస్థాపకులుగా తయారు చేయడానికై, ఐఐఎం విశాఖపట్నంను ఇన్క్యుబేషన్ సెంటర్‌గా భారత ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో, 150 మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు, శాఖా పరంగా అవసరమైన చర్యలను చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ, డిప్యూటి సీఈఓ శ్రీరాముల నాయుడు, స్త్రీనిధి ఎండీ హరిప్రసాద్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కొత్తగా 15 న్యూట్రిషన్ కేంద్రాలు

గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో 11 ఏర్పాటు: మంత్రి సత్యకుమార్

విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ముఖ్యమైన 15 ప్రభుత్వాసుపత్రుల్లో న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్స్ (ఎన్.ఆర్.సి.లు) త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు వయస్సు కలిగిన చిన్నారులకు సేవలందుతాయి. ఈ 15లో 11 గిరిజన ప్రాంతాల్లో వస్తాయని పేర్కొన్నారు. వీటన్నిటిలో కలిపి 115 పడకలు చిన్నారులకు అందుబాటులోకి రానున్నాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 21 ఎన్ఆర్సీలు ఉండగా... వీటిల్లో 340 పడకలు ఉన్నాయని తెలిపారు. ఆశా, ఎ.ఎన్.ఎం.ల నుంచి అందే సమాచారంతో పీహెచ్సీ వైద్యులు పరిక్షలు చేసిన అనంతరం సదరు చిన్నారులను సమీపంలోని ఎన్ఆర్సీలకు పంపుతారు. ఈ కేంద్రాల్లో చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా? లేదా అని పరిశీలించి ట్రీట్మెంట్ ఇస్తారు. ఈ కేంద్రాల్లోనే ఉండే న్యూట్రిషన్ కౌన్సిలర్లు చిన్నారులకు ఎలాంటి ఆహారం (పీడింగ్) ఇవ్వాలన్న దానిపై చేసిన సిఫారసులు అనుసరించి సిబ్బంది సమకూరుస్తారు. ఇలా 2 వారాలపాటు వైద్యంతోపాటు సమాంతరంగా పౌష్టికాహారం (ప్రొటీన్ రిచ్ పుడ్) చిన్నారులకు అందిస్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ఏరియా ఆసుపత్రి, ముంచింగిపట్టు, చింతపల్లి సీహెచ్‌సీల్లో వచ్చే ఈ సెంటర్లలో 10 చొప్పున పడకలు ఉంటాయి. అనకాపల్లి జిల్లా అసుపత్రి, బాపట్ల, పల్నాడు ఏరియా ఆసుపత్రులు, పల్నాడు జిల్లా నరసరావుపేట ఏరియా ఆసుపత్రి, నంద్యాల జిల్లా నంద్యాల బోధనాసుపత్రి, సున్నిపెంట ఏరియా ఆసుపత్రిలో వచ్చే ఈ కేంద్రాల్లో 10 చొప్పున పడకలు ఉంటాయి. ఈ పడకల కోసం ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేకంగా వార్డులు ఏర్పడతాయి. పార్వతీపురం జిల్లా సాలూరు, పాలకొండ ఏరియా ఆసుపత్రులు, భద్రగిరి, కురుపాం, చిన్నమరంగి సీహెచ్‌సీల్లో, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల ఏరియా ఆసుపత్రి, రామవరం సీహెచ్సీల్లో ఉన్న పడకలకు అదనంగా ఐదు చొప్పున ఈ సెంటర్ల కింద రానున్నాయి. 13 బోధనాసుపత్రుల్లో 20 చొప్పున, 8 జిల్లా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పది చొప్పున పడకలు ఉన్నాయి. వీటి ద్వారా చిన్నారులు ప్రయోజనం పొందుతున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఈ కేంద్రాల కార్యకలాపాలు కొనసాగుతాయి.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కుట్ర



విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్రంతో కుమ్మక్కై విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు సిఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని, ఉరి బిగించే పని చేస్తున్నారని విమర్శించారు. సిఐఐ సదస్సులో వైట్ ఎలిఫెంట్ వ్యాఖ్యల వెనుక అర్థం అదేనని పేర్కొన్నారు. ప్రైవేటీకరణకు అనుకూలమని చంద్రబాబు సంకేతాలు ఇస్తున్నారని వివరించారు. జగన్ వల్లే గత ఐదేళ్లు ప్లాంటు ప్రైవేటీకరణ ఆగిందని పేర్కొన్నారు. తాము ప్రైవేటీకరణకు వ్యతిరేకమన్నారు. ఇదే విషయాన్ని కేంద్రానికి, ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రూపంలో ఇచ్చామని చెప్పారు. ప్లాంటును కాపాడే మార్గాలను సూచిస్తూ మోడీకి లేఖ కూడా రాశామన్నారు. టిడిపి సపోర్టుతో కేంద్రంలో ఎన్‌డిఎ ఉన్నా.. స్టీల్ ప్లాంటును కనీసం కాపాడే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ప్లాంటుపై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ప్లాంటును ప్రైవేటీకరించబోమని ప్రధాని మోడీతో ప్రకటన చేయించాలని రజిని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ పైశాచికత్వానికి వెంకటరెడ్డి అరెస్టు పరాకాష్ట అని మాజీ మంత్రి అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని సిఎం చంద్రబాబు ప్రజల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య



విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని ప్రాంతంలో రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల కేసులు, ఆర్5 జోన్ కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. రిటనబుల్ ప్లాట్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి, హద్దు రాళ్లను వేయాలన్నారు. ప్రైవేటు సంస్థలకు కేటాయించిన స్థలాల్లో పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. రాజధాని రైతులకు వార్షిక కౌలు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. రాజధాని కోసం ఎంపిక చేసిన 29 గ్రామాల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని, గత పదేళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. సిఆర్‌డిఎ అధికారుల నిర్లక్ష్య ధోరణి, ప్రభుత్వం చూపుతున్న సాగదీత వైఖరి రైతులను తీవ్ర నష్టానికి గురిచేస్తోందన్నారు.

# 'సత్యసాయి'కి ఉరవకొండతో విడదీయరాని బంధం!

● బాబా ధ్యానం చేసిన రాతిగుండుకు మందిరం నిర్మించి పూజలు ● కరిబసవస్వామి పాఠశాలలో 8వ తరగతి చదివిన బాబా ● 14వ యేట ఉరవకొండలో సత్యసాయిగా అవతార ప్రకటన ● సత్యసాయి శత జయంత్యుత్సవం సందర్భంగా 'వార్త' ప్రత్యేక కథనం



సత్యసాయి తన 14వ యేట అవతార ప్రకటన నాటి చిత్రం

ఉరవకొండ, నవంబరు 21 ప్రభాతవార్త: ప్రపంచ దేశాలకు ప్రేమ తత్వాలను చాటుతూ అనేక సేవా కార్యక్రమాల ద్వారా దైవంగా కొలువబడిన భగవాన్ సత్య సాయిబాబాకు ఉరవకొండతో విడదీయరాని బంధం ఉంది. తల్లి దండ్రులు పెట్టిన సత్యనారాయణరాజు పేరుతో పిలువబడి తన 14వ యేట సత్యసాయిబాబాగా ప్రకటించుకుంది ఉరవకొండలోనే. 1926 నవంబర్ 23న జిల్లాలోని పుట్టపర్తిలో పెద వెంకమరాజు, ఈశ్వరాంబ దంపతులకు 4వ సంతానంగా జన్మించిన సత్యనారాయణరాజు దాదాపు యేదాడి పాటు తన విద్యాభ్యాసం ఉరవకొండలోనే సాగించారు. బుక్కపట్నంలోని ఎలిమెంట్రీ పాఠశాలలో చదువుతున్న సత్యనారాయణ రాజు 1943-44 విద్యా సంవత్సరంలో 1-7-1943లో పట్టణంలోని స్థానిక కరిబసవస్వామి బోర్డు ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో అడ్మిషన్ (సంఖ్య: 422) పొందారు. పాఠశాలలో పండితుడిగా పనిచేస్తున్న సోదరుడు శేషమరాజు వద్ద ఉండి ఆయన విద్యాభ్యాసం కొనసాగించారు. ఆసమయంలోనే మౌనంగా ఉండటం, తనకు ఇష్టమైనప్పుడు పాఠశాలకు సమీపంలోని అబ్కారి ఇన్‌స్పెక్టర్ బంగళా ఆవరణంలోని పెద్ద రాతి గుండుపై కూర్చునేవారని చెబుతారు. 1940 అక్టోబర్ 20న పాఠశాలకు వెళ్లిన ఆయన తిరిగి వస్తూ ఇంటి వద్దకు రాగానే తన చేతిలోని పుస్తకాల సంచిని ఇంటిలోపలికి విసిరేసి "మాయ వీడినది, నేను సత్యనారాయణుడను కాను సత్యసాయి బాబాను నేను నా కర్తవ్యాన్ని నిర్వహించాల్సి వుంది..నన్ను నా భక్తులు పిలుస్తున్నారు.. నేను వెళ్తున్నానంటూ" వెళ్లి అబ్కారి ఇన్‌స్పెక్టర్ బంగళా ఆవరణలోని రాతి గుండుపై కూర్చుండిపోయారు. 14 సంవత్సరాల బాలుడు ఈవిధంగా మాట్లాడటం చూసి శేషమరాజు భార్య ఆశ్చర్యం చెంది వారించేందుకు యత్నించారు. అయితే ఆయన ఎంతవారించినా వినకుండా వెళ్లి రాతి గుండుపై ధ్యానంలో మునిగిపోయారు. భవబంధాలు వీడి తన భక్తుల కోసం నిర్వహించాల్సిన కర్తవ్యం కోసం వెళ్తున్నానని వెళ్లిన ఆయన విషయం ఉరవకొండ ప్రజలకు తెలిసి భక్తులు మెల్ల మెల్లగా ఆయన కూర్చున్న స్థానం వద్దకు చేరుకోసాగారు. మానవజాతిని అసత్యం వైపు నుండి సత్యంవైపుకు, చీకటి నుండి వెలుగువైపుకు నడిపించే గురుచరణములను పూజించి దుర్భరమైన సంసార సాగరాన్ని దాటడానికి ప్రయత్నించడని ప్రభోదిస్తూ తొలిసారిగా 'మానస భజరే గురు చరణం' అన్న భజన గీతాన్ని భక్తులతో ఆలపింప చేశారని చెబుతారు.

సత్యనారాయణరాజు ఇంటి నుండి వెళ్లిపోయి అవతార ప్రకటన చేసిన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు ఉరవకొండకు చేరుకొని బాబాను ఒప్పించి పుట్టపర్తికు పిలుచుకెళ్లారు. నాటి నుండి సత్యసాయి మహానిర్యాణం పొందే వరకు ఒక్కసారి కూడా ఉరవకొండకు రాకపోవడం విశేషం. బాబా నివశించిన ఇళ్లు పూర్తిగా శిథిలమైపోగా కొన్నేళ్ల క్రితం పునఃనిర్మించారు. బాబా ధ్యానం చేసిన గుండుకు మందిరం నిర్మించి బాల సాయిబాబా విగ్రహాన్ని కొలువుదీర్చి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన మందిరాన్ని ఏర్పాటుచేసి భజనలు కొనసాగిస్తున్నారు.



# నేడే సత్యసాయి వర్సిటీ 44వ స్నాతకోత్సవం

పుట్టపర్తి రూరల్, నవంబరు 21 ప్రభాతవార్త: సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో భాగంగా నేడు శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో సాయంత్రం 04:00 గంటలకు జరుగనుంది. ఈ స్నాతకోత్సవంలో ఏపీజే అబ్దుల్ కలాం గోల్డ్ మెడల్, గురుగుల రామకృష్ణారావు గోల్డ్ మెడల్, ఆర్వి జానకి రామయ్య గోల్డ్ మెడల్, మొదలగు విశిష్ట గోల్డ్ మెడల్‌లను విద్యార్థులకు అందించనున్నారు. ఈ స్నాతకోత్సవంలో 20 బంగారు పతకాలను. 18 పి.హెచ్.డి పట్టాలను, 526 డిగ్రీ పట్టాలను విద్యార్థులకు అందజేయనున్నారు. ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ పాల్గొంటారు. ఆయన మధ్యాహ్నం 03:45 నిమిషాలకు పుట్టపర్తి విమానా శ్రయం చేరుకుంటారు. అక్కడ నుండి 03:50 నిమిషా లకు ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకుని, 4 గంటలకు స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించనున్నారు. అనంతరం సాయి కుల్వంత్ సభ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# 'వ్యర్థాల' విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లలో యూనిట్ ధర ఖరారు

విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో విజయవాడ, తిరుపతిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లలో యూనిట్ విద్యుత్తు ధరను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. రోజూ 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల తిరుపతి ప్లాంట్‌లో యూనిట్ ధర రూ.7.95గా నిర్ణయించారు. 15 మెగావాట్ల సామర్థ్యం గల విజయవాడ ప్లాంట్‌లో యూనిట్ ధర రూ.7.50గా నిర్ణయిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.


మహిళాభక్తులకు గాజులు పంచుతున్న దృశ్యం

# దుర్గమ్మ ఆలయంలో భవానీ దీక్షధారణ

**- మహిళా భక్తులకు గాజుల పంపిణీ**

ఇంద్రకీలాద్రి, నవంబరు 21 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో భవానీ దీక్షధారణలు శుక్రవారం ప్రారంభమైనాయి, ఇఒ వికె శీనా నాయక్ ఈ సందర్భంగా మాలధారణకు వచ్చిన భక్తులతో ముచ్చటించారు. ఈనెల 25 వరకు శ్రీభవానీ దీక్షలకు మాలధారణలు కొనసాగుతాయన్నారు. దుర్గమ్మవారి మహిళా భక్తులకు శుక్రవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొని గాజుల పంపిణీ ప్రారంభించారు. దుర్గమ్మ ఆలయంలో నలుగురు సెక్యూరిటీ సిబ్బంది వ్యక్తిగత విభేధాలతో ఆలయానికి చెడ్డపేరు తెస్తున్నారని వారిని విధుల నుండి తొలగించాలని ఇఒ ఆఫీసర్లకు ఆదేశాలిచ్చారు.

ఇఒ వికె శీనా నాయక్ శుక్రవారం ఘాట్‌రోడ్డు వద్ద ఆకస్మిక తనిఖీ చేశారు. వాహన నియంత్రణ, భక్తుల రద్దీని బట్టి నియంత్రించాలని ఆదేశాలిచ్చారు. ఓం టర్నింగ్ వద్ద వున్న విజయ కూల్‌డ్రింక్ షాప్, క్లోక్‌రూంలను వేరోచోటుకు తరలించాలని ఆదేశాలిచ్చారు. ద్విచక్రవాహనాల పార్కింగ్ క్రమబద్దీకరణకు మార్కింగ్ చేయాలన్నారు. వివిఐపి ల కార్లు కోసం ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. ఓం టర్నింగ్ వద్ద వివిపిల ఫిల్టరింగ్‌కోసం కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలని, 40 మంది భక్తులు కూర్చునేందుకు వీలుగా రిసెప్షన్ వద్ద ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.


అధికారులకు ఆదేశాలిస్తున్న ఇఒ

# కార్మికుల సంక్షేమానికి ప్రధాని మోడీ కృషి

విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా ఉన్న కార్మికుల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోడీ చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కొనియాడారు. కార్మికుల సంక్షేమాన్ని మరింత బలపరుస్తూ 29 పాత కార్మిక చట్టాల స్థానంలో 4శ్రమ స్మృతులు శుక్రవారం నుండి అమలులోకి వచ్చాయని ఆయన శుక్రవారం ఒప్రకటనలో తెలిపారు. కార్మికులకు సమయానికి కనీస వేతనం గ్యారెంటి, యువతకు నియామక పత్రం గ్యారెంటి, మహిళలకు సమాన వేతనం ఇస్తూ వారికి తగిన గౌరవం దక్కేలా మోడి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా 40కోట్ల మంది శ్రామికులకు సామాజిక భద్రత కల్పిస్తూ మోడి చారిత్రక నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు.

# కల్తీ నెయ్యి బాగోతం!

- ‘సిట్’కే అంతుజిక్కని పరస్పర విరుద్ద వాంగ్మూలాలు
- ‘బోర్డు’నే సర్వస్వం: మాజీ ఇఒ ధర్మారెడ్డి
- అధికారులే నిర్ణయిస్తారన్న మాజీ చైర్మన్ వైవి

తిరుపతి, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి సరఫరా, వినియోగించారనే ఆరోపణల కేసు విచారణలో సిబిఐ సిట్ అధికారులకు దిమ్మతిరిగే సమాధానాలు రావడం ఆశ్చర్యంకలిగిస్తోంది. గత ఐదేళ్ళలో వైసిపి ప్రభుత్వ ఆధ్వర్యంలోని వైసిపి బోర్డు పెద్దలు, అధికారులు కలసి నెయ్యిటెండర్ల కేటాయింపుల నుండి పాల్గొన్న నిర్వాహకులు, కాంట్రాక్టర్లు మొత్తం అక్రమాలకు అవినీతికి పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలతో 2024లో రాష్ట్రంలో ఏర్పాటైన టిడిపి కూటమి ప్రభుత్వం కల్తీనెయ్యి సరఫరాలో కీలక పాత్రధారులు, సూత్రధారుల వ్యవహారం నిగ్గుతేల్చేందుకు సిద్దమైంది. ఈ కేసును తొలుతరాష్ట్ర పోలీసు శాఖ లోని ఐజి స్థాయి అధికారి నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసింది. అయితే ఆ సిట్ రాజకీయకోణంలో పనిచేస్తుందని మాజీ టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దాంతో రాష్ట్రపోలీస్ సిట్‌ను రద్దుచేసి ఆ స్థానంలో గత ఏడాది నవంబర్/డిసెంబర్‌లో సిబిఐ అధికారులు, రాష్ట్రస్థాయి ఐజి హోదా అధికారులతో సిట్‌ను నియమించింది. ఈ సిట్ అధికారుల బృందం వరుసగా 2020వ సంవత్సరం నుండి 2024 మేనెల వరకు నెయ్యి సరఫరాకు టెండర్లలో పాల్గొన్న డెయిరీల యాజమాన్యం, నిర్వాహకులు, కాంట్రాక్టర్లు, ఆ తరువాత నెయ్యిని ఎక్కడ నుండి సరఫరా చేశారు, ఎన్ని డెయిరీలు ఎంత మొత్తంలో అనే కీలక సమాచారం సేకరించింది. సిట్ అధికారులు దర్యాప్తులో విస్తుబోయే విషయాలు వెలుగు చూశాయి. తిరుపతి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని పాత ఎస్వీబిసి కార్యాలయం కేంద్రంగా సిట్ బృందం నిమగ్నమై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించింది. లడ్డూల తయారీ లో వినియోగిస్తున్న నెయ్యిలో పలు నూనెలు కల్తీచేసి సరఫరా చేశారనేది తేల్చారు. కల్తీనెయ్యిని పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కు పంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రపై నివేదికలు తయారుచేశారు. ఆ నివేదికల ఆధారంగా తమిళనాడు ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరాదారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరా ఖండ్ రూర్కే బోలేబాబా డైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలతో బాటు మరో 20మంది వరకు నిందితులను అరెస్టుచేసింది. అంతేగాక ఇటీవల కల్తీరసాయనాలు సరఫరా చేసి ప్రధాన కాంట్రాక్టర్ అజయ్ కుమార్, మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి పాత పిఎ చిన్న అప్పన్నను అరెస్ట్ చేసింది. వీరందరి నుండి రాబట్టిన రిమాండ్ రిపోర్టు ఆధారంగా పదిరోజుల క్రిందట సిట్ అధికారులు టిటిడిలో కీలకంగా వ్యవహరించిన మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డిని రెండురోజులు పాటు పూర్తిస్థాయిలో విచారణ చేసింది. ఆయన టిటిడిలో అధికారుల పాత్ర నామమాత్రమేనని, టిటిడి పాలకమండలి సర్వస్వం...కీలకమని సిట్‌కు సమాచారం ఇచ్చారు. బోర్డు తీసుకున్న నిర్ణయాలను అమలుచేయడం అధికా రుల బాధ్యత అని కూడా సిట్‌కు వెల్లడించినట్లు తెలిసింది. దీంతో ధర్మారెడ్డిని విచారణచేసి రాబట్టిన సమాచారం మేరకు గురువారం హైదరాబాద్‌లోని సుబ్బారెడ్డి ఇంట కెళ్ళిన సిట్ అధికారుల బృందం దాదాపు ఆరుగంటలపైగా విచారణ చేపట్టింది. టిటిడిలో అధికారులు చేసిన సూచనలు, విష యాలకు బోర్డు కేవలం నామమాత్రపు ఆమోదం తెలిపి తదుపరి పూర్తిస్థాయి పర్యవేక్షణ, పరిశీలన బాధ్యతలు అధికారులదేనని సిట్‌కు తెలియజేసినట్లు తెలిసింది. దేవుని చెంత సేవకులుగా, నిజాయితీగా టిటిడి ఆదాయాన్ని కాపాడటంలో బోర్డు పాలన ఉంటుందేగానీ ఆదాయం దుర్వినియోగం చేసే పనులు చేపట్టదనే విషయాలు వెల్లడించారనేది ఇప్పుడు సిట్ అధికారులకు అందిన సమాచారం. ఇప్పుడు సిట్ అధికారులు తదుపరి ఎలాంటి చర్యలకు ఉపక్రమించనున్నారో.. రానున్న రోజుల్లో ఎవరినీ మళ్ళీ విచారణకు పిలుస్తారనేది మాత్రం సంచలనమే. కల్తీనెయ్యి సరఫరాలో మరీ ఇలా ఇద్దరు కీలక వ్యక్తులు పరస్పరం విరుద్ద సమాధానాలు ఇవ్వడం మాత్రం సిట్‌ను విస్తుగొలిపిస్తోంది. చిన్న అప్పన్న 2018 తరువాత తనకు సంబంధంలేదని, అతనిని తాను కలవలేదని కూడా సుబ్బారెడ్డి చెప్పడం విశేషం. మరీ కల్తీనెయ్యి తతంగం మొత్తం ఎవరి నేతృత్వంలో సాగిందనేది, కల్తీనెయ్యికి సూత్రధారులు ఎవర నేది తేల్చాల్సిన కీలక అంశం. టిటిడి మాజీ అధికారి, అప్పటి కొనుగోళ్ళ కమి టీ, పోటు అధికారులపై చర్యలకు సిట్ ముందుకు వెళ్ళనుందనేది తెలుస్తోంది.







# ఓట్ చోర్‌పై కాంగ్రెస్ నిరసన

విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త: “ఓట్ చోర్.. గద్దె చోడ్“ భాగంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు లుక్కరాజు రామారావు ఆధ్వర్యంలో విజయవాడలోని ఈసి కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముట్టడించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లెనిన్ ప్రస్థాన్, కార్యదర్శి మమతా నాగిరెడ్డి ఎఐసిసి పరిశీలకులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు లుక్కరాజు రామారావు మాట్లాడుతూ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బిజెపి చేస్తున్న ఓట్లు చోరీ అంశాన్ని రాష్ట్ర ప్రజానీకానికి, ముఖ్యంగా యువతకు తెలియజేయడమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దేశంలో ఫెడరల్ వ్యవస్థను కాపాడటం కోసం యువత నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పీటర్ జోసెఫ్, తిరుపతి నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బి.వెంకటేష్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ పార్టీ పలు జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

# రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించి న్యాయ చేస్తాం

**పురపాలక శాఖ మంత్రి నారాయణ**



విజయవాడ, నవంబరు 21 పభాతవార్త ప్రతినిధి: రైతులకు ఏ సమస్య ఉన్న సీఆర్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటాం. లంక భూములకు ఎన్జీటీ అనుమతులు ఇవ్వాలి. ఒకరిద్దరు రైతులు తమ కోరుకున్న చోటే ఫ్లాట్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఏ ఒక్కరికి ప్లాట్లు కేటాయించే అవకాశం లేదు. రైతులకు ఇచ్చిన హామీలన్నీ 100 పూర్తి చేస్తామని మరోసారి స్పష్టం చేశారు మంత్రి నారాయణ. రైతులతో ఎవరు అవహేళనగా మాట్లాడలేదని, రైతులకు ఏ సమస్య ఉన్న రాజధాని లోని సి ఆర్ డి ఏ కార్యాలయంలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని మంత్రి నారాయణ తెలిపారు.. ఈరోజు ఉదయం రాజధాని గ్రామాలైన వెంకటపాలెం, ఉద్దండరాయినిపాలెం గ్రామాలలో పర్యటించి అమరావతిలో సిటీస్ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టిన ఈ హెల్త్ సెంటర్స్, అంగన్వాడీ కేంద్రాల, స్కూల్ ను పరిశీలించారు.. నిర్మాణం జరుగుతున్నా 15 అంగన్వాడీ భవనాలు, 14 పీహెచ్సీ భవనాలు, 14 స్కూల్, ఒక మల్టీ పర్పస్ స్మశాన వాటిక నిర్మాణం, మౌలిక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.. వీటి ద్వారా రాజధాని గ్రామాలలో నాణ్యమైన విద్య వైద్య సదుపాయాలు కలగనున్నాయి. వీలైనంత త్వరగా మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గ్రామ కంఠాలు, జరీబు భూములు జరీబు, లంక భూములు సమస్యలపై ప్రతిరోజు అధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. లంక భూములకు ఎన్జీటీ అనుమతులు ఇవ్వడం లేదని, ఒకరిద్దరు రైతులు తమకు కోరుకున్న చోటా ఫ్లాట్స్ కావాలని డిమాండ్ చేస్తున్నారని, నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడ రిటర్న్ బుల్ ఫ్లాట్స్ ఇచ్చే అవకాశం లేదనిలేదని మంత్రి నారాయణ తెలియజేశారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్‌లలో మౌలిక సదుపాయిల పనులు వేగంగా జరుగుతున్నాయని, రాజధానిలో మొత్తం 29,421 మంది రైతులకు 61,433 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇంకా కేవలం 2,270 మంది రైతులకు 7,988 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, ప్రతిరోజు 30 నుంచి 40 రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని వివరించారు. గత 21 రోజుల్లో 231 మందికి 443 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేసామని తెలిపారు. మొత్తం30,635 మంది రైతులలో 29,644 మందికి ప్లాట్లు కేటాయింపు పూర్తయిందని తెలిపారు. ఇంకా 991 మంది రైతులకు మాత్రమే ప్లాట్లు కేటాయించాల్సి ఉందని వివరించారు. కోర్టు కేసులు, కుటుంబ తగాదాలు కారణంగా ప్లాట్ల కేటాయింపు, పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఒకరిద్దరు రైతులు అనవసరంగా సోషల్ మీడియాలో రకరకాల పోస్ట్ పెడుతున్నారని, రైతుల ఎవరికీ అన్యాయం జరగదని రైతులకు ఏ సమస్య ఉన్న పరిష్కారం చూపిస్తామని మూడు సంవత్సరాల రాజధాని పూర్తి చేసి తీరుతామని మరోసారి మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# రైతుల ధాన్యం విక్రయాలకు వాట్సప్ సేవలు

- 7337359375 నంబరుకు హాయ్ అని పంపాలి
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: రైతులు ధాన్యం విక్రయించేందుకు వాట్సప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరులో ధాన్యం రైతులతో మాట్లాడిన తర్వాత గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. 7337359375 నంబరుతో సేవలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ధాన్యం అమ్మదల్చిన రైతులు వాట్సప్ నెంబరుకు హాయ్ అనే మెసేజ్ పంపగానే ఏఐ ద్వారా ప్రత్యేక వాయిస్‌తో సేవల వినియోగంపై మార్గదర్శకం చేస్తుందని చెప్పారు. రైతు తన ఆధార్ నంబరు నమోదు చేశాక పేరును ధృవీకరించాలి. తర్వాత ధాన్యం అమ్మదల్చిన తేదీకి మూడు ఆప్షన్లు ఇస్తుంది. ఏదో ఒక తేదీని సమయాని న్ని నిర్ణయించుకోవాలి. తర్వాత ధాన్యం రకం నమోదు చేశాక ఎన్ని బస్తాలు అమ్ముతారో నమోదు చేయాలి. తర్వాత ఓ మెసేజ్ ద్వారా రైతులకు ధాన్యం అమ్మకం స్లాట్ బుక్ అయినట్లు కూపన్ కోడ్ వస్తుంది. దీంతో రైతు తాను ఎంచుకున్న కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్ళి సులభంగా ధాన్యాన్ని అమ్మవచ్చని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి మనోహర్ చెపా ్పరు. చిర్రావురులో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించాక...రైతుల వద్ద ఉన్న ధాన్యం నాణ్యతను చూశారు. 4వేల రైతు సేవాకేంద్రాలతో పాటు 3వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.680 కోట్ల విలువైన ధాన్యం కొన్నామని, కొన్న రోజే రైతుల ఖాతాలకు నగదు జమచేసినట్లు చెప్పారు. తేమ శాతం పేరిట మిల్లర్లు ఇబ్బందులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తన ధాన్యం అమ్మకం తేదీ, సమయాన్ని బట్టి తాను ఎంచుకున్న కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి సులభంగా ధాన్యాన్ని ఎలాంటి బాదరబందీ లేకుండా అమ్ముకోవచ్చు. ప్రతి ఆప్షన్ కేవలం ఒక క్లిక్ తో రైతు సులభంగా స్లాట్ బుక్ చేసుకునే విధంగా వాట్సప్ ఆప్షన్లు అందరికీ అర్థమయ్యే రీతిలో ఇవ్వడం విశేషం. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గంటలకు గంటలు రైతులు వేచి ఉండటం... ధాన్యాన్ని ఎప్పుడు కొంటారా అని కొనుగోలు కేంద్రాల వద్ద బతిమిలాడుకోవడం వంటి విషయాలకు చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే విధానం తరహాలో ఈజ్ ఆఫ్ డూయింగ్ ఫార్మర్ సర్వీస్ చేస్తోంది మా కూటమి ప్రభుత్వం. ఇది రైతులకు మేలు చేసే ప్రభుత్వం. వారి ఇబ్బందులను గ్రహించి సాంకేతికత వినియోగించి ధాన్యం కొనుగోలు సరళతరం చేశాము. ఈజ్ ఆఫ్ డూయింగ్ ఫార్మర్ సర్వీస్ కింద ఈ సేవలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు.

# నేరాల నియంత్రణలో ఎపి టాప్

- ఉగ్రవాదులు, తీవ్రవాదుల అణిచివేతలో దేశంలోనే ప్రథమ స్థానం
- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా వెల్లడి



విజయవాడ, నవంబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ వృత్తిపరంగా అన్నిరంగాలలోనూ నేర నిరోధక విభాగంలో, అరాచకశక్తుల పీచుమణచడంలో, ఉగ్రవాదులు, తీవ్రవాదుల అణిచివేతలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థ నిఘా విభాగంలో ఎప్పటినుంచో దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతూ అనేక రాష్ట్రాలకు ఈ విషయంలో మార్గదర్శకంగా ఉన్న విషయం జగద్విదితమే. అయితే కొన్ని, సామాజిక మాధ్యమాల్లో రాజకీయ దురుద్దేశంతో ఆంధ్రప్రదేశ్ పోలీసుల గొప్పదనాన్ని, సాధించిన ఘనతను శ్లాఘించలేక కుట్రపూరితమైన ఉద్దేశంతో... తప్పుడు కథనాలను ప్రచారం చేస్తూ... పోలీస్ ఫోర్స్ యొక్క ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని, ప్రజలలో భయము, అభద్రతా, అపనమ్మకం కలిగించాలనే రాజకీయపరంగా కొందరికి లబ్ధిపొందాలనే చెడు ఉద్దేశంతో తప్పుడు కథనాలను వండి వార్చుతున్నాయి. కొత్తగా వచ్చిన చట్టాలు అమలులో ఏపీ పోలీస్ శాఖ అన్ని విభాగాలలో ముందంజలో ఉంది. ఈ కొత్త చట్టాల అమలు విషయంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హెం మంత్రి ఎప్పటికప్పుడూ సమీక్షి స్తూ మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. కానీ జాతీయ నేర విభాగ సంస్థలో సాంకేతికపరమైన సమస్యలతో మనం అందించిన సమాచారాన్ని వారు అప్డేట్ చేయకపోవడం వలన అది ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఈ విభాగంలో వెనుకబడి ఉన్నదనే అసత్య ప్రచారం చేస్తున్నారు. ఈ విషయం పోలీస్ శాఖ దృష్టికి రాగానే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. కొన్ని పత్రికలు, సోషల్ మీడియా విభాగాలు సాంకేతికపరమైన లోపాలతో సమాచారం అప్డేట్ చేయకపోవడాన్ని పోలీస్ శాఖ యొక్క వైఫల్యంగా అభివర్ణిస్తూ... సరిగా పనిచేయడం లేదని ప్రచారం చేస్తూ వారి వారి దురుద్దేశాలను బైట పెట్టకుంటూ ప్రజలలో పోలీసులపై ఉన్న నమ్మకాన్ని, గుర్తింపును దెబ్బతీయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తూ... ఈ తప్పుడు కథనాలను ప్రచారం చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ తీవ్రంగా ఖండిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ యొక్క స్థానం ఎందుకు కింద ఉన్నదో అని విచారణ చేయకుండా... పోలీస్ శాఖ నుంచి వివరణ కోరకుండా దురుద్దేశపూర్వకంగా ఈ తప్పుడు ప్రచారాలను చేయడాన్ని పోలీస్ శాఖ తీవ్రంగా ఖండిస్తూ ఈ ప్రకటన విడుదల చేయడం జరిగింది. ఈ కొత్త చట్టాల అమలులో ఏపీ పోలీస్ శాఖ ఎప్పుడూ ముందంజలోనే ఉంది. ఇందుమూలంగా సామాన్య ప్రజలు, విజ్ఞులు, విజ్ఞానవంతులు, మేధావులు ఇటువంటి తప్పుడు ప్రచారాన్ని ఖండించి పోలీస్ శాఖకు ఎప్పటివలనే వాళ్ల సహాయ, సహకారాలు అందిస్తూ.. ప్రజలకు మరింత సేవ చేయడానికి సహకరించవలసిందిగా ఏపీ పోలీస్ అభ్యర్థిస్తుంది. భవిష్యత్తులో కూడా పోలీస్ శాఖ దేశంలోనే మొట్ట మొదటి స్థానంలో కొనసాగేటట్టు సహకరించాలని అన్నివర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. పోలీస్ శాఖ పై దురుద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టప్రకారం చర్యలుంటాయని, అటువంటి పనులు భవిష్యత్తులో చేయవద్దని వారికి కూడా విజ్ఞప్తి చేస్తున్నాము. ఇటువంటి తప్పుడు ప్రచారాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించటం జరిగింది.



# గురుకుల విద్యార్థి చికిత్సకు రూ.10 లక్షల సాయం

**సిఎంకు కృతజ్ఞతలు చెప్పిన మంత్రి డోలా**

విజయవాడ, నవంబరు 21 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి చికిత్స కోసం సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ.10 లక్షలు ఆర్థిక సాయం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కొల్లివలస డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బోనెల చరణ్ గత కొద్ది రోజులుగా జీబీ సింద్రోమ్ బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి డా. స్వామి అధికారులతో మాట్లాడి మొదట విద్యార్థిని విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు, అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంతో మాట్లాడి వైద్యానికి అవసరమైన రూ.10 లక్షలు సీఎం.ఆర్.ఎఫ్ ద్వారా మంత్రి శుక్రవారం మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..... పేదింటి విద్యార్థి ప్రాణాలు కాపాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు. పేద విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారనేదానికి ఇదే నిదర్శనం. ఇప్పటి వరకు అనారోగ్యానికి గురైన సుమారు 37 మంది అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేక చొరవతో ఉచిత వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడినట్టు మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి తెలిపారు.



క్రీడాకారులతో చెస్ ఆడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

# అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

**- రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**

విజయవాడ (గన్నవరం), నవంబరు 21 ప్రభాతవార్త: చదరంగంలో మన రాష్ట్రక్రీడాకారులను అంతర్జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాద్యత కోచ్‌లపై ఉందని రాష్ట్ర యువజన క్రీడల శాఖ మం త్రి మండిపల్లి రాంప్రసాద్ అన్నారు. ఇకోరేన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-25 శనివారం నుండి రెండురోజులపాటు విజయవాడలోని మెరీస్టెల్లా కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. శుక్రవారం మంత్రి టోర్నమెంట్ ముందస్తు ఏర్పాట్లు పరిశీలించి క్రీడాకారులతో ముచ్చటించారు. ఈసందర్బంగా మం త్రి మాట్లాడుతూ ఇటువంటి టోర్నమెంట్‌లు నిర్వహించటం ద్వారా క్రీడాకారుల ప్రతిభ మెరుగు పడుతుందన్నారు. చెస్ క్రీడాకారులు టోర్నమెంట్‌లలో ఎక్కువగా పాల్గొనాలని సూచించారు. చదరంగం క్రీడాకారులకు ప్రభుత్వం తగు ప్రోత్సాహాన్నిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. మం త్రి మండిపల్లి రాంప్రసాద్ కొద్దిసేపు చదరంగం ఆడి క్రీడాకారులను ఉత్సాహపరచారు.

# ఎన్‌టిఆర్ జిల్లాలో గన్నవరం విలీనం చేయాలి

**- ప్రభుత్వానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి**



గన్నవరం, నవంబరు 21 ప్రభాతవార్త: కృష్ణాజిల్లాలో ఉన్న గన్నవరం నియోజకవర్గాన్ని పరిపాలనా సౌలభ్యం, ప్రజల కోరిక మేరకు ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ప్రభుత్వానికి మరోమారు విజ్ఞప్తి చేసారు. ఈమేరకు జిల్లాల పునర్విభజన కోసం ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీకి శుక్రవారం గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావ్ తన తుది నిర్ణయాన్ని తెలియచేసారు. భౌగోళికంగా చూస్తే గన్నవరం నియోజకవర్గం ఎన్‌టిఆర్ జిల్లా కేంద్రమైన విజయవాడకు సమీపంలో ఉందని, మచిలీపట్నం దూరంగా ఉండటంతోపాటు, ఈప్రాంత వాసులకు రవాణా పరంగానూ మచిలీపట్నం కన్నా విజయవాడ అనుకూలంగా ఉంటుందన్నారు. గన్నవరం నియోజకవర్గాన్ని కృష్ణాలో ఉంచాలా, ఎన్‌టిఆర్‌లో కలపాలా అనే అంశంపై తాను ప్రత్యేకంగా ఒబృందంతో నియోజకవర్గంలో సర్వే నిర్వహించగా మెజార్టీ ప్రజలు ఎన్‌టిఆర్ జిల్లాలోనే విలీనం చేయాలని కోరారని, వారి కోరిక ప్రకారం తాను ఈనిర్ణయం తీసుకున్నట్లు యార్లగడ్డ తెలిపారు. గన్నవరాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేయాల్సిందేనని మంత్రుల కమిటీని డిమాండ్ చేసారు. ఎన్‌టిఆర్ స్వగ్రామమైన నందమూరు కృష్ణాజిల్లాలో ఉండటంతో కృష్ణా జిల్లాను ఎన్‌టిఆర్ జిల్లాగానూ, కృష్ణాబ్యారెజ్ ఉన్నందున ఎన్‌టిఆర్‌జిల్లాను కృష్ణాజిల్లాగానూ పేర్లుమార్పు చేయాలని కమిటికీ యార్లగడ్డ సూచించారు.

22-11pg10 12 ONG_22-11pg10.qxd 21/Nov/25 10:13 PM Page 1



# నేడే సౌతాఫ్రికాతో కీలక పోరు





## రిషబ్ కెప్టెన్సీలో ఆరుగురు స్పెషలిస్టులు

### చావోరేవో తేల్చుకోనున్న టీమిండియా

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో చావోరేవో తేల్చుకునేందుకు టీమిండియా సిద్ధమైంది. సిరీస్‌లో 0-1 తేడాతో వెనుకబడిన భారత జట్టు గౌహతిలోని బర్సపారా క్రికెట్ స్టేడియంలో రెండో మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్ అవుతుంది. సిరీస్‌ను కాపాడుకో వాలంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ మ్యాచ్ గెలవా ల్సిందే. ఈ నెల 22 నుండి మొదలయ్యే ఈ రెంటో టెస్టు మ్యాచ్‌ల్లో విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని రిషబ్ పంత్ కెప్టెన్సీలోని టీమిండియా పట్టుదలతో ఉంది. ఇక భారత దక్షి ణాఫ్రికా జట్ల మధ్య జరిగే ఈ రెండో టెస్టు ప్రత్యేకంగా నిలవనుంది. ఈశాన్య ప్రాంతంలో సూర్యోదయం త్వరగా ఉండటంతో ఆట ప్రారంభ సమయం, విరామాలు మారనున్నాయి. ఉదయం 9 గంటలకే తొలి బంతి పడనుంది. చలికాలంలో సూర్యకాంతి త్వరగా తగ్గిపోవడంతో రోజుకు 90 ఓవర్లు పూర్తి చేయడానికి బిసిసిఐ ఈ మార్పులు చేసింది. ఇది భారత టెస్టు క్రికెట్‌లో ఇలాంటి షెడ్యూల్‌తో మ్యాచ్ జరగడం కూడా మొదటిసారి. కాగా ఈ సిరీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పి కారణంగా దీనికి దూరంగా ఉన్నాడు. శుభ్‌మన్ స్థానంలో రిషబ్ పంత్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) నియమించింది. అయితే తుది జట్టులో గిల్ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్నది మాత్రం ప్రశ్నార్థ కంగా మిగిలింది. మరోపక్క ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేయడంలో గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు మేనేజ్‌మెంట్‌కు కొన్ని ముఖ్యమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో సాయి సుదర్శన్ లేదా నితీష్ కుమార్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. అదనపు స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను బెంచ్‌కే పరిమితం చేసే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ మాత్రమే పాల్గొన్నారు. గిల్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకుని టెస్ట్‌లో ఆడాలనుకున్న ప్పటికీ, జట్టు యాజమాన్యం అతని భవి ష్యత్తును దృష్టిలోఉంచుకుని ఎటువంటిరిస్క్ తీసుకోవ డానికి సిద్ధంగా లేదు.

ఈ మ్యాచ్‌లో ఆరుగురు స్పెషలిస్టు బ్యాటర్లు, ఇద్దరు సీమర్లు, ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా బరిలోకి దిగబోతోంది. గుహవాటిలో గెలవాలంటే ఇదే సరైన కాంబినేషన్‌గాభావిస్తోంది. దీంతో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను తప్పించే అవకాశాలు ఉన్నాయి. బ్యాటింగ్, బౌలింగ్‌లో వైవిధ్యం కోసం అతడిపై వేటు పడనుంది..



## డెఫ్లింపిక్స్‌లో దీక్షకు మరో స్వర్ణం

**న్యూఢిల్లీ:** డెఫ్లింపిక్స్‌లో దీక్షా డాగర్ వరుసగా రెండో స్వర్ణం గెలుచుకుంది. జపాన్‌లోని టోక్యోలో జరిగిన 25వ సమ్మర్ డెఫ్లింపిక్స్‌లో భారత గోల్ఫ్ క్రీడాకారిణి దీక్ష డాగర్ తన బంగారు పతకాన్ని కాపాడుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. టోక్యోలోని పార్-72 వాకాసు గోల్ఫ్ లింక్స్‌లో దీక్ష 68, 65, 72 రౌండ్లు సాధించి మహిళల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే పోటీలో 14 స్ట్రోక్ తేడాతో పోడియంను అగ్రస్థానంలో నిలిపింది. 2021 డెఫ్లింపిక్స్‌లో స్వర్ణం మరియు 2017 ఎడిషన్ గేమ్స్‌లో రజతం గెలుచుకున్న దీక్ష, మూడు రోజుల మొత్తం 11అండర్ 205 పాయింట్లను నమోదు చేసింది. ఫ్రాన్స్‌కు చెందిన మార్గాక్స్ రెజో మొత్తం మూడు ఓవర్లలో 219 పాయింట్లతో రెండో స్థానంలోను, కెనడాకు చెందిన ఎరికా డాన్ రివార్డ్ ఐదు ఓవర్లలో 221 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 24 ఏళ్ల దీక్ష, ప్రపంచవ్యాప్తంగా డెఫ్లింపిక్స్, ఒలింపిక్ క్రీడలలో దేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణి. ఆమె టోక్యో 2020 మరియు పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించింది. ఆమె స్వదేశీయులు హర్ష్ సింగ్, మూడు రోజుల పాటు 22 ఓవర్ల 238 స్కోరుతో, సోలో 12వ స్థానంలో, విభు త్యాగి 24ఓవర్ల 240 స్కోరుతో 14వ స్థానంలో నిలిచింది.

### మహిళల కబడ్డీ ప్రపంచ కప్..

## సెమీఫైనల్‌కు భారత్

### జర్మనీ 63-22 తేడాతో ఓటమి



**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్-2025లో జర్మనీని ఓడించి భారత్ పూల్ ఎ లో అగ్రస్థానంలో నిలిచింది. ఢాకాలోని షహీద్ సుహ్రావర్ది ఇండోర్ స్టేడియంలో జరిగిన చివరి పూల్ ఎ మ్యాచ్‌లో జర్మనీపై 63-22 తేడాతో ఘన విజయం సాధించిన తర్వాత భారత్ మహిళల కబడ్డీ ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్లుగా మూడు ఔటింగ్‌లలో మూడు విజయాలు, +143 పాయింట్ల తేడాతో గ్రూప్ దశను పూర్తి చేసింది. థాయిలాండ్ (65-20), ఉగాండా (72-15) పై సమగ్ర విజయాల తర్వాత, భారత్ జర్మనీపై మరో దృఢమైన ప్రదర్శనను కనబరిచింది. హాఫ్ టైం ముగిసే సమయానికి 329 ఆధిక్యంలో ఉంది. జర్మనీ రక్షణాత్మక లోపాలను సద్వినియోగం చేసుకుని రైడింగ్ యూనిట్ 12 బోనస్ పాయింట్లు సాధించి 48 విజయవంతమైన రైడ్‌లను పూర్తి చేసింది. నిధి శర్మ 15 రైడ్ పాయింట్లతో అత్యుత్తమంగా నిలిచింది, కెప్టెన్ రీతు నేగి సూపర్ రైడ్‌తో సహా 10 పాయింట్లను అందించింది. 25 టాకిల్ పాయింట్లను నమోదు చేసింది. మోహిత్ రాణి ఎనిమిది టాకిల్ పాయింట్లు అందించాడు మరియు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయింది. పూల్ ఎ ముగిసిన తరువాత, భారత్ తొమ్మిది పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది, బంగ్లాదేశ్, థాయిలాండ్, ఉగాండా, జర్మనీ కంటే ముందుంది..

### ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో..

## బంగ్లాదేశ్ 194 రన్స్ భారీ స్కోర్

### ఆట ముగిసేసరికి 53తో టీమిండియా



**న్యూఢిల్లీ:** ఏసిసి మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీ-2025లో టీమిండితో జరుగుతున్న మ్యాచ్‌లో బంగ్లాదేశ్ భారీ స్కోర్ చేసింది. దోహా వేదికగా శుక్రవారం తొలి సెమీ ఫైనల్ టాస్ గెలిచిన భారత్ బంగ్లాదేశ్‌ను బ్యాటింగ్‌కు అహ్వానించింది. ఓపెనర్ హబిబుర్ రెహ్మాన్ సోహన్ (65), ఆఖర్లో మెహ్రాబ్ (48 నాటౌట్) చెలరేగడంతో బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 194 పరుగుల భారీ స్కోర్ చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌ల జిషన్ అలమ్ (14 బంతుల్లో 26, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), జవాద్ అబ్రార్ (13), యాసిర్ అలీ (9 బంతుల్లో 17 నాటౌట్, 2 ఫోర్లు, సిక్స్) ఓ మోస్తరు ఇన్నింగ్స్ ఆడారు. ఆ జట్టు కెప్టెన్ అక్బర్ అలీ 9 పరుగులు, మహిదుల్ ఇస్లాం ఒక పరుగు చేయగా, అబూ హైదర్ డకౌటయ్యాడు. భారత్ బౌలర్లలో విజయకుమార్ వైశాక్ (4-0-51-0) భారీ పరుగులు సమర్పించుకోగా, గుర్‌జప్నీత్ సింగ్ (4-0-39-2), హర్ష దూబే (4-0-22-1), సుయాశ్ శర్మ (4-0-17-1) అద్భుతంగా బౌలింగ్ చేశారు. రమన్‌దీప్ సింగ్ (2-0-29-1), నమన్ ధిర్ (2-0-33-1) పర్వాలేదనిపించాడు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో భారత్ ఓపెనర్లు చెలరేగిపోయారు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ (38 నాటౌట్), మరో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (15 నాటౌట్)తో భారీ షాట్లు ఆడుతున్నారు. ఫలితంగా ఆట ముగిసే సమయానికి భారత్ 3.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 53 పరుగులు చేసింది.

### ఇండియన్ ఓపెన్ స్క్వాష్..

## సెమీఫైనల్‌కు అనాహత్, జోష్నా





**న్యూఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ స్క్వాష్‌లో అనాహత్ సింగ్, జోష్నా చిన్నప్ప సెమీఫైనల్‌కు చేరుకున్నారు. పిఎస్ఎ కాంస్య టోర్నమెంట్ అయిన డాలీ కాలేజ్ ఎస్సార్‌ఎఫ్ఐ ఇండియన్ ఓపెన్ మహిళల డ్రాలో భారత్ రెండు సెమీఫైనల్ బెర్తులను కైవసం చేసుకుంది. అనాహత్, జోష్నా అద్భుతమైన క్వార్టర్ ఫైనల్ విజయాలు నమోదు చేశారు. టాప్ సీడ్ అనహాత్, జర్మన్ ఎనిమిదో సీడ్ కాటెరినా ట్రైకోవాను 11-5, 11-1, 11-4 తేడాతో ఓడించింది. ఈ టీనేజర్ ట్రైకోవాను ప్రారంభం నుండే పోటీని నియంత్రించింది. రెండవ ఆటలో అనహాత్ తన ప్రత్యర్థికి ఒక పాయింట్ మాత్రమే ఇచ్చింది. చివరి దశల వరకు పూర్తి ఆధిపత్యాన్ని కొనసాగించి సెమీఫైనల్‌కు చేరుకుంది. అనుభవజ్ఞురాలైన జోష్నా చిన్నప్ప కూడా 11-4, 11-6, 11-3 తేడాతో స్పెయిన్‌కు చెందిన సోఫియా మాటియోస్‌ను ఓడించి ముందుకు సాగింది. మొదటి గేమ్‌లో ముందుకు సాగి, రెండవ గేమ్‌లో మాటియోస్ నుండి వచ్చిన చిన్న సవాలును ఎదుర్కొని జోష్నా మ్యాచ్‌ను సమర్థవంతంగా ముగించింది. ఇక పురుషుల డ్రాలో భారత్‌కు చెందిన రమిత్ టాండన్ టాప్ సీడ్ యూసఫ్ సోలిమాన్ చేతిలో ఓటమి పాలయ్యాడు. తొలి గేమ్‌లో ఓడిపోయిన తర్వాత టాండన్ కోలుకుని తరువాతి రెండు గేమ్‌లను 2-1తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. అయితే, నాల్గవ గేమ్‌లో సోలిమాన్ తిరిగి ఊపందుకుని పోటీని 11-5తో ముగించాడు. చివరి దశల్లో ఈజిప్టు ప్లేయర్ 11-5, 9-11, 3-11, 11-3, 11-5 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్లో చోటు దక్కించుకున్నాడు.

# వారాంతంలో తప్పని నష్టాలు

### సెన్సెక్స్, నిఫ్టీల్లో

## అమ్మకాల వెల్లువ




**ముంబయి, నవంబరు 21:** భారత స్టాక్ మార్కెట్లలో రెండు రోజుల లాభాల తర్వాత మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో దాదాపు అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 400.76 పాయింట్లు క్షీణించి 85,231.92 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 124 పాయింట్లు నష్టపోయి 26,068.15 వద్ద ముగిసింది. అమెరికాలో వ్యవసాయేతర కార్మికడేటా బలంగా ఉండటంతో డిసెంబర్‌లో వడ్డీ రేట్ల కోతపై ఆశలు సన్నగిల్లడం ఆసియా మార్కెట్లపై ప్రభావం చూపింది. రూపాయి బలహీనపడటం, మ్యానుఫ్యాక్చరింగ్ పీఎంఐ గణాంకాలు నిరాశపరచడం కూడా నష్టాలకు కారణమయ్యాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ సూచీ 2.34 శాతం పడిపోయింది. పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ రంగాలు కూడా 1.43 శాతం, 1.86 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, ఒక్క ఎఫ్ఎంసీజీ రంగం మాత్రమే 0.14 శాతం స్వల్ప లాభంతో గ్రీన్ జోన్‌లో ముగిసింది. బ్రాడర్ మార్కెట్‌లో మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 1 శాతానికి పైగా నష్టపోయాయి. ప్రధాన షేర్లలో మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, ఎం అండ్ ఎం లాభపడగా టాటా స్టీల్, హెచ్‌సీఎల్‌టెక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ భారీగా నష్టపోయాయి. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 26,000 25,900 స్థాయిల వద్ద బలమైన మద్దతు లభిస్తోంది. 26,200 పైన స్థిరపడితేనే తదుపరి అప్‌ట్రెండ్ మొదలయ్యే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. ఇక బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ స్మాల్‌క్యాప్‌సూచీలు రెండూ కూడా 1.30శాతంచొప్పున క్షీణించాయి. మొత్తం 1872 కంపెనీలు పెరిగితే 2304 కంపెనీలు క్షీణించాయి. 186 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ 0.38శాతం పెరిగి 1,23,191కి చేరాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 89.59వద్ద తచ్చాడింది. ఇక కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడించమురు జనవరి సెటిల్‌మెంట్‌కు చేసినవి 1.03 సెంట్లు తగ్గి బ్యారల్‌కు 62.35 చొప్పున కొనసాగాయి. వారంతం మార్కెట్‌లో హిందాల్కో 2.81శాతం క్షీణించింది. బిలియన్‌బ్రెన్స్ గారేజ్ వెంచర్స్ గ్రో 0.84శాతంపెరిగింది. ఆర్ఎంసి స్విచ్‌గేర్స్ 2.11శాతం పెరిగితే ఇంటర్‌గ్లోబ్‌ఏవియేషన్ ఇండిగో 0.92శాతం పెరిగాయి. రేట్‌గెయిన్ ట్రావెల్ టెక్నాలజీస్ 4.13శాతం క్షీణించాయి. ఎక్సెల్‌సాఫ్ట్ ఐపిఒకు 37.55 రెట్లు కొనుగోళ్లు జరిగాయి. 19న ప్రారంభించినీ ఇష్యూ 21తో ముగిసింది.ఐపిఒ ధరలు రూ.114నుంచి 120గా నిర్ణయించారు. సుదీప్‌ఫార్మాకూడా 1.11రెట్లు ఎక్కువ బిడ్లు దాఖలయ్యాయి. 25వతేదీ బిడ్డింగ్ ముగుస్తుంది. ఐపిఒ ఇష్యూధరలు రూ.563 నుంచి రూ.593గా కంపెనీ నిర్ణయించింది.

## మార్కెట్లకు ఇన్‌ఫ్రాట్రస్టుల అనుసంధానం

### సెబీ ఛైర్మన్ తుహిన్‌కాంత పాండే



**న్యూఢిల్లీ, నవంబరు 21:** స్టాక్ మార్కెట్లనియంత్రణ సంస్థ సెబీ ఇపుడు కొత్తగా మౌలికవనరుల ట్రస్టులు, మార్కెట్లమధ్య లింక్‌ను మరింతగా పెంచాలనినిర్ణయించింది. రీట్స్ అండ్ ఇన్విట్స్ 2025 సదస్సులో సెబీ ఛైర్మన్ తుహిన్‌కాంత పాండే తాము ఈ అనుసంధానతను పెంచడం ద్వారా రీట్, ఇన్వెట్‌లలోకి మరింతగా పెట్టుబడులు రాగలవని చెప్పారు. ప్రైమరీ మార్కెట్ల పరంగా ఐపిఒలద్వారా నిధులు సేకరణ మరింత సులభతరంచేసామని రైట్స్ ఇష్యూ, బాండ్లజారీ ప్రక్రియ మాత్రమే కాకుండా ఇపుడు ఇన్వెట్స్, రీట్స్‌లో కూడా పెట్టుబడులకు సరళీకృత విధానాలు అమలుచేయాలని యోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం తాము ఆర్థిక మంత్రిత్వ శాఖ, అనేక రాష్ట్ర ప్రభుత్వాలనను కూడా ఇందులో భాగస్వాములను చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే బీమా క్రమబద్ధీకరణ అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డిఎఐ), పెన్షన్‌ఫండ్ రెగ్యులేటర్ డెవలప్‌మెంట్ అథారిటీ పిఎఫ్‌ఆర్డీయే, ఇపిఎఫ్‌ఒల వంటి వాటిని కూడా వీటిలో పెట్టుబడులకు భాగస్వాములను చేయాలని సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు.అమెరికాలో అయితే రీట్స్ ఆస్తులు 360 లక్షలకోట్ల రూపాయలవరకూ ఉన్నాయని, జపాన్, సింగపూర్‌లలో గ్లోబల్ లిస్ట్ చేసిన రియాల్టీ మార్కెట్ సంస్థలున్నట్లు తెలిపారు. భారత్ ఇప్పటికీ 12శాతం వద్దనే ఉందన్నారు. ప్రస్తుతం భారత్‌లో 24 లిస్టెడ్ ఇన్విట్స్ ఉన్నాయని, రోడ్లు, విద్యుత్ పంపిణీ, పునరుత్పత్తి ఇంధనం, టెలికాం, గోదాములు, వాణిజ్య రియాల్టీల్లో విస్తరించాయని రీట్స్ మొత్తం విలువలు, ఇన్వెట్స్, ఎస్ఎం రీట్స్ మొత్తం కలిపితే 9.25 లక్షలకోట్లవరకూ ఉన్నాయని, ఏడులక్షలకోట్లు ఇన్విట్స్‌లోను, రూ.2.25 లక్షలకోట్లు రీట్స్, ఎస్ఎంరీట్స్‌లో ఉన్నాయని అన్నారు.

మహారాష్ట్ర ప్రభుత్వం అయితే రాష్ట్ర ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు ఏర్పాటుచేసిందని, రాష్ట్ర స్థాయిలో ఇన్‌ఫ్రా రంగంలో ఫండింగ్ ప్రోత్సహిస్తోందని తుహిన్‌కాంత పాండే అన్నారు. మున్సిపల్ బాండ్లు, రాష్ట్రస్థాయి ఇన్వెట్స్ సహజంగానే మరింత రాణిస్తాయని అన్నారు.



## క్షీణించిన పసిడి, వెండి ధరలు

**న్యూఢిల్లీ, నవంబరు 21:** బంగారం, వెండి ధరలు ఈరోజు భారీగా పతనమయ్యాయి. అమెరికాలో సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఉద్యోగాల గణాంకాలు అంచనాలను మించి బలంగా నమోదు కావడంతో ఫెడరల్ రిజర్వ్ సమీప భవిష్యత్తులో వడ్డీరేట్లను తగ్గించకపోవచ్చనే అంచనాలు పెరిగాయి. ఈ పరిణామం పసిడి ధరలపై ప్రతికూల ప్రభావాన్నిచూపింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 10గ్రాములకు రూ. 1,067 (0.87శాతం) తగ్గి రూ. 1,21,697 వద్దకు చేరింది.వెండి డిసెంబర్ కాంట్రాక్టులు కిలోకు రూ.3,349 (2.17శాతం)పతనమై రూ. 1,50,802వద్ద ట్రేడ్ అయ్యాయి. ఇండియా బులియన్ అండ్‌జువెలర్స్ అసోసియేషన్ (ఐబిజెఎ) ప్రకారం 24క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు గురువారం నాటి రూ. 1,22,881 నుంచి రూ. 1,22,149కి దిగివచ్చింది.

## బిట్‌కాయిన్ భారీ పతనం



**ముంబయి, నవంబరు 21:** ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ భారీగా పతనమైంది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో డిజిటల్ ఆస్తులలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో, శుక్రవారం బిట్‌కాయిన్ ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ట్రేడింగ్ సెషన్‌లో బిట్‌కాయిన్ 7.18 శాతం నష్టపోయి 85,966.75 డాలర్ల వద్దకు చేరింది. దీని మార్కెట్ విలువ 1.71 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా, గత 24 గంటల్లో ట్రేడింగ్ వాల్యూమ్ 94 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇదే బాటలో, రెండో అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన ఈథర్ కూడా 7.92 శాతం తగ్గి 2,797.50 డాలర్లకు పడిపోయింది.అమెరికా ఆర్థిక పరిస్థితులపై నెలకొన్న అనిశ్చితి కారణంగానే క్రిప్టో మార్కెట్ పతనమవుతోందని విశ్లేషకులఅంచనా. సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఉద్యోగాల డేటాలో నిరుద్యోగం ఊహించిన దానికంటే ఎక్కువగా నమోదు కావడం ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచింది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై అనుమానాలు మొదలయ్యాయి. ఫలితంగా, పెట్టుబడిదారులు క్రిప్టో కరెన్సీల వంటి ప్రమాదకర ఆస్తుల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఈ వారం మొత్తం బిట్‌కాయిన్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మంగళవారం ఏడు నెలల్లో తొలిసారిగా 90,000 డాలర్ల దిగువకు పడిపోయింది. ఈ తాజా పతనంతో 2025లో సాధించిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. అక్టోబర్‌లో నమోదైన 1,26,000 డాలర్ల గరిష్ట స్థాయి నుంచి బిట్‌కాయిన్ ఇప్పుడు దాదాపు 30 శాతం నష్టపోయింది. అదేవిధంగా, ఈథర్ కూడా ఆగస్టులో ఉన్న 4,955 డాలర్ల గరిష్ఠ స్థాయి నుంచి సుమారు 40 శాతం పతనమైంది.

## ఎస్ఎంఇ ఐపిఒలపై ఇన్వెస్టర్ల ఫోకస్

### ఈవారం మూడు కొత్త ఐపిఒలు రాక..




**ముంబయి, నవంబరు 21:** దలాల్‌స్ట్రీట్‌లోని ప్రైమరీ మార్కెట్ కార్యకలాపాలు అత్యంత రద్దీగా జరిగిన లావాదేవీలు వచ్చేవారంలో కొంతమేర తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఈనెల 24నుంచి 28వ తేదీవరకూ కొంతమేర స్తబ్దత కనిపించే అవకాశం ఉంది. మెయిన్‌బోర్డు ఐపిఒ ప్లాట్‌ఫామ్‌లో ఇప్పటికే 92 కంపెనీలు ఐపిఒకు వచ్చి దలాల్‌స్ట్రీట్‌లోప్రవేశించాయి. ఇకపై కొతనత ఐపిఒలు వచ్చేవారంలో వచ్చే అవకాశాలు లేవు. అయితే ఎస్ఎంఇ ప్లాట్‌ఫామ్‌లో మాత్రం కొత్తగా రెండు ఐపిఒలు వస్తున్నాయి. మెయిన్‌బోర్డు ఇన్వెస్టర్లు ప్రధానంగా ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్, సుదీప్ ఫార్మా ఐపిఒలపైనే ఎక్కువ ఫోకస్‌పెంచారు. పరిమిత మెయిన్‌బోర్డు కార్యకలాపాలతో అనే ఎస్ఎంఇ ఆఫర్లు వచ్చేవారంలో రానున్నట్లు అంచనా. అయితే వీటిలో ఎంపిక చేసిన ఇన్వెస్టర్లకు మాత్రమే అవకాశాలున్నాయి. మెయిన్‌బోర్డు ఐపిఒలో ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్, సుదీప్‌ఫార్మాలు రెండూ కూడా 26వ తేదీ ఒకటి, 28వ తేదీ మరో కంపెనీ వస్తోంది. ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీ 500 కోట్లు ఐపిఒద్వారా సమీకరించనున్నది. కేటాయించే విధానాలను 24వ తేదీ ఖరారుచేస్తుంది. ఇక సుదీప్‌ఫార్మాకూడా 895 కోట్ల నిధుల సమీకరణకు ప్రైమరీమార్కెట్లనుంచే సేకరించాలనినిర్ణయించింది. 26వ తేదీ కేటాయింపుల అంశం ఖరారవుతుంది. ఇక ఎస్ఎంఇ ఐపిఒ విభాగంలో గల్లార్డ్ స్టీల్ బిఎస్ఇ ఎస్ఎంఇ ప్లాట్‌ఫామ్‌పై 26వ తేదీ లిస్టింగ్‌చేస్తోంది. 37.5 కోట్ల నిధులు సమీకరించేందుకు నిర్ణఇంచింది. ఇన్వెస్టర్లు కొత్తగా వచ్చే మూడు ఎస్ఎంఇ ఆఫర్‌లపైనా ఫోకస్ పెంచారు. మదర్‌న్యూట్రీ ఫుడ్స్, కెకెసిల్క్ మిల్స్, ఎస్ఎస్ఎండి ఆగ్రోటెక్ ఇండియా కంపెనీలు ఐపిఒకు రానున్నాయి. కెకెసిల్క్ మిల్స్ 26వ తేదీనే బిడ్లను ప్రారంభిస్తుంది. ఎస్ఎస్ఎండి ఆగ్రోటెక్ ఇండియా ఇష్యూ మాత్రం 25నుంచి అందుబాటులోకి వస్తుందని స్టాక్ నిపుణులు వెల్లడించారు.

## 90కోట్ల మందిని కనెక్ట్ చేసిన టెలివిజన్ నెట్‌వర్క్




**న్యూఢిల్లీ, నవంబరు 21:** ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రసార రంగం తన అద్భుతమైన వృద్ధిని వెల్లడించింది. దేశంలో 23కోట్ల కుటుంబాల్లోని 90 కోట్ల మంది వీక్షకులను టెలివిజన్ నెట్‌వర్క్ కలుపుతోందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అధికారిక గణాంకాలను విడుదల చేసింది. 2025 మార్చి నాటికి దేశంలో 918 ప్రైవేట్ శాటిలైట్ ఛానళ్లు పనిచేస్తున్నాయని ఈ నివేదిక పేర్కొంది. భారత మీడియా, వినోద రంగం 2024లో దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.2.5 లక్షల కోట్లు అందించింది. ఇది 2027 నాటికి రూ.3 లక్షల కోట్లు దాటుతుందని అంచనా. కేవలం టెలివిజన్, బ్రాడ్‌కాస్టింగ్ విభాగం నుంచే 2024లో దాదాపు రూ.68,000 కోట్ల ఆదాయం సమకూరింది. డిజిటల్ విస్తరణ, 4కే ప్రసారాలు, స్మార్ట్ టీవీలు, 5జి, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు ఈ వృద్ధికి మరింత ఊతమిస్తున్నాయి. **డీడీ ఫ్రీ డిష్ కీలక పాత్ర:** దేశంలో డిజిటల్ సేవలను అందరికీ చేరువ చేయడంలో డీడీ ఫ్రీ డిష్ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6.5 కోట్ల ఇళ్లలో డీడీ ఫ్రీ డిష్ సేవలు అందుబాటులో ఉన్నాయి. 2014లో కేవలం 59 ఛానళ్లతో ప్రారంభమైన ఈ ఉచిత డీటీహెచ్ సేవ, 2025 నాటికి 482 ఛానళ్లకు విస్తరించడం విశేషం. 1959లో ప్రయోగాత్మకంగా ప్రారంభమై, 1982 ఏషియన్ గేమ్స్‌తో కలర్ టీవీ యుగంలోకి అడుగుపెట్టిన భారత టెలివిజన్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రసార నెట్‌వర్క్‌లలో ఒకటిగా నిలిచింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మార్గనిర్దేశంలో టెలివిజన్ రంగం దేశ సామాజికఆర్థికాభివృద్ధికి అద్దం పడుతోంది. నవంబర్ 21న ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ఏటా ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా ప్రసార భారతి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps